సత్యమేవ జయతే

# సాక్షి



‘అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం’

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 122

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంగళవారం 23-7-2019


# నవశకానికి నాంది




## కీలకమైన ఎనిమిది బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

### సీఎం వైఎస్ జగన్ చొరవతో సామాజిక విప్లవం దిశగా అడుగులు

**బలహీన వర్గాలకు బాసట**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులు, పనుల్లో

**50%**

**మహిళలకు అందలం**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సహా మహిళలందరికీ నామినేటెడ్ పదవులు, పనుల్లో..

**50%**

**స్థానికులకు పెద్దపీట**

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు

**75%**

**శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు**

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు సగర్వంగా తలెత్తుకున్నాయి..

సాధికారత ఉట్టి పడుతుండగా మహిళలు ఆత్మగౌరవంతో తొణికిసలాడారు..

ఇక రాష్ట్రంలో ఉపాధికి ఢోకా లేదంటూ యువతకు భవితపై భరోసా వచ్చింది..

ఇదంతా ఎన్నో ఏళ్ల కల.. ఎన్నాళ్లుగానో ఆరాటం.. అలుపెరగని పోరాటం..

వాటన్నింటినీ ఒక్కసారిగా నిజం చేసి చూపించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్..

ఆ కలను ఒక్క రోజులో సాకారం చేసి అద్భుతాన్ని ఆవిష్కరించి మన కళ్లముందు నిలిపారు..

ఈ అద్భుత చారిత్రక ఘట్టానికి రాష్ట్ర శాసనసభ వేదికగా నిలిచింది.. కొత్త చరిత్రకు తెరలేచింది..

క్షేత్ర స్థాయి నుంచి నిజమైన సామాజిక విప్లవాన్ని తీసుకువస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు, మహిళల రాజకీయ అవకాశాల కల్పన, ఆర్థిక ప్రగతి, హక్కుల పరిరక్షణకు సంబంధించి కీలక బిల్లులను సోమవారం రాష్ట్ర శాసనసభ ఆమోదించింది.

**సాక్షి, అమరావతి:** అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల హామీల అమలుకు వడివడిగా అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్ తన మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు దాదాపు 60 శాతం పదవులు కేటాయించి దేశం దృష్టిని ఆకర్షించిన ఆయన మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నిజమైన రాజకీయ అధికారం, ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ విధాన నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో అన్ని నామినేటెడ్ పదవుల్లో ఈ వర్గాలకు 50 శాతం పదవులు కేటాయించే బిల్లును సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. ఇక నుంచి రాష్ట్రంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భర్తీ చేయబోయే అన్ని రకాల నామినేటెడ్ పదవుల్లో ఆ వర్గాలు కచ్చితంగా 50 శాతం పదవులు దక్కించుకుంటాయి. దీంతో అన్ని స్థాయిల్లోనూ బీసీ, ఎస్సీ,

మిగతా 2వ పేజీలో ▶

# వెన్నెల రాజుకు మువ్వన్నెలు



జాబిల్లి రహస్యాలను శోధించే లక్ష్యంతో చేపట్టిన చంద్రయాన్ 2 తొలి అడుగు విజయవంతంగా పడింది. నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన బాహుబలి జీఎస్ఎల్వీ మార్క్ 3 ఎం 1 రాకెట్.. చంద్రయాన్ 2ను నిర్ధారిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇక.. సెప్టెంబర్ 7న చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా ల్యాండర్‌ను దింపడమనే మలి అడుగు కోసం మానవాళి ఆసక్తిగా ఎదురుచూస్తోంది. పూర్తి స్వదేశీ సాంకేతికతతో విజయవంతంగా చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా భారత దేశ అంతరిక్ష పరిశోధన శక్తి సామర్థ్యాలను ఇస్రో మరోసారి ప్రపంచం కళ్లకు కట్టింది.

- వివరాలు 11లో

దిగ్విజయంగా చంద్రయాన్-2

తొలిదశ విజయవంతమైంది: ఇస్రో

చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతం కావడం దేశ ప్రజలందరికీ గర్వించదగ్గ క్షణం. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలకు అభినందనలు.

– రాష్ట్రపతి, రామ్‌నాథ్ కోవింద్

**గగనం గెలిచాం.. థ్యాంక్స్ ఇస్రో!**



సోమవారం నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చిమ్ముకుంటూ నింగికేగుతున్న జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 రాకెట్

## ఆర్టీఐ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- సమాచార కమిషనర్ల పదవీ కాలం, వేతనాన్ని కేంద్రం నిర్ణయించేలా బిల్లు
- ఆర్టీఐని నిర్వీర్యం చేస్తున్నారంటూ తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- కమిషనర్లను ఇంట్లో పనివాళ్లలా మార్చాలనుకుంటున్నారు: డీఎంకే నేత ఎ.రాజా

10 లో

# చంద్రబాబు బీసీల ద్రోహి

### అందుకే బలహీనవర్గాలకు మేలు చేసే బిల్లులకు అడ్డు తగులుతున్నారు

### ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు

- చరిత్రలో తొలిసారి నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం ఇస్తున్నాం.. మహిళలకూ 50 శాతం ఇస్తున్నాం..
- పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నాం
- కానీ ఈ బిల్లులకూ టీడీపీ అడ్డు పడుతోంది
- శాశ్వతంగా బీసీ కమిషన్ వేసే బిల్లుకు ఇబ్బందులు సృష్టిస్తోంది..చివరకు బీసీ వర్గానికి చెందిన స్పీకర్‌నూ అవమానిస్తున్నారు
- ఇంత అధ్వాన, దిక్కుమాలిన ప్రతిపక్షం ఎక్కడా ఉండదు

**సాక్షి, అమరావతి:** ‘దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు తీసుకువస్తుంటే ప్రతిపక్షం అడ్డుకోవాలని చూస్తోంది. ఇంత అధ్వానమైన, దిక్కుమాలిన ప్రతిపక్షం దేశంలో ఎక్కడా ఉండదు. బడుగు, బలహీన వర్గాల ద్రోహులు వీళ్లు’ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నూతన అధ్యాయానికి తెరతీస్తూ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక బిల్లులను సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 50 శాతం ఇచ్చే బిల్లులు, అన్ని నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో

మిగతా 2వ పేజీలో ▶



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# నేడే బలపరీక్ష

### కర్ణాటక అసెంబ్లీలో కొనసాగిన హైడ్రామా... సభ నేటికి వాయిదా

### సాయంత్రం 4 గంటలకు బలపరీక్ష నిర్వహించాలని స్పీకర్ రమేశ్ కుమార్ నిర్ణయం



- అసెంబ్లీలో కాంగ్రెస్–జేడీఎస్ సభ్యుల ఆందోళన, పలుమార్లు వాయిదా
- 15 మంది రెబెల్ ఎమ్మెల్యేలతో నేడు భేటీ కానున్న స్పీకర్
- కుమారస్వామి వెంటనే రాజీనామా చేయాలన్న బీజేపీ
- సీఎం రాజీనామా చేశారంటూ సోషల్ మీడియాలో నకిలీ లేఖ వైరల్

10 లో





NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb FRESH CHICKEN

సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గ్రుడ్ల రిటైల్ ధర ₹ 44 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 79 కిలో | డ్రస్డ్ స్కిన్‌తో | 146 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 101 కిలో | స్కిన్‌లెస్ | 167 కిలో |

Conditions Apply.

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


**ఇదంజగత్**



అది సెట్ కాదు కానీ.. ఇదే ఈజీ ఈ పని మీదే ఉండటం బెటర్ సార్!!

## వైఎస్ జగన్ చరిత్ర సృష్టిస్తారు

పాలన ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే అద్భుతాలు చేశారు: గవర్నర్



గవర్నర్ నరసింహన్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి

వివరాలు 5లో



సోమవారం గుంటూరు జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చేందుకు బారులుతీరిన ప్రజలు

## అమరావతిపై వాస్తవపత్రం

- గృహనిర్మాణం, పోలవరంపై కూడా విడుదల చేస్తాం
- రాజధాని నగరాన్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- పీపీఏలపై కోర్టుకెళ్తాం
- ప్రతిపక్ష నేత చంద్రబాబు

వివరాలు 4లో

# ఇంటి దోపిడీ

## రూ. 4,930.15 కోట్లు!

- ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణంలో అక్రమాలపై ప్రభుత్వానికి నిపుణుల కమిటీ నివేదిక
- సాంప్రదాయ పద్ధతుల్లో అంచనాలు రూపొందించిన ఏపీ టిడ్కో
- వాటితోనే షేర్ వాల్ టెక్నాలజీలో నిర్మాణానికి టెండర్ నోటిఫికేషన్
- ఉన్నత స్థాయి ఒత్తిళ్లకు తలొగ్గి అంతర్గత అంచనా వ్యయాన్ని పెంచేశామన్న అధికారులు
- చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ.800 చొప్పున పెంచేసిన వైనం
- 9 సంస్థలకు అధిక ధరలకు పనులు
- గడువు పూర్తయినా ఇప్పటికీ ఒక్క ఇల్లు కూడా పూర్తి కాని వైనం
- తనిఖీలు లేకుండానే బిల్లుల చెల్లింపు
- పేదలను దోచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కమిటీ సిఫారసు



**సాక్షి, అమరావతి:** పట్టణ పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో టీడీపీ సర్కార్ రూ.4,930.15 కోట్ల దోపిడీకి పాల్పడినట్లు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ తేల్చింది. తొమ్మిది కాంట్రాక్టు సంస్థలతో కలసి టీడీపీ పెద్దలు పేదల పొట్ట కొట్టినట్లు స్పష్టం చేసింది. సాంప్రదాయ పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణానికి రూపొందించిన అంచనాలతోనే గత ప్రభుత్వం షేర్ వాల్ టెక్నాలజీకి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. అంచనా వ్యయాన్ని చదరపు అడుగుకు రూ.800 చొప్పున పెంచేసింది. పోటీ లేకుండా చేసి తొమ్మిది సంస్థలకు అధిక ధరలతో పనులను అప్పగించారని నిపుణుల కమిటీ

మిగతా 5వ పేజీలో ▶

నవ్యాంధ్రలో
# నవశకం

దేశ, రాష్ట్ర చరిత్రలో ఇది ప్రథమం, సుదినం.
మాట ప్రకారం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు నామినేటెడ్ పదవులు, పనులు,
సర్వీసుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నాం. 50 శాతం అక్క చెల్లెమ్మలకు కేటాయించాం.
శాశ్వత బీసీ కమిషన్ సహా పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చేలా
అసెంబ్లీలో బిల్లులు పెట్టాం – ట్విటర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



# నవశకానికి నాంది

▶ మొదటి పేజీ తరువాయి
ఎస్టీ, మైనార్టీ వర్గాలు రాజకీయంగా ప్రబల శక్తిగా రూపాంతరం చెందడం ఖాయం. అదే విధంగా ఈ వర్గాల ఆర్థిక స్వావలంబన సాధన దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో నామినేషన్లపై ఇచ్చే అన్ని పనుల్లో 50 శాతం ఆ వర్గాలకే ఇవ్వాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించడం ఆ వర్గాలకు తీపి కబురే. నామినేషన్లపై ఇచ్చే పనులు, ఇతర సర్వీసుల్లో సగం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చేలా చట్టం రూపొందడం ఆ వర్గాల అభ్యున్నతికి మార్గం సుగమం చేసింది.

**నిజమైన మహిళా సాధికారికతకు శ్రీకారం:** మహిళల రాజకీయ అధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం దిశగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ కీలక విధాన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి రాష్ట్రంలో భర్తీ చేయనున్న అన్ని నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో సగం అంటే 50% మహిళలకేనని తేల్చి చెప్పారు. అందుకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులకు శాసనసభ సోమవారం ఆమోదించడం శుభపరిణామం. దీంతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని పదవుల్లోనూ సగం మహిళలే దక్కించుకోనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించే నామినేటెడ్ పదవులు, పనులలో 50 శాతంతో పాటు ఇతర జనరల్ విభాగంలోని నామినేటెడ్ పదవులు, పనుల్లోనూ 50% మహిళలకు కేటాయించడం కొత్త చరిత్రే. నిజమైన మహిళా సాధికారికత అంటే ఏమిటో తెలుసుకోవాలంటే దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూడాల్సిందే.

**చట్టబద్ధంగా బీసీ హక్కుల పరిరక్షణ:** మరో సామాజిక విప్లవానికి సీఎం వైఎస్ జగన్ మన రాష్ట్రాన్ని వేదికగా మార్చారు. బీసీల హక్కుల పరిరక్షణకు చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రంలో శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేసేందుకు శాసనసభలో బిల్లును ప్రవేశ పెట్టడం శుభపరిణామం. ఇకపై ఎక్కడైనా సరే బీసీ హక్కులకు భంగం వాటిల్లితే బీసీ కమిషన్ బాధితులకు అండగా నిలుస్తుంది. మరోవైపు ఉపాధి కల్పన కల కాదని నిరూపిస్తూ రాష్ట్రంలో నెలకొల్పే పరిశ్రమల్లో స్థానికులకు 75% ఉద్యోగాలు ఇవ్వాలన్న బిల్లును శాసనసభ ఆమోదించడం ఉద్యోగాల విప్లవాన్ని సృష్టించనుంది. ఈ విధంగా కీలకమైన 8 బిల్లులను శాసనసభలో ఆమోదింపజేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో కొత్త అధ్యాయానికి నాంది పలికారు.

## అతివలకు జై..

అన్ని కార్పొరేషన్లు, ఏజెన్సీలు, సంస్థలు, బోర్డులు, సొసైటీలు, కమిటీల పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే వీటి చైర్‌పర్సన్ పదవుల్లోనూ 50 శాతం మహిళలకే కేటాయిస్తారు. అదేవిధంగా డైరెక్టర్లు, సభ్యుల్లో కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. దేవాదాయ చట్టం పరిధిలోని బోర్డులు, చారిటబుల్ ట్రస్టులు, వక్ఫ్ బోర్డు పరిధిలోని పదవులకు ఈ రిజర్వేషన్లు వర్తించవని స్పష్టం చేశారు. అన్ని నామినేటెడ్, కాంట్రాక్టు పనులు, నామినేటెడ్ సర్వీసు పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ఇంజనీరింగ్ విభాగాలు, పరిపాలన విభాగాల నామినేటెడ్ పనులన్నింటిలోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

## మహిళలకు అందలం



**బిల్లులు**
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సహా మహిళలందరికీ నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50%

**ఉద్దేశం**
మహిళా సాధికారతను సాధించడం, జనాభాలో సగం ఉన్న మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పించడం

**ప్రధాన అంశాలు**
అన్ని కార్పొరేషన్లు, ఏజెన్సీలు, సంస్థలు, బోర్డులు, సొసైటీలు, కమిటీల పదవుల్లో 50 శాతం మహిళలకే, చైర్‌పర్సన్ పదవుల్లో కూడా 50 శాతం రిజర్వేషన్. అదేవిధంగా జనరల్ మహిళల రిజర్వేషన్ ఇదే రీతిలో వర్తింపు

**మినహాయింపు**
దేవదాయ చట్టం పరిధిలోని బోర్డులు, చారిటబుల్ ట్రస్టులు, వక్ఫ్ బోర్డు పరిధిలోని పదవులకు రిజర్వేషన్లు వర్తించవు

## స్థానికులకే పట్టం

**బిల్లు**
పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే..

**ఎవరికి ప్రయోజనం**
పరిశ్రమలు, ఫ్యాక్టరీల కోసం తమ భూములు ఇచ్చి జీవనోపాధిని, ఆదాయాన్ని కోల్పోతున్నవారికి, స్థానిక యువతకు..

**బిల్లులో ప్రధాన అంశాలు**
కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలి. దీంతోపాటు ఇప్పటికే ఉన్నవి కూడా మూడేళ్లలో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాల్సి ఉంటుంది. స్థానికులకు తగిన అర్హత లేకపోతే శిక్షణ ఇచ్చి మరీ ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుంది.

## బీసీలకు బాసట



**బిల్లులు**
శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు బిల్లు, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ పనుల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్ వర్తింపు

**లక్ష్యం**
వెనుకబడిన వర్గాలను అన్ని రకాలుగా బలోపేతం చేయడం, వారి అభ్యున్నతికి, సాధికారతకు కృషి చేయడం

**బీసీ కమిషన్‌లో ఎవరెవరు ఉంటారంటే**
చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి, సభ్యులుగా ఒక సామాజిక శాస్త్రవేత్త, వెనుకబడిన వర్గాల సమస్యలపై అవగాహన ఉన్న మరో ఇద్దరు నిపుణులు, సభ్య కార్యదర్శిగా ప్రభుత్వ కార్యదర్శి.

**బీసీ కమిషన్ ప్రధాన విధులు**
బీసీల సాధికారత, అభ్యున్నతికి సంబంధించిన అన్ని అంశాలను చూస్తుంది. కుల ధ్రువీకరణ పత్రాల దగ్గర నుంచి బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలను గుర్తించడం, గ్రూపుల్లో చేర్పులు, మార్పుల తదితర అంశాలపై పనిచేస్తుంది. బీసీలపై జరిగే వేధింపులు కూడా కమిషన్ పరిధిలోకే వస్తాయి. బీసీల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సిఫారసులు చేయడం, విద్యా ప్రవేశాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ పాటించకపోతే ప్రభుత్వం దృష్టికి తేవడం, బీసీల సామాజిక, ఆర్థిక, విద్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు సర్వేలు, అధ్యయనాలు, ప్రజాభిప్రాయ సేకరణలు చేయడం, బీసీలకు అన్ని రంగాల్లో రక్షణ చర్యలు తీసుకోవడం, తదితర అంశాలు.

## సాధికారత దిశగా..

### రాష్ట్ర చరిత్రలో తొలిసారి మహిళలకు సీఎం వైఎస్ జగన్ సర్కార్ అగ్రతాంబూలం

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ పనుల్లో 50 శాతం చొప్పున మహిళలకే కేటాయిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించిన రెండు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. రాష్ట్ర జనాభాలో సగం మంది మహిళలే ఉన్నప్పటికీ విధాన నిర్ణయాలు తీసుకునే సంస్థల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోవడంతో సమాన అవకాశాలు వారికి దక్కడం లేదు. మహిళా సాధికారతను సాధించాలంటే జనాభాలో సగం ఉన్న అతివలను అందలం ఎక్కించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సామాజిక న్యాయం చేకూర్చడంతోపాటు మహిళలకూ సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా బిల్లులను రూపొందించారు. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ ఒక బిల్లును, అలాగే అన్ని నామినేటెడ్ పనుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన మరో బిల్లును బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎం.శంకర్ నారాయణ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లులో ఆయా వర్గాల మహిళలకు కూడా 50 శాతం ఇవ్వడంతోపాటు మిగతా 50 శాతం నామినేడెట్ పదవులు, నామినేటెడ్ పనుల్లో కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో జనాభాలో సగం ఉన్న మహిళలకు మొత్తం మీద 50 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లైంది.

## బీసీల అభ్యున్నతి, సాధికారత లక్ష్యంగా..

# బీసీ కమిషన్ బిల్లు

- కమిషన్ చైర్మన్‌గా హైకోర్టు జడ్జి, మరో ముగ్గురు సభ్యులు
- అసెంబ్లీలో బీసీ కమిషన్ బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, అమరావతి:** సుదీర్ఘ పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం, వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫేస్టోలో చేసిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతే లక్ష్యంగా శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ కమిషన్ ఏర్పాటుకుచట్టం చేయడానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో భాగంగా సోమవారం అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎం. శంకర్ నారాయణ బీసీ కమిషన్ ఏర్పాటు బిల్లును ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష టీడీపీ సభ్యుల అడ్డంకులు, నినాదాలు, అధికార పార్టీ సభ్యుల హర్షాతిరేకాల మధ్య బిల్లును అసెంబ్లీ ముందుంచారు.

**శాశ్వత ప్రాతిపదికన.. పారదర్శకంగా..**
బీసీలను అన్ని రకాలుగా బలోపేతం చేయడంతోపాటు సాధికారత పెంచాలని ప్రభుత్వం బలంగా కోరుకుంటున్న నేపథ్యంలో బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు బిల్లు ఉద్దేశాలు, లక్ష్యాల్లో పేర్కొన్నారు. బీసీ కమిషన్ శాశ్వత ప్రాతిపదికన.. పారదర్శకంగా పనిచేస్తుందని అందులో తెలిపారు. వెనుకబడిన తరగతుల సాధికారత, అభ్యున్నతికి సంబంధించిన అన్ని అంశాలను బీసీ కమిషన్ చూస్తుందని స్పష్టం చేశారు. కులధ్రువీకరణ పత్రాల దగ్గర నుంచి బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలను గుర్తించడం, గ్రూపుల్లో చేర్పులు, మార్పులు, తదితర అంశాలపై కమిషన్ పనిచేస్తుంది. బీసీలపై జరిగే వేధింపులు, సాంఘిక బహిష్కరణ అంశాలు కూడా కమిషన్ పరిధిలోకే వస్తాయి. కమిషన్ ఏర్పాటుతో బీసీల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందని, బీసీలకు అన్ని రంగాల్లో అవసరమైన రక్షణ చర్యలను ఈ కమిషన్ కల్పిస్తుందని బిల్లులో స్పష్టం చేశారు. ఎవరైనా తమను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని కోరితే వారి వినతిని కమిషన్ అధ్యయనం చేసి, తగిన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. బీసీలకు సంబంధించిన ఇతర అంశాలపైన కూడా అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సిఫార్సులు చేయొచ్చు. విద్యా సంస్థల ప్రవేశాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు పాటించకపోవడం వంటి ఫిర్యాదులపై కమిషన్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. బీసీలతోపాటు బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలను గుర్తించి సామాజిక ఆర్థిక, విద్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు సర్వేలు, అధ్యయనాలు చేస్తుంది. వీరి అభ్యున్నతికి అవసరమైన సిఫార్సులు చేసి.. విధానాలను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఏదైనా అంశంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటే అందుకు సంబంధించిన సిఫార్సులను కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. బీసీల అభ్యున్నతికి రిజర్వేషన్లు, సంక్షేమ కార్యక్రమాలపైన అధ్యయనం చేస్తుంది. రాష్ట్రంలో ఎక్కడైనా సరే కమిషన్ ప్రజాభిప్రాయాన్ని సేకరించవచ్చు.

**బీసీ కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలు**
కొత్తగా ఏర్పాటు చేసే బీసీ కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా హైకోర్టు జడ్జి ఉంటారు. సభ్యులుగా ఒక సామాజిక శాస్త్రవేత్త, వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక అవగాహన ఉన్న మరో ఇద్దరు, కమిషన్ సభ్య కార్యదర్శిగా ప్రభుత్వ కార్యదర్శి ఉంటారు. వీరు మూడేళ్ల పదవిలో కొనసాగుతారు. వీరిపై ఏమైనా క్రిమినల్ కేసులున్నా, ఆశించిన రీతిలో విధులు నిర్వహించకుండా అసమర్థంగా వ్యవహరించినా, ఒకరిని ఒకరు దూషించుకున్నా, సెలవు పెట్టకుండా వరుసగా మూడు సమావేశాలకు గైర్హాజరైనా తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. చైర్మన్, సభ్యులు మీడియాకు ఎలాంటి విధానపర నిర్ణయాలను వెల్లడించరాదని స్పష్టం చేశారు. కాగా.. కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎవరినైనా తమ ముందు హాజరుకావాల్సిందిగా పిలిచే అధికారం ఉంటుంది. అలాగే అవసరమైన డాక్యుమెంట్లు, సమాచారాన్ని ప్రభుత్వం నుంచి తీసుకునే అధికారం కలిగి ఉంటుందని బిల్లులో స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతితో బీసీ కమిషన్ సాంకేతిక నిపుణుల సేవలను కూడా పొందొచ్చునని బిల్లులో పేర్కొన్నారు. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నందున బిల్లులో ఆర్థిక మెమోరాండంను కూడా పొందుపరిచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,49,94,000 కేటాయించినట్లు పేర్కొన్నారు.

## పరిశ్రమల్లో 75% ఉద్యోగాలు స్థానికులకే..



**సాక్షి, అమరావతి:** ఇక నుంచి రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 75 శాతం ఉద్యోగాలను ప్రభుత్వం స్థానికులకే ఇవ్వనుంది. అంతేకాకుండా ఇప్పటికే ఉన్న పరిశ్రమలు, ఫ్యాక్టరీలు కూడా వచ్చే మూడేళ్లలో 75 శాతం ఉద్యోగాలను కూడా స్థానికులకే ఇచ్చేలా చట్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు సోమవారం శాసనసభలో కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ బిల్లును ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పరిశ్రమలను, ఫ్యాక్టరీలను నెలకొల్పడం ద్వారా రాష్ట్ర యువతకు ఉపాధిని కల్పించాలని నిర్ణయించింది. మరింత సులువుగా వ్యాపారం చేసుకోవడానికి వీలుగా సరళతర విధానాలను రూపొందించనుందని బిల్లులో స్పష్టం చేసింది. విద్యుత్, గనులు, మౌలిక రంగాలు, పోర్టులు ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**జీవనోపాధిని కోల్పోయేవారికి అండగా..:** పరిశ్రమల స్థాపనకు ప్రైవేట్ వ్యవసాయ భూముల డిమాండ్ పెరిగిపోతోందని, పరిశ్రమలకు భూములిచ్చినవారు తమ భూమితోపాటు జీవనోపాధిని, ఆదాయాన్ని కోల్పోతున్నారని బిల్లులో ప్రభుత్వం స్పష్టం చేసింది. వీరికి ఆ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలనే డిమాండ్ ఉందని పేర్కొంది. అయితే.. పారిశ్రామికవేత్తలు చిన్న చిన్న ఉద్యోగాలకే స్థానికులను పరిమితం చేస్తున్నారని తెలిపింది. దీనివల్ల తక్కువ ఆదాయంతో స్థానిక యువతలో అసంతృప్తి పెరిగిపోతోందని వివరించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో కనీసం 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని చట్టం చేసేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు తెలిపింది. స్థానికత అంటే.. ఏపీతోపాటు జిల్లా, జోన్‌గా పేర్కొంది. స్థానికంగా తగిన అర్హతలు ఉన్నవారు లేకపోతే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు.. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని, తగిన శిక్షణ ఇచ్చి మూడేళ్లలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటికే ఉన్న పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, పీపీపీ విధానంలోని జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల్లో మూడేళ్లలోగా 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనల నుంచి మినహాయింపు కోరాలంటే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం మూడు వారాల్లోగా తగిన విచారణ చేసి నిర్ణయం తీసుకుంటుంది. 75 శాతం ఉద్యోగాలను స్థానికులకు ఇస్తున్నారా? లేదా? అనే అంశాన్ని నోడల్ ఏజెన్సీ ఎప్పటికప్పుడు రికార్డులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది. 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇస్తున్నవారిపై ఎటువంటి న్యాయస్థానాలకు వెళ్లరాదనే నిబంధన విధించారు.

# 50% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో నామినేటెడ్ పనుల్లో రిజర్వేషన్లు

- నామినేటెడ్ పదవులు, పనుల్లో ఆయా వర్గాల మహిళలకే 50% చొప్పున కేటాయింపు
- బీసీలకు 29%, ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% పదవులు, పనులు
- ఆయా వర్గాలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- అసెంబ్లీలో రెండు బిల్లులు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

**సాక్షి, అమరావతి:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా.. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా.. ఆ వర్గాలకు ప్రభుత్వంలోని అన్ని నామినేటెడ్ పదవుల్లో, అన్ని నామినేటెడ్ పనుల్లో 50 శాతం చొప్పున రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రెండు బిల్లులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి శంకర్ నారాయణ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మరిన్ని అవకాశాలను కల్పించే రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. అన్ని ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లను ఒక బిల్లులో ప్రతిపాదించగా, మరో బిల్లులో అన్ని ప్రభుత్వ నామినేటెడ్ పనుల్లో కూడా ఇదే తరహాలో రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లును ప్రవేశపెట్టారు. నామినేటెడ్ పదవుల్లోనూ, పనుల్లోనూ ఆయా వర్గాల మహిళలకే 50 శాతం చొప్పున రిజర్వేషన్ కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.



**సామాజిక, రాజకీయ వెనుకబాటుకు ఇక స్వస్తి**
అన్ని నామినేటెడ్ ప్రభుత్వ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఈ వర్గాల్లో సామాజిక, రాజకీయ వెనుకబాటుతనానికి స్వస్తి పలికినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు బిల్లులో స్పష్టం చేశారు. అన్ని కార్పొరేషన్లు, ఏజెన్సీలు, సంస్థలు, సొసైటీలు, పరిపాలన విభాగాల్లో పనిచేసే కమిటీలన్నింటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నామినేట్ చేసే వీటి చైర్‌పర్సన్ పదవుల్లోనూ ఈ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నాయి. అలాగే నామినేట్ చేసే డైరెక్టర్లు, సభ్యుల పదవుల్లోనూ 50 శాతం రిజర్వేషన్లను కల్పిస్తారు. ఈ రిజర్వేషన్లు దేవదాయ చట్టం కింద ఏర్పడిన బోర్డులు, ట్రస్టులకు, అలాగే వక్ఫ్ బోర్డు చట్టం కింద ఏర్పడిన పదవులకు వర్తించవని పేర్కొన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో ఈ రిజర్వేషన్ల అమలు తీరుతెన్నులను సాధారణ పరిపాలన శాఖ పర్యవేక్షించనుందని తెలిపారు.

## ఆర్థికంగా బలోపేతం

ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, పనులు, సర్వీసుల్లోనూ 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకే కేటాయించారు. తద్వారా ఆయా వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే నామినేటెడ్ పనుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు బిల్లులో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని నామినేటెడ్ సివిల్ పనుల కాంట్రాక్టులు, నామినేటెడ్ సర్వీసు పనుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించనున్నట్లు పేర్కొంది. నామినేటెడ్ వర్క్ కాంట్రాక్టులు, సర్వీసు కాంట్రాక్టులు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లోని పనుల్లో రిజర్వేషన్లను వర్తింపచేయనున్నారు. బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లను కల్పించాలని ప్రతిపాదించారు. ఇందులోనే ఆయా వర్గాలకు చెందిన మహిళలకు 50 శాతం పనులను రిజర్వ్ చేయాలని స్పష్టం చేశారు. నామినేటెడ్ పనుల్లో రిజర్వేషన్లను అమలు చేసేందుకు రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ఈఎన్‌సీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిల్లో నామినేటెడ్ పనుల్లో, సర్వీసు కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్ల అమలు బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. సర్వీసు కాంట్రాక్టుల్లో రిజర్వేషన్ల అమలుకు సాధారణ పరిపాలన శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

## చంద్రబాబు బీసీల ద్రోహి

▶ మొదటి పేజీ తరువాయి
మహిళలకు 50 శాతం ఇచ్చే బిల్లులు, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించే బిల్లు, శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసే బిల్లును అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టి ఆమోదించారు. కాగా ఈ బిల్లులు ప్రవేశ పెడుతున్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ సభ్యులు రాజధానిపై చర్చను కొనసాగించాలనే నెపంతో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే రాజధాని అంశంపై సుదీర్ఘ చర్చ ముగిసింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వివరణ కూడా ఇచ్చారు. కానీ దీన్ని పట్టించుకోకుండా టీడీపీ సభ్యులు స్పీకర్ తమ్మినేని సీతారాం పోడియాన్ని చుట్టుముట్టి ఆందోళన కొనసాగించారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రంగా స్పందించారు. టీడీపీ సభ్యుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలా మాట్లాడారు..

**క్లారిఫికేషన్ తర్వాతా చర్చ ఉంటుందా?**
'40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటారు. 40 ఏళ్ల అనుభవజ్ఞుడినైన రాజకీయ నేత అంటారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రభుత్వం ఒక అంశంపై ప్రకటన చేసిన తర్వాత కేవలం క్లారిఫికేషన్ (వివరణ) మాత్రమే ఉంటుందని తెలిసినా కూడా దానిపై అర గంటపాటు మాట్లాడిన తర్వాత కూడా తృప్తి చెందకుండా ఇంకా గొడవ చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాం. దీన్ని కూడా అడ్డుకుంటున్న దిక్కుమాలిన ప్రతిపక్ష పార్టీ బహుశా ప్రపంచంలో మరెక్కడా ఉండదేమో?

**టీడీపీ ఓర్వలేకపోతోంది..**
దేశ చరిత్రలోనే తొలిసారి నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం ఇస్తుంటే టీడీపీ ఓర్వలేకపోతోంది. ఇంతకన్నా దిక్కుమాలిన ప్రతిపక్ష నేత మరొకరు ఉంటారా? దేశ చరిత్రలోనే తొలిసారి నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇస్తున్నాం. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తీసుకువస్తుంటే దీన్ని కూడా అడ్డుకుంటారా? ఇంతకంటే అధ్వానమైన ప్రతిపక్షం మరెక్కడా ఉండదు. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటుకు బిల్లు ప్రవేశ పెడుతుంటే ఈ ప్రతిపక్షం అడ్డం పడుతోంది.

**బీసీ స్పీకర్‌ను అవమానిస్తున్నారు**
గతంలో మేము ప్రతిపక్షంలో ఉండగా వాళ్లు అటువైపు నుంచి స్టేట్‌మెంట్ ఇస్తే క్లారిఫికేషన్‌కు మాకు రెండు మూడు నిముషాలు కూడా అవకాశం ఇచ్చేవారు కాదు. మరి ఇవాళ మేము స్టేట్‌మెంట్ చదివిన తర్వాత అరగంట సేపు చంద్రబాబు మాట్లాడారు. ఆ మాటల్లో ఏమాత్రం పస లేకుండా మాట్లాడారు. మళ్లీ దాని గురించి ఏకంగా పోడియం దగ్గరకు వచ్చి గొడవ చేస్తున్నారు. ఇంత దిక్కుమాలిన ప్రతిపక్షం మరొకటి ఉండదు. బీసీ వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానిస్తున్నారు. స్పీకర్ అన్న గౌరవం ఏమాత్రం లేకుండా అవమానిస్తున్నారు. వీళ్లు బడుగు, బలహీన వర్గాల ద్రోహులు. వీళ్లకు జ్ఞానోదయం కలగాలని భగవంతుని కోరుకుంటున్నా. ఎన్నికల్లో ప్రజలు ఓడించినా సరే వీళ్లకు బుద్ధి రాలేదు. ఈ ద్రోహులను భగవంతుడే శిక్షిస్తాడు' అని సీఎం మండిపడ్డారు.

నవ్యాంధ్రలో నవశకం



### వైఎస్ జగన్‌ది సాహసోపేత నిర్ణయం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ దేశంలోగానీ, రాష్ట్రాల్లోగానీ ఇంతవరకు ఏ ప్రభుత్వమూ, ఏ రాజకీయ పార్టీ బిల్లు పెట్టించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు పెట్టించి పాస్ చేయించడం చరిత్రాత్మకం. దీనికి రాజకీయ రంగు రుద్దేందుకు ప్రయత్నించడం మంచిది కాదు.

– ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు





### ఆయా వర్గాలకు రాజ్యాధికారం

ఇప్పటి వరకు బడుగు, బలహీనవర్గాలు రాజ్యాంగ ఫలాలకు దూరంగా ఉన్నారు. దళిత వర్గాల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కొన్ని ఫలాలు అందిస్తే.. ఆ వర్గాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ప్రత్యేక ఫలాలు అందించారు. ఈ బిడ్డను చరిత్ర ఎప్పటికీ మరువదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరువలేరు.

– జస్టిస్ ఈశ్వరయ్య



## 1న ఇజ్రాయెల్‌కు సీఎం జగన్

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 1వ తేదీ రాత్రి ఇజ్రాయెల్ పర్యటనకు తన కుటుంబ సభ్యులతో కలసి వెళుతున్నారు. 4వ తేదీన అక్కడ నుంచి తిరిగి బయలుదేరి 5వ తేదీన విజయవాడకు చేరుకుంటారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని అధికార వర్గాలు తెలిపాయి.

### అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు

## రేషన్ డీలర్లను తొలగించం



**సాక్షి, అమరావతి:** రేషన్ డీలర్లను తొలగించే ఆలోచన ప్రభుత్వానికి లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు.

## హౌసింగ్ అక్రమాలపై విజి‘లెన్స్’



గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ పథకాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమాధానమిస్తూ.. అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపిస్తామన్నారు.

## నగర పంచాయతీలుగా గురజాల, దాచేపల్లి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రతిపాదన మేరకు గుంటూరు జిల్లాలోని గురజాల, దాచేపల్లి గ్రామాలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు.

## ప్రతి మండలానికీ అంబులెన్స్



ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ ఉండేలా చర్యలు తీసుకుంటామని, 104 అంబులెన్స్‌ల్లో మందుల కొరత లేకుండా చూస్తామని ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) వెల్లడించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మోపురుగుండు తిప్పేస్వామి, మూలె సుధీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు పైవిధంగా సమాధానమిచ్చారు.

## ‘చేనేత’ అక్రమాలపై విచారణ



మంగళగిరి చేనేత సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరిపిస్తామని మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ప్రకటించారు. ఆప్కో చైర్మన్ అక్రమాలపై విచారణ జరిపించాలని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కోరగా మంత్రి స్పందించారు.

### కృష్ణపట్నం నోడ్ ప్రతిపాదన

చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కింద కృష్ణపట్నం నోడ్‌ను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఉందని మంత్రి గౌతంరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 12,315.90 ఎకరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని చెప్పారు. దీనివల్ల భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం పెంచాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ కోరారు.

# బాబు అవినీతితో ప్రపంచబ్యాంకు బెంబేలు

## అందుకే అమరావతికి రుణంపై వెనకడుగు

### అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

- కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ. 32 కోట్లా? ఇది ఎక్కడైనా ఉందా?
- ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో భారీ కుంభకోణం
- చంద్రబాబు ప్రభుత్వం చేపట్టింది ల్యాండ్ ‘పూలింగ్’
- చంద్రబాబు అవినీతి, పర్యావరణానికి హానిపై రైతులు, మేధావుల ఆందోళన
- దాంతో అమరావతిలో తనిఖీలు నిర్వహించిన ప్రపంచబ్యాంకు బృందం
- రుణం ఇచ్చేముందు మరింత సమగ్రదర్యాప్తు జరపాలని నిర్ణయం
- ఇది దేశ సార్వభౌమాధికారానికి భంగకరమని భావించిన కేంద్రం
- కేంద్రం సిఫార్సుతోనే అమరావతికి రుణసహాయం ప్రతిపాదనను రద్దు చేసుకున్న ప్రపంచబ్యాంకు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధి నమూనా పట్ల ప్రపంచబ్యాంకు సానుకూలత
- ఆరోగ్య రంగ అభివృద్ధికి 328 మిలియన్ డాలర్ల రుణసహాయానికి ఆమోదం



**సాక్షి, అమరావతి:** రాజధాని అమరావతి నిర్మాణం పేరిట చంద్రబాబు ప్రభుత్వం భారీ దోపిడీకి పాల్పడిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజమెత్తారు. పర్యావరణ, సామాజిక, ఆర్థిక రంగాలపై తీవ్ర దుష్ప్రభావం చూపేలా అమరావతిలో ప్రాజెక్టులు చేపట్టారని విమర్శించారు. కిలోమీటర్ రోడ్డుకు ఏకంగా రూ. 32 కోట్ల చొప్పున కాంట్రాక్టు కట్టబెట్టడం ఎక్కడైనా ఉందా? అని విస్మయం వ్యక్తం చేశారు. రైతులు, మేధావులు, ఎన్జీవోల ఫిర్యాదులపై స్పందించి ప్రపంచబ్యాంకు బృందం నిర్వహించిన తనిఖీల్లో చంద్రబాబు బండారం బట్టబయలైందని తెలిపారు. దాంతో అమరావతికి రుణమిచ్చే ముందు సమగ్ర దర్యాప్తు చేయాలని నిర్ణయించిందన్నారు. కానీ అది దేశ సార్వభౌమాధికారానికి భంగకరమని కేంద్ర ప్రభుత్వం భావించిందని మంత్రి వివరించారు. కేంద్రం సూచనల మేరకే అమరావతికి రుణ సహాయం ప్రతిపాదనను ప్రపంచబ్యాంకు రద్దు చేసుకుందని ఆయన వెల్లడించారు. అసెంబ్లీలో సోమవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ అమరాతికి రుణ సహాయం చేసే ప్రతిపాదనను ప్రపంచబ్యాంకు ఉపసంహరించుకున్న అంశంలో తమ ప్రభుత్వ ప్రమేయమేమీ లేదంటూ వాస్తవాలను వివరించారు. తమ ప్రభుత్వ అభివృద్ధి నమూనాకు సానుకూలంగా స్పందించిన ప్రపంచబ్యాంకు రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు 328 మిలియన్ డాలర్ల రుణ సహాయం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుందని ఆయన శాసనసభకు తెలిపారు.

### భూములివ్వని రైతుల పొలాలను తగులబెట్టారు..

అమరావతిలో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టింది ల్యాండ్ పూలింగ్ కాదని ల్యాండ్ ఫూలింగ్ అని మంత్రి వ్యాఖ్యానించారు. అధికార రహస్యాలను పరిరక్షిస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు అందుకు విరుద్ధంగా వ్యవహరించారని విరుచుకుపడ్డారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి తన బినామీల పేరిట భారీగా భూములు కొనుగోలు చేశారని దుయ్యబట్టారు. రాజధానికి భూములు ఇవ్వని రైతులను బెదిరించారని, వారి తోటలను టీడీపీ నేతలే తగులబెట్టించారని మండిపడ్డారు. అమరావతిలో రోడ్ల నిర్మాణానికి టెండర్లలో టీడీపీ ప్రభుత్వం యథేచ్ఛగా అవినీతికి పాల్పడిందన్నారు. 5, 6, 7 ప్యాకేజీల టెండర్లను తమ సన్నిహిత సంస్థ ఎన్‌సీసీ సంస్థకు దక్కేలా చంద్రబాబు వ్యవహారం నడిపారని వివరించారు. ప్రపంచబ్యాంకు తక్కువ వడ్డీకి రుణం ఇస్తుంటే అమరావతి బాండ్ల పేరుతో అధిక వడ్డీకి రూ. 2 వేల కోట్లు బాండ్లు ఎందుకు సేకరించారని ప్రశ్నించారు. తమ సన్నిహితులైన బడా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు కోసమే బాండ్లు జారీ చేశారని విమర్శించారు.

### తనిఖీలతో బండారం బట్టబయలు

అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబీ) నుంచి దాదాపు రూ. 5 వేల కోట్ల రుణాన్ని సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో అనుమతిచ్చిందని బుగ్గన తెలిపారు. అందులో ప్రపంచబ్యాంకు రూ. 2,100 కోట్లు, ఏఐఐబీ రూ. 1,500 కోట్లు రుణాన్ని సమకూర్చితే... ఏపీ ప్రభుత్వం తన వాటాగా రూ. 1,500 కోట్లు కేటాయించేలా నిర్ణయించారని వివరించారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం రైతులను దోపిడీ చేస్తూ, పర్యావరణం, మానవహక్కులకు భంగం కలిగిస్తూ సాగించిన కుంభకోణంపై పెద్ద సంఖ్యలో రైతులు, మేధావులు, ఎన్జీవోలు ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దాంతో ప్రపంచబ్యాంకు నియమించిన తనిఖీల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించిందని చెప్పారు. పర్యావరణ, సామాజిక, ఆర్థిక రంగాలపై పడే ప్రభావాన్ని మదింపు చేసి 2017, సెప్టెంబరు 27న తన తొలి నివేదిక, నవంబరు 27న రెండో నివేదిక, 2018, జూన్ 26న మూడో నివేదికను, 2019, మార్చి 29న తన తుది నివేదికను ప్రపంచబ్యాంకుకు సమర్పించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు మీద చంద్రబాబు ప్రభుత్వం చెబుతున్నదానికీ, రైతులు, ఎన్జీవోలు చెబుతున్న అంశాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని ప్రపంచబ్యాంకు తనిఖీల బృందం నిర్ధారించిందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల జరిగే నష్టాల తీవ్రత చాలా ఎక్కువగా ఉండనుందని, పర్యావరణ, సామాజిక, ఆర్థిక రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుందని కూడా తన నివేదికలో పేర్కొన్న విషయాన్ని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో లోతుగా దర్యాప్తు నిర్వహించాలని ఈ తనిఖీల బృందం సిఫార్సు చేసిందన్నారు. అంతవరకు రుణ మంజూరు చేయకూడదని నిర్ణయించిందని తెలిపారు.

### అది దేశ సార్వభౌమాధికారానికి భంగకరం

అమరావతి ప్రాజెక్టుపై సమగ్ర దర్యాప్తు జరపాలన్న ప్రపంచబ్యాంకు తనిఖీల కమిటీ సిఫార్సుపై తమ ప్రభుత్వ వైఖరి ఏమిటని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల శాఖ 2019, జూలై 1న తమను అడిగిందని బుగ్గన తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినందున ఈ విషయంలో నిర్ణయం తీసుకోడానికి తమకు నెలరోజులు గడువు కావాలని కేంద్రాన్ని కోరామని ఆయన వివరించారు. కానీ ప్రపంచబ్యాంకు దర్యాప్తునకు అనుమతించాలా వద్దా అనేదానిపై జూలై 15లోగా తమ వైఖరి తెలపాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పిందన్నారు. దాంతో దీనిపై కేంద్ర ఆర్థిక శాఖే తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని మంత్రి బుగ్గన వెల్లడించారు. ఓ ప్రాజెక్టుకు రుణసహాయం చేసేముందే దర్యాప్తు చేయడం దేశ సార్వభౌమాధికారానికి భంగకరమైన అంశంగా కేంద్ర ప్రభుత్వం భావించిందని మంత్రి బుగ్గన తెలిపారు. ఇంతకుముందు దేశంలో ఏ ప్రాజెక్టు విషయంలో కూడా ఇలా చేయలేదని కేంద్రం గుర్తించిందన్నారు. అందుకే అమరావతి ప్రాజెక్టుకు రుణ సహాయం ప్రతిపాదనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సమాచారమివ్వడంతో ప్రపంచబ్యాంకు సమ్మతించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే అమరావతికి రుణసహాయం ప్రతిపాదనపై ప్రపంచబ్యాంకు వెనక్కితగ్గిందని చంద్రబాబు, టీడీపీ నేతలు, ఆ పార్టీకి అనుకూలంగా ఉండే మీడియా అధిపతులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అభివృద్ధి అజెండాకు ప్రపంచబ్యాంకు తోడ్పాటు

రాష్ట్ర అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అజెండా, నిబద్ధత పట్ల ప్రపంచబ్యాంకు అత్యంత సానుకూలంగా స్పందించిందని మంత్రి బుగ్గన తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగ అభివృద్ధికి ప్రపంచబ్యాంకు కొత్తగా 328 మిలియన్ డాలర్ల సహాయాన్ని మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ మేరకు 2019, జూన్ 27న ఒప్పందం కుదిరిందని తెలిపారు. తమ ప్రభుత్వ సుపరిపాలన అజెండా, అభివృద్ధికర పని విధానంపట్ల ప్రపంచబ్యాంకు హర్షం వ్యక్తం చేసిందని చెప్పారు. ప్రభుత్వ వ్యూహాలు, విధానాలు, కార్యక్రమాలు, నవరత్న పథకాల విధానాలు ప్రపంచబ్యాంకు అభివృద్ధి ప్రాధాన్యతలతో పూర్తిగా సరిపోలాయని ప్రపంచబ్యాంకు పేర్కొందన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టబోయే ఇతర ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేస్తామని కూడా హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

## అమరావతికి మీరిచ్చింది రూ. 277 కోట్లే

- మేము రూ. 500 కోట్లు కేటాయించాం
- శాసన మండలిలో మంత్రి బుగ్గన

గత ప్రభుత్వం రాజధాని నిర్మాణం పేరిట విరాళాల కోసం తిరుపతిలో హుండీ ఏర్పాటు చేసిందని, ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రతిపక్ష పార్టీ సభ్యులను ప్రశ్నించారు. శాసన మండలిలో జరిగిన బడ్జెట్‌పై చర్చకు మంత్రి బుగ్గన సోమవారం సమాధానం ఇచ్చారు. ‘అమరావతి అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యులు వాపోతున్నారు. గత ప్రభుత్వం హయాంలో మొత్తం రూ. 277 కోట్లు కేటాయిస్తే తాము ఈ ఏడాది రూ. 500 కోట్లు కేటాయించాం. రాజధాని నిర్మాణం ప్లాన్ కోసమని మలేసియా, సింగపూర్, కొరియా, జపాన్, కొలంబో, టర్కీ, లండన్ తదితర దేశాల్లో తిరిగి ఆఖరుకు ప్లాన్ తయారీకి రాజమౌళికి అప్పగించారు’ అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయలేకపోయిన రుణమాఫీ రెండు విడతల సొమ్మును ఇవ్వాలని అడిగే హక్కు ప్రతిపక్షానికి లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కోసం రూ. 8,750 కోట్లు కేటాయించిందని, సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 67 మంది సభ్యులు అప్పటి సీఎం చంద్రబాబును కలిస్తే ఇచ్చేది లేదన్నారని, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మాత్రం ప్రతిపక్ష పార్టీ సభ్యులకు కూడా నియోజకవర్గానికి రూ. కోటి కేటాయించి తన ఉదారతను చాటుకున్నారని గుర్తు చేశారు.

### మీడియా పాయింట్

## రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం..

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయమని, విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులని పలువురు మంత్రులు, ప్రభుత్వ విప్ అన్నారు. ఒకే రోజున ఐదు కీలక బిల్లులు పెట్టడం గొప్ప పరిణామమంటూ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో సోమవారం వారు మాట్లాడారు.

### బడుగు, బలహీనవర్గాల గౌరవం పెంచేలా సీఎం జగన్ నిర్ణయం: మంత్రి బొత్స



సమాజంలో బడుగు బలహీనవర్గాల గౌరవం పెంచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో బిల్లు పెట్టడం గొప్ప విషయం. రానున్న కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఇవ్వాలని నిర్ణయించారు. మహిళలకూ 50 శాతం కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు.

### చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు: మోపిదేవి



నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం ఇస్తామన్న మాటను ముఖ్యమంత్రి అయిన 45 రోజుల్లోనే వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. చంద్రబాబు వారిని ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకున్నారు. ఈ బిల్లుతో వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే టీడీపీ ఎమ్మెల్యేలు సభలో గందరగోళం సృష్టించారు.

### బడుగుల గుండెల్లో సీఎం జగన్: అవంతి



టీడీపీ సభ్యులు సభలో కుట్రపూరితంగా వ్యవహరించారు. స్పీకర్‌పై దాడికి తెగబడేలా ప్రవర్తించారు. ఈ బిల్లులతో బడుగు, బలహీనవర్గాల గుండెల్లో సీఎం వైఎస్ జగన్ చిరస్థాయిగా నిలిచిపోతారు.

### ఈ రోజు చరిత్రాత్మకం: శంకర్ నారాయణ



రాష్ట్రంలో ఈ రోజు చరిత్రాత్మకం. ఇటువంటి బిల్లును ప్రవేశ పెట్టేందుకు నాకు అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు. సీఎం జగన్‌కు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో బిల్లులను అడ్డుకునేందుకు టీడీపీ సభ్యులు యత్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు కులవృత్తులకే పరిమితం చేయాలని చూస్తే.. సీఎం జగన్ వారికి నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారు.

### బిల్లులను అడ్డుకునేందుకు చంద్రబాబు విఫలయత్నం: కాపు



చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా బడుగు, బలహీన వర్గాలకు చెందిన బిల్లులను అడ్డుకోలేకపోయారు. రానున్న రోజుల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. సీఎం జగన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు.

# ‘పురుషోత్తపట్నం’పై షోకాజ్ నోటీస్!

- పర్యావరణ అనుమతి లేకుండా ఎందుకు చేపట్టారో చెప్పాలని ఆదేశం
- ఏపీ ప్రభుత్వానికి కేంద్ర పర్యావరణ శాఖ నోటీసులు

**సాక్షి, న్యూఢిల్లీ:** పురుషోత్తపట్నం ప్రాజెక్ట్‌ను పర్యావరణ అనుమతులు లేకుండా ఎందుకు చేపట్టారంటూ కేంద్ర పర్యావరణ శాఖ ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. పర్యావరణ అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారంటూ మడిచర్ల సత్యనారాయణ, జమ్ముల చౌదరయ్య 2018లో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే పట్టిసీమ, పురుషోత్తపట్నం, చింతలపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం గోదావరి–పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్ట్ చేపడుతోందని మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై అనేక దఫాలుగా ఎన్జీటీ విచారణ జరిపింది. జమ్ముల చౌదరయ్య, మడిచర్ల సత్యనారాయణ పిటిషన్లపై ఎన్జీటీ ఈ ఏడాది జనవరి 21న ఒక ఉత్తర్వులు జారీచేసింది. పర్యావరణ (పరిరక్షణ) చట్టం–1986ను ఉల్లంఘించినట్టు నిర్ధారణకు వస్తే నెల రోజుల్లో చట్టాన్ని అనుసరించి కేంద్ర పర్యావరణ శాఖ తదుపరి చర్యలు చేపట్టాలని పేర్కొంది. తీసుకున్న చర్యలను నెల రోజుల్లో తెలియపరచాలని కూడా కోరింది. ఏప్రిల్ 10, 2019న ఈ కేసు విచారణకు రాగా.. కేంద్ర పర్యావరణ శాఖ ఎలాంటి నివేదికనూ సమర్పించలేదు. పైగా ఆ శాఖ ప్రతినిధి కూడా హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణకు పర్యావరణ శాఖ ఇన్‌చార్జి అధికారి స్వయంగా హాజరుకావాలని, ఇలాంటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు అవసరమా లేదా చెప్పాలని ఎన్జీటీ ఆదేశించింది. జూలై 15న ఈ కేసు తిరిగి విచారణకు రాగా.. కేంద్ర పర్యావరణ శాఖ డైరెక్టర్ డాక్టర్ సునమణి కెర్కెట్ట హాజరై, తన వద్ద ఉన్న నివేదిక ప్రకారం ఇది పోలవరం ప్రాజెక్ట్ విస్తరణలో భాగమని వివరించారు. వర్షాకాలంలో గోదావరి నీటిని ఎడమ ప్రధాన కాలువ ద్వారా తీసుకునేందుకు మాత్రమే ఉద్దేశించిందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని నివేదించారు. కానీ 2016లో సిద్ధమైన పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ డీపీఆర్‌లో అది వేరే ప్రాజెక్ట్ అని తేటతెల్లమైందని ఎన్జీటీ అభిప్రాయపడింది. కేవలం తాగునీటి ప్రాజెక్టు అని చెబుతూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తీరు ట్రిబ్యునల్‌ను తప్పుదోవ పట్టించేందుకే చేసిన ప్రయత్నంగా ఉందని ఎన్జీటీ నాటి ఉత్తర్వుల్లో పేర్కొంది. పర్యావరణ శాఖ డైరెక్టర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు వారం గడువు కోరారని, అఫిడవిట్ ఫైల్ చేసినా, చేయకపోయినా ఆగస్టు 7వ తేదీన కేసును పరిష్కరిస్తామని నాటి ఉత్తర్వులో పేర్కొంది.

### ప్రాంతీయ కార్యాలయ నివేదిక ఆధారంగా..

కాగా చెన్నైకి చెందిన కేంద్ర పర్యావరణ శాఖ ప్రాంతీయ విభాగం క్షేత్ర సందర్శన చేసి కేంద్ర పర్యావరణ శాఖకు నివేదిక సమర్పించింది. పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ నిర్మాణం ఏప్రిల్ 30, 2019 నాటికి పూర్తయిందని, స్టేజ్–1 ద్వారా 3,500 క్యూసెక్కులు, స్టేజ్–2 ద్వారా 1,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం దీనికి ఉందని తెలిపింది. దీనికి 326.38 ఎకరాల స్థలం అవసరం కాగా.. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించారని, ప్రాజెక్ట్ కారణంగా ఎవరూ నిరాశ్రయులు కాలేదని నివేదిక సమర్పించింది. రెండు ప్రాజెక్టులకు వేర్వేరు డీపీఆర్‌లు సమర్పించినప్పటికీ ఎడమ కాలువ నుంచి నీటిని ఎత్తిపోస్తున్నందున దీనిని పోలవరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా చూస్తే ఈఐఏ నోటిఫికేషన్‌ను ఉల్లంఘించినట్టేనని, అంటే పోలవరం ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతులను సవరించాల్సి ఉంటుందని కేంద్ర పర్యావరణ శాఖ అభిప్రాయానికి వచ్చింది. ఒకవేళ పురుషోత్తపట్నం ప్రాజెక్ట్‌ను వేరుగా చూసినప్పటికీ.. దానినీ, పోలవరం ఎడమ కాలువను ఓ ప్రాజెక్ట్‌గా చూడాల్సి వస్తుందని, అప్పుడు ఈఐఏ నోటిఫికేషన్ వర్తిస్తుందని, దానికి అనుగుణంగా సవరణలు అవసరమని అభిప్రాయపడింది. క్షేత్రస్థాయి నివేదికను బట్టి పర్యావరణ ఉల్లంఘనే అని అభిప్రాయానికి వచ్చిన కేంద్ర పర్యావరణ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి షోకాజ్ నోటీసు జారీచేసినట్టు సమాచారం.

### నేడు దుర్గమ్మను దర్శించుకోనున్న

## నూతన గవర్నర్

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా నియమితులైన విశ్వభూషణ్ హరిచందన్ మంగళవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. సాయంత్రం 4.00 గంటలకు నూతన గవర్నర్ అమ్మవారి దర్శనానికి రానుండడంతో ఆలయ ప్రాంగణంలో భద్రత ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.

### ఏపీ ఇన్ పార్లమెంట్

## కేసు నమోదు చేయాలని ఆదేశించే అధికారాలివ్వండి

### మానవ హక్కుల పరిరక్షణ బిల్లుపై చర్చలో ఎంపీ విజయసాయిరెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు బాధితుల వాదనలు, ప్రతివాదుల వివరణ విన్న అనంతరం బాధితులకు న్యాయం జరిగేలా కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసే అధికారం దఖలు పరచాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కేంద్రాన్ని కోరారు. సోమవారం మానవ హక్కుల పరిరక్షణ (సవరణ) బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ గ్లోబల్ అలయన్స్ ఆఫ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇనిస్టిట్యూషన్స్ (జీఏఎన్‌హెచ్‌ఆర్ఐ) సంస్థ నుంచి ‘ఏ’ స్టేటస్ అక్రిడిటేషన్ పొందినందుకు అభినందనలు తెలిపారు.

## రాష్ట్రాల అధికారాల్లోకి చొరబడొద్దు

### వైఎస్సార్‌సీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు

**సాక్షి, న్యూఢిల్లీ:** సమాచార హక్కు చట్టాన్ని సవరిస్తూ ప్రతిపాదించిన బిల్లులో పలు మార్పులు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు కేంద్రాన్ని కోరారు. ఈ బిల్లుపై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చలో మాట్లాడారు. ‘స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌ను నియమించే అధికారాన్ని కూడా కేంద్ర ప్రభుత్వానికి దఖలు పరుస్తున్నారు. ఈ అధికారాన్ని రాష్ట్రాలకే వదిలిపెట్టాలి. రాష్ట్రాల స్వతంత్రతను కాపాడాలి’ అని పేర్కొన్నారు.

**అభ్యర్థనలు 15వ ఆర్థిక సంఘానికి నివేదించాం**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ సహా రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి మే 26న ఇచ్చిన అభ్యర్థనలను 15వ ఆర్థిక సంఘం పరిశీలనకు నివేదించామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ అడిగిన రాతపూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఇప్పటివరకు రూ. 14,294 కోట్ల మేర రాష్ట్రానికి సాయం చేసినట్టు మంత్రి వివరించారు.

# జాతీయ రహదారుల పనుల్లో వేగం పెంచండి

- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన వైఎస్సార్ సీపీ ఎంపీలు
- పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక చర్చ



కేంద్రమంత్రి గడ్కరీని కలిసిన ఎంపీ విజయసాయిరెడ్డి, తదితరులు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాల్సిందిగా కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని వైఎస్సార్ సీపీ ఎంపీలు కోరారు. అనంతపురం–అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే సహా జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టులపై చర్చించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలకు ప్రత్యేక సమయం ఇచ్చారు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి. విజయసాయిరెడ్డి, లోక్‌సభాపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు చింతా అనురాధ, డా. సత్యవతి, గొడ్డేటి మాధవి, రఘురామ కృష్ణంరాజు, లావు శ్రీకృష్ణదేవరాయలు, దుర్గాప్రసాద్, రెడ్డెప్ప, కోటగిరి శ్రీధర్ పార్లమెంటులో గడ్కరీని కలసి వినతిపత్రాన్ని సమర్పించారు.

### ‘మదనపల్లి-తిరుపతి’కి అత్యంత ప్రాధాన్యతనివ్వండి..

జాతీయ రహదారి–42పై 266/600 కి.మీ నుంచి 276/800 కి.మీ వరకు పుంగనూరు టౌన్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని గడ్కరీని పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోరారు. ఎన్‌హెచ్–71పై మదనపల్లి–చర్లోపల్లి–తిరుపతి నాలుగులేన్ల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత విభాగంలో చేర్చి పనులు చేయాలని కోరారు. నర్సాపురం–సఖినేటిపల్లి వద్ద వశిష్ట నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎంపీ రఘురామకృష్ణంరాజు కోరారు. రాజోలు–నర్సాపురం వయా మల్కిపురం, సఖినేటిపల్లి ఫెర్రిరోడ్డును అప్‌గ్రేడ్ చేయాల్సిందిగా కోరారు. అనకాపల్లి–విజయవాడ జాతీయ రహదారి–16పై 742 కి.మీ వద్ద 8 గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎంపీ డా. సత్యవతి కోరారు.

# అమరావతిపై వాస్తవపత్రం

- ప్రతిపక్ష నేత చంద్రబాబు
- రాజధాని నగరాన్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు పడిపోయాయి
- పీపీఏలపై కోర్టుకెళ్తాం



**సాక్షి, అమరావతి :** రాజధాని అమరావతిపై త్వరలో వాస్తవ పత్రాన్ని విడుదల చేస్తామని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తెలిపారు. గృహ నిర్మాణం, పోలవరం అంశాల పైనా వాస్తవ పత్రాలను విడుదల చేస్తామన్నారు. మంగళగిరిలోని ఓ రిసార్ట్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీటిపై రాష్ట్రమంతా చర్చ జరిగేలా చేస్తామన్నారు. అమరావతిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు. పెద్ద నగరాలతోనే ఆదాయం వస్తుందని.. అలాంటి నగర నిర్మాణాన్ని తాము ప్రారంభిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అమరావతిని మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ వివాదం చేస్తోందని.. దాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకు యత్నించిందని విమర్శించారు. అలాగే, అమరావతి రోడ్ల నిర్మాణానికి సంబంధించిన పనులకు నాలుగు కంపెనీలు టెండర్లు దాఖలు చేస్తే తక్కువ కోట్ చేసిన వారికి పనులివ్వడాన్ని తప్పుపడుతున్నారన్నారు.

### భూముల ధరలు పడిపోయాయి

రెండు నెలల్లో రాజధానితో పాటు రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు పడిపోయాయని దీనికి వైఎస్సార్‌సీపీ విధానమే కారణమని చంద్రబాబు ఆరోపించారు. ఆర్థికమంత్రి ముళ్ల కంపలు అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని.. నిర్మాణంలో ఉన్న రాజధానిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాజధాని ప్రాంతంలో ప్రపంచ బ్యాంకు తనిఖీలు చేయడానికి వైఎస్సార్‌సీపీయే కారణమన్నారు. ప్రభుత్వ వైఖరివల్ల పెట్టుబడులు పెట్టే వారు కూడా వెనక్కి వెళ్లిపోతున్నారన్నారు. అసెంబ్లీలో హడావుడిగా బిల్లులు పెట్టి, వాటిని తాము వ్యతిరేకించామంటున్నారని బాబు విమర్శించారు. కాగా, చంద్రయాన్–2ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపిన చంద్రబాబు, ఆ ప్రాజెక్టుకు కేటాయించిన వెయ్యి కోట్లు దండగని, అవినీతి అని కూడా అంటారేమోనని వ్యాఖ్యానించారు. పీపీఏలపై నిపుణుల కమిటీ పేరుతో తప్పుడు సమాచారం ఇస్తున్నారని, ఈ వ్యవహారంపై కోర్టుకు వెళ్తామని ఆయన చెప్పారు. అనంతరం.. రిసార్ట్‌లోనే టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించి అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు.




ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక, ఆర్థిక భరోసా లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయంతో ఆ భరోసా దక్కింది. చరిత్రలో వైఎస్ జగన్ గురించి ఎంతో గొప్పగా చెప్పకుంటారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ ఏ పార్టీ, ఏ ముఖ్యమంత్రీ తీసుకోలేని సాహసోపేత నిర్ణయాన్ని వైఎస్ జగన్ తీసుకున్నారు. ఎన్నికల హామీలను అప్పుడే అమల్లోకి తెచ్చి.. చట్ట సభల్లో బిల్లులు పెట్టిమరీ పాస్ చేయించి చూపారు.

– కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు

ఈ బిల్లు చట్టరూపం దాల్చి అమల్లోకి రావడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వరం. వినూత్న, సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందనీయులు. ఆయన సాహసోపేత నిర్ణయాలతో అణగారిన వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా మేలు జరుగుతుంది. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిభావంతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– దడాల సుబ్బారావు, సీపీఎం రాష్ట్ర నాయకుడు



# ఎస్‌ఐ ఫలితాలు విడుదల

- 10 నెలలుగా పెండింగ్‌లో ఫలితాలు
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఫలితాలకు మోక్షం
- పాల్గొన్న హోంమంత్రి సుచరిత, డీజీపీ గౌతమ్ సవాంగ్
- వారంలోగా 2,200 కానిస్టేబుల్ సహా 2,808 పోస్టుల ఫలితాలు: హోంమంత్రి



ఎస్‌ఐ రాత పరీక్ష ఫలితాలు సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా విడుదల చేస్తున్న హోంమంత్రి సుచరిత, చిత్రంలో డీజీపీ గౌతమ్ సవాంగ్

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్‌ఐ ఫలితాల సీడీని అసెంబ్లీ చాంబర్‌లో సీఎంకు హోంమంత్రి సుచరిత, డీజీపీ గౌతమ్‌సవాంగ్, స్టేట్‌లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎస్‌ఎల్‌పీఆర్‌బీ) చైర్మన్ కుమార్ విశ్వజిత్ అందజేశారు. ఈ పోస్టుల భర్తీ పెండింగ్‌లో ఉండడంపై దృష్టి సారించిన సీఎం వెంటనే ఫలితాలు విడుదల చేయాలంటూ కొద్దిరోజుల క్రితం అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్రంలో 333 సబ్‌ఇన్‌స్పెక్టర్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఆర్, ఏపీఎస్‌పీ), డిప్యూటీ జైలర్లు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ల ఫలితాలను రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రిలీజ్ చేసింది. ఎస్‌ఐ పోస్టుల కోసం మొత్తం 1,35,414 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రిలిమినరీ పరీక్ష, ఫిజికల్ పరీక్షలు పూర్తయ్యాక అర్హత పొందిన 32,745 మంది రాత పరీక్షకు హాజరయ్యారు. వీరంతా 149 సివిల్ ఎస్‌ఐ, 75 రిజర్వ్ ఎస్‌ఐ, 75 ఏపీ స్పెషల్ పోలీస్ విభాగానికి చెందిన ఎస్‌ఐ, 10 మంది డిప్యూటీ జైలర్లు (పురుషులు), మరో నలుగురు డిప్యూటీ జైలర్లు (మహిళలు), 20 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు పోటీపడ్డారు. ఎస్‌ఐ పోస్టుల ఫలితాల్లో ఎంపికైన వారికి సీఎం జగన్ అభినందనలు తెలిపారు. పౌరులకు సేవ చేయడానికి ఇదొక మంచి అవకాశమని, వృత్తిపట్ల అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలని సీఎం సూచించారు.

**టాపర్లు వీరే..:** నెల్లూరుకు చెందిన పరుచూరు మహేష్, వైఎస్సార్ జిల్లాకు చెందిన షేక్ హుస్సేన్, పాలెం రవికిశోర్‌లు 255 మార్కులతో అగ్రస్థానం (టాపర్లు)లో నిలిచారు. ఎస్‌ఐ పోస్టులకు 15,775 మంది మహిళా అభ్యర్థులు పోటీపడగా వారిలో 61 మంది ఎంపికయ్యారు. కృష్ణా జిల్లాకు చెందిన ప్రజ్ఞ 224 మార్కులతో టాపర్‌గా నిలిచారు.

### వారంలో కానిస్టేబుల్స్ ఫలితాలు

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 2,200 కానిస్టేబుల్ సహా 2,808 పోస్టుల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించినట్టు హోంమంత్రి సుచరిత చెప్పారు. ఎస్‌ఐ పోస్టుల్లో ఎంపికైన వారికి పరిశీలన పూర్తయ్యాక శిక్షణ ఇస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ పోస్టుల ఫలితాలను వారం రోజుల్లో విడుదల చేస్తామన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ఇంకా 17 శాతం ఖాళీలున్నాయని, సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన భర్తీ చేస్తామని తెలిపారు.

### పేదలకు న్యాయం చేస్తా



**సంగం:** తాను సబ్‌ఇన్‌స్పెక్టర్ అయిన తరువాత పేదలకు న్యాయం చేస్తానని ఎస్‌ఐ రాత పరీక్షలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన పరుచూరు మహేష్‌కుమార్ తెలిపారు. నెల్లూరు జిల్లా సంగం మండలం తలుపూరుపాడు గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ సోమవారం వెలువడిన ఎస్‌ఐ రాత పరీక్ష ఫలితాల్లో 255 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ 'సాక్షి'తో మాట్లాడారు. తాను పేదరికంలో పుట్టి పెరిగానని, పేదల కోసం పనిచేస్తానన్నారు. తన తల్లి లక్ష్మీకాంతమ్మ, తండ్రి మాల్యాద్రి కష్టపడి తనను చదివించారని, వారి దయతోనే తాను ఈ స్థాయికి చేరానని తెలిపారు.

# ఒప్పంద విలువకంటే అధిక బిల్లులా?

### పోలవరం కుడి కాలువ పనుల్లో అక్రమాలు బహిర్గతం

**సాక్షి, అమరావతి:** పోలవరం కుడి కాలువ పనుల్లో ఒప్పంద విలువ కంటే కాంట్రాక్టర్లకు అధికంగా బిల్లులు చెల్లించడంపై నిపుణుల కమిటీ విస్మయం వ్యక్తం చేసింది. ఏడు ప్యాకేజీల్లోనూ అరకొరగా మిగిలిన పనులను 60సీ నిబంధన కింద తొలగించి.. వాటి అంచనా వ్యయాన్ని పెంచేసి.. కొత్త కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో ఎందుకు అప్పగించారని అధికారులను నిలదీసింది. కంట్రోల్ బ్లాస్టింగ్ విధానంలో పనులు చేయకున్నా, చేసినట్లు చూపి అధికంగా బిల్లులు చెల్లించారని తేల్చింది. పూడిక లేకపోయినా ఉన్నట్లు.. దానిని తీసినట్లు చూపి అదనంగా బిల్లులు చెల్లించడంపై అధికారులను నిలదీసింది. రాష్ట్రంలో టీడీపీ సర్కార్ హయాంలో ఇంజనీరింగ్ పనుల్లో జరిగిన అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ విజయవాడలో సోమవారం పోలవరం కుడి కాలువ అధికారులతో సమావేశమైంది. కుడి కాలువలో నాలుగో ప్యాకేజీలో కాంట్రాక్టు ఒప్పంద విలువ రూ. 301 కోట్లు అయితే.. బిల్లుల రూపంలో రూ. 365 కోట్లు చెల్లించారని తేల్చింది. కాంట్రాక్టర్‌కు అదనంగా రూ. 64 కోట్లు ప్రయోజనం చేకూర్చారని గుర్తించింది. ఏడో ప్యాకేజీలో బీఎస్‌పీసీఎల్ సంస్థకు మొదట రూ. 56.45 కోట్ల విలువైన పనిని 60–సీ నిబంధన కింద పాత కాంట్రాక్టర్ నుంచి తొలగించి అప్పగించడం, ఆ తర్వాత అదనంగా రూ. 17.10 కోట్లను చెల్లించడంపై ఆరా తీసింది. కుడి కాలువను తవ్విన ప్రాంతంలో ఎక్కడా బండరాళ్లు లేవని, 2004 నుంచి 2014 వరకూ చేసిన పనుల్లో కంట్రోల్ బ్లాస్టింగ్ విధానాన్ని అమలు చేయలేదని, కానీ 2014 తర్వాత చేపట్టిన పనుల్లో కంట్రోల్ బ్లాస్టింగ్ విధానంలో కాలువ పనులు చేసినట్లు చూపి కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చారని స్పష్టం చేసింది. కాంట్రాక్టర్లు కంట్రోల్ బ్లాస్టింగ్ విధానంలో పనులు చేశారనడానికి సరైన ఆధారాలు చూపడంలో అధికారులు చేతులెత్తేశారు. కుడి కాలువలో కొన్ని ప్యాకేజీల పనుల వివరాలకు సంబంధించిన రికార్డులను అధికారులు అసంపూర్తిగా తేవడంపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం పూర్తి వివరాలతో కమిటీ ముందు హాజరుకావాలని అధికారులను ఆదేశించింది. ఇప్పటికే పోలవరం హెడ్ వర్క్స్, ఎడమ కాలువ పనులపై విచారణను పూర్తి చేసిన నిపుణుల కమిటీ.. కుడి కాలువ, కనెక్టివిటీస్(అనుసంధానాలు) పనులపై విచారణ పూర్తి చేసి సర్కార్‌కు వారం రోజుల్లో నివేదిక ఇవ్వనుంది.

# జగన్ చరిత్ర సృష్టిస్తారు

- వీడ్కోలు కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్
- అవినీతి రహిత పాలన కోసం ముఖ్యమంత్రి తపిస్తున్నారు
- పాలన ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే అద్భుతాలు చేశారు
- అసెంబ్లీలో చక్కటి సభా సంప్రదాయాలను పాటిస్తున్నారు
- జగన్ ప్రమాణ స్వీకారం నాడు నాకు త్యాగరాజు కీర్తన గుర్తుకొచ్చింది
- నన్ను నాన్న మాదిరిగా చేయి పట్టుకుని నడిపించారు: సీఎం జగన్

సాక్షి, అమరావతి





వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్. గవర్నర్ దంపతులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రారంభించిన ఈ 54 రోజుల్లోనే అద్భుతాలు చేశారని గవర్నర్ నరసింహన్ అభినందించారు. జగన్ తన పరిపాలనతో ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర సృష్టిస్తారని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు ఉమ్మడి గవర్నర్‌గా వ్యవహరించిన నరసింహన్ రాష్ట్ర బాధ్యతల నుంచి వైదొలుగుతున్న నేపథ్యంలో సోమవారం విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ వైఎస్ జగన్ అసెంబ్లీలో చక్కటి సభా సంప్రదాయాలను పాటిస్తున్నారని కితాబిచ్చారు. పాలన ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఆయన టీ 20 క్రికెట్ తరహాలో ప్రతి బాల్‌ను బౌండరీని దాటించడమే కాకుండా సిక్సర్‌లు కొడుతున్నారని వ్యాఖ్యానించారు. ఏపీతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ విజయవాడలోనే తన అక్షరాభ్యాసం,ప్రాథమిక విద్య జరిగిందని నరసింహన్ వెల్లడించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంకా ఏమన్నారో వివరాలు ఆయన మాటల్లోనే..

'ఇవి నాకు, నా శ్రీమతి విమలకు ఉద్వేగపూరిత క్షణాలు. మిమ్మల్ని వీడి వెళుతున్నా. మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్‌తో నాకు విడదీయరాని సంబంధం ఉంది. విజయవాడలోని అట్కిన్సన్ స్కూల్‌లో నా అక్షరాభ్యాసం 1951లో జరిగింది. అప్పట్లో మేం గవర్నర్‌పేటలో నివాసం ఉన్నాం. ఐపీఎస్‌కు ఎంపికయ్యాక ట్రెయినింగ్ అనంతపురంలో కాగా నాకు పునర్జన్మ ఇచ్చింది నంద్యాల. ప్రమోషన్ మీద నియామకం జరిగింది ప్రకాశం జిల్లాలో. నా తల్లిదండ్రులు నాకు అహోబిలం నరసింహుడి పేరు పెట్టారు. అయితే నేను నరసింహుడి పాత్ర వహించానా లేదా? అనేది నాకు అర్థం కాని విషయం.

### త్యాగయ్య కీర్తన గుర్తుకొచ్చింది...

ఇక జగన్‌మోహన్‌రెడ్డి విషయానికి వస్తే... 'జే' అనే అక్షరంతో మొదలయ్యే పేరు గల ఏ వ్యక్తి అయినా అందరిలో అత్యంత ప్రియమైనవారుగా, ముచ్చటైన వారుగా ఉంటారు. జగన్‌మోహన్ అంటే జగత్తులో మోహనుడు, విశ్వంలో అందరూ ప్రేమించే వ్యక్తి. జగన్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసేటపుడు నాకు త్యాగరాజస్వామి కీర్తన ''నను పాలించగ నడిచీ వచ్చితివా... ఓ రామా...'' గుర్తుకొచ్చింది. రాష్ట్ర ప్రజలంతా 'మము పాలించగ నడిచీ వచ్చితివా... ఓ జగన్' అని భావించారని నాకు అనిపించింది.

### కొద్ది రోజుల్లోనే అద్భుతాలు చూశా..

ఒక టీం కెప్టెన్‌గా, ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా వైఎస్ జగన్ పాలన ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే నేను అద్భుతాలను చూశా. టీ 20 మ్యాచ్‌లో తొలి పది ఓవర్లు బాగా ఆడిన తరువాత మధ్య ఓవర్లకు వచ్చేటప్పటికి పరిస్థితి స్థిమితంగా ఉంటుంది. చివరి ఓవర్లలో వేగంగా ఎక్కువ పరుగులు తీస్తారు. బహుశా మీరు కూడా దీన్నే పాటిస్తున్నారని భావిస్తున్నా. ఇపుడు మీరు పరుగులు హిట్ చేస్తున్నారు. ఆ తరువాత పరిస్థితిని సుస్థిరం చేసుకుంటారు. మీరు సెంచరీ చేస్తూ నాటౌట్‌గా ఉండాలని, మరిన్ని ఎక్కువ సెంచరీలు చేయాలని కోరుకుంటున్నా. 'భారతి అమ్మ' అంటే అందరికీ ఓ రకమైన శక్తిని ఇస్తుంది. బహుశా జగన్ తన భార్య భారతి నుంచి అదే శక్తిని పొందుతున్నారని భావిస్తున్నా. ఏమైనా వారిద్దరూ ప్రత్యేక దంపతులు అని చెబుతున్నా.

### చర్చలు.. సంప్రదింపులు.. భిన్నాభిప్రాయాలు.. తుది నిర్ణయం

మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌కుమార్ ముఖర్జీ చెప్పినట్లుగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపులు, భిన్నాభిప్రాయాలు ఆ తరువాత తుది నిర్ణయం ముఖ్యమైన అంశాలు. కొద్ది రోజులుగా ఏపీ అసెంబ్లీలో జరుగుతున్న కార్యక్రమాల తీరును నేను గమనిస్తున్నా. మీరు (వైఎస్ జగన్) చక్కటి పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తున్నట్లు నాకు అర్థం అవుతోంది. చర్చ, సంప్రదింపులు, భిన్నాభిప్రాయాలు, ఆ తరువాత నిర్ణయం అనే విధానాన్ని మీరు అనుసరిస్తున్నారు. మీరు ఇదే తీరును కొనసాగించాలని కోరుకుంటున్నా. మీరు చాలా దూరం రాజకీయ ప్రయాణం చేయాలి. కొత్తగా పరిపాలనలోకి వచ్చారు. పునాదులు బాగా వేస్తే భవిష్యత్తులో అభివృద్ధి గట్టిగా ఉంటుంది. మీకు అద్భుతమైన జట్టు ఉంది. ఈ జట్టుతో ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర సృష్టిస్తారని గట్టిగా విశ్వసిస్తున్నా. ఇక్కడున్న మంత్రులందరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఇన్నేళ్లుగా సహకరించిన కేంద్ర, రాష్ట్ర సర్వీసు అధికారులకు ధన్యవాదాలు.

> "మీరు (ముఖ్యమంత్రి జగన్) అభివృద్ధి కోసం, అవినీతి రహిత పాలన కోసం తపన పడుతున్నారు. అలాంటి మీ ప్రభుత్వం కలకాలం వర్థిల్లాలి. మీ ప్రభుత్వం చరిత్ర సృష్టించాలి అని మనసారా ప్రార్థిస్తున్నా. ఈ రాష్ట్రం విజయాన్ని, అభివృద్ధిని నేను కోరుకుంటా. ఈ రాష్ట్రం విజయవంతం అయితే అది నా విజయంగా భావిస్తా, గర్విస్తా. నేను తెలిసో... తెలియకో కొన్ని తప్పులు చేశా. కొన్ని సమయాల్లో తెలిసి చేశా, కొన్నిసార్లు తెలియక చేశా. వాటన్నింటికీ నన్ను క్షమించండి"

> "నరసింహావతారం స్తంభంలో నుంచి బయటకు వచ్చి పని పూర్తి చేసి వెళ్లి పోతుంది. రామావతారంలా సుదీర్ఘకాలం పాటు ఉండి తన భార్యను అడవులకు పంపేది కాదు. కానీ ఈ నరసింహావతారం మాత్రం ఇక్కడ చాలా కాలం పాటు ఉండిపోయింది"
>
> – వీడ్కోలు కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్

### ఈ రాష్ట్రం మంచి కోసమే...

మీకు రాయలసీమను జాగ్రత్తగా చూసుకునేందుకు అహోబిలంలో ఒక నరసింహుడున్నాడు. ఉత్తరాంధ్రను జాగ్రత్తగా చూసుకునేందుకు సింహాచలం నరసింహస్వామి ఉన్నాడు. ఇక్కడ పానకాల నరసింహస్వామి ఉంటాడు. జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు పుణ్యక్షేత్రాలైన తిరుపతి, కడప దర్గా, ఆ తరువాత చర్చికి వెళ్లారు. ఆ తరువాత తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్దకు వెళ్లారు. ఆ తరువాత బెజవాడ కనకదుర్గమ్మ తల్లి వద్దకు వచ్చారు. అయితే మీరు అతి ముఖ్యమైన నరసింహస్వామిని దర్శించుకోలేదని, మీ తీర్థయాత్ర పూర్తి కాలేదని ఆరోజు ఆయనకు చెప్పా. జగన్.. నన్ను మీరు క్షమించాలి. గత 54 రోజుల్లో నేను నా పరిధులు అతిక్రమించి ఏదైనా చెప్పే చనువు తీసుకుని ఉండొచ్చు. మిమ్మల్ని నా కుమారుడిలా భావించి చెప్పా తప్ప వేరే ఉద్దేశం లేదు. నేను ఏం చెప్పినా అది ఈ రాష్ట్రం మంచి కోసం మాత్రమే''

### గవర్నర్‌కు ఘన సన్మానం

గవర్నర్ నరసింహన్‌కు వీడ్కోలు సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. జగన్ సతీమణి వైఎస్ భారతి గవర్నర్ సతీమణి విమలా నరసింహన్‌కు పుష్పగుచ్ఛం, జ్ఞాపికను బహూకరించి గౌరవించారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

### దుర్గమ్మ సేవలో నరసింహన్ దంపతులు

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ), గన్నవరం:** అంతకుముందు గవర్నర్ నరసింహన్ దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి గవర్నర్ హోదాలో చివరిసారిగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయనకు గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం లభించింది. మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కృష్ణా జిల్లా కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్, విజయవాడ సీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులోని అంతర్జాతీయ టెర్మినల్ ఆవరణలో గవర్నర్‌కు ఏపీ పోలీస్ ప్రత్యేక దళాల నేతృత్వంలో గౌరవ వందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజయవాడలో పర్యటన ముగిసిన అనంతరం సోమవారం రాత్రి గవర్నర్ నరసింహన్ ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

### నాన్న పాత్ర పోషించారు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

'నాకు ఓవైపు మనసులో బాధగా ఉంది.. మరోవైపు ఆయన ఎక్కడికీ వెళ్లడం లేదు, పక్కనే ఉన్నారన్న ఆనందమూ ఉంది. గవర్నర్‌తో నాకు చాలా అనుబంధం, అనుభూతి ఉంది. గత పదేళ్లుగా బాగా పరిచయం ఉన్న వ్యక్తి ఆయన. ఒక పెద్ద మనిషిగా ఇంచుమించుగా నాన్న పాత్రనే పోషిస్తూ నాకు సలహాలు ఇచ్చేవారు. నేను ముఖ్యమంత్రి అయిన తరువాత నా చేయి పట్టుకుని దగ్గరుండి నడిపించారు. అలాంటి వ్యక్తి దూరమవుతున్నారని మనసులో బాధగా అనిపించినా ఆయన ఆశీస్సులు మనకు ఎప్పుడూ ఉంటాయని భావిస్తున్నా. ఆయన ఎక్కడ ఉన్నా ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున, మా అందరి తరపున ఎప్పుడూ గుర్తుంచుకుంటాం. ఆయనతో గడిపే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా'

# ఇంటి దోపిడీ రూ.4,930.15 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

తప్పుబట్టింది. వీఎన్‌సీ–ఎస్వీసీ(జేవీ), వీఎన్‌సీ, కేఎంవీ, షాపూర్‌జీ పల్లోంజీ, ఎన్‌సీసీ, కేపీసీ, టాటా, ఎల్ అండ్ టీ, సింప్లెక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మాత్రమే పాల్గొనేలా నిబంధనలు రూపొందించారని పేర్కొంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక, భూసేకరణ లేకుండానే టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో ధరల సర్దుబాటు కింద అధిక మొత్తం పరిహారం చెల్లించాల్సిన దుస్థితి దాపురించిందని పేర్కొంది. పనుల్లో తీవ్ర జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై జరిమానా విధించకపోవడాన్ని తప్పుబట్టింది. అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనపై ఏపీ టిడ్కో అధికారులను ప్రశ్నిస్తే 'ఉన్నత స్థాయి ఒత్తిళ్ల మేరకు పెద్దలు ఎలా చెబితే అలా చేశాం..' అని సమాధానం ఇచ్చారని పేర్కొంది.

### కఠిన చర్యలకు కమిటీ సిఫారసు..

పేదలకు ఉచితంగా ఇళ్లను నిర్మించి ఇవ్వాల్సి ఉండగా వారిపై అప్పుల భారం మోపి మరీ నిధులను కాజేసిన వైనంపై విధానపరమైన నిర్ణయం తీసుకుని అక్రమాలకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ నిపుణుల కమిటీ ఈనెల 17వతేదీన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఏపీ టిడ్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో చేపట్టిన పట్టణ పేదల ఇళ్ల నిర్మాణంపై కమిటీ విచారణ జరిపి రికార్డులు తనిఖీ చేసింది. క్షేత్రస్థాయిలో విచారించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

### పేదలకు సొంతింటి పేరుతో దోపిడీ..

రాష్ట్రంలో పట్టణ ప్రాంత పేదలకు 225 చోట్ల 4,54,909 గృహాలను నిర్మించే పనులను 34 ప్యాకేజీలుగా విభజించి 2017 ఏప్రిల్‌లో ఈపీసీ (ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) విధానంలో టెండర్లు పిలిచారు. ఇళ్లను మూడు రకాలుగా 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని నిర్ణయించారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.5 లక్షల చొప్పున మొత్తం రూ.3 లక్షలు చెల్లిస్తాయి. ఈ నిధులతో సాంప్రదాయ పద్ధతుల్లో ఇళ్లను నిర్మించే అవకాశం ఉన్నా టీడీపీ సర్కారు పేదలపై పెనుభారం మోపింది. గత సర్కార్ వ్యవహరించిన విధానాల వల్ల 300 చదరపు అడుగుల ఇంటి నిర్మాణ వ్యయం రూ.5.72 లక్షలకు(లబ్ధిదారుడిపై భారం రూ.2.72 లక్షలు), 365 చదరపు అడుగులకు రూ.6.74 లక్షలకు (లబ్ధిదారుడిపై భారం రూ.3.74 లక్షలు), 430 చదరపు అడుగుల ఇంటి నిర్మాణ వ్యయం రూ.7.71 లక్షలకు (లబ్ధిదారుడిపై భారం రూ.4.71 లక్షలు) పెరిగిందని కమిటీ తేల్చింది. ఫలితంగా ఇళ్ల నిర్మాణ వ్యయం రూ.25,170.99 కోట్లకు చేరుకుందని నిపుణుల కమిటీ పేర్కొంది. లబ్ధిదారుడి వాటా రూపంలో బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి మరీ ఈ డబ్బులను టీడీపీ సర్కార్ దోచేసింది.

### చ.అడుగుకు రూ.800 పెంపు

సాంప్రదాయ పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.1100కి మించదని అయితే షీర్ వాల్ టెక్నాలజీ పేరుతో చదరపు అడుగుకు రూ.1900కు పెంచేశారని పేర్కొంది. ఒప్పందం ప్రకారం 15 నెలల్లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా రెండేళ్లు గడిచినా అసంపూర్తిగానే ఉన్నాయని కమిటీ తెలిపింది. 100 మిమీల మందం కలిగిన గోడలతో నిర్మిస్తున్న ఇళ్లు చలి, ఎండలను ఆపలేవని అభిప్రాయపడింది.

### తనిఖీలు తుంగలోకి..

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ అకౌంట్ కోడ్ (పేరా 294 నుంచి 297) ప్రకారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పనులను తనిఖీ చేసి రికార్డు చేసేవరకు బిల్లులు చెల్లించకూడదు. రూ.5 లక్షల కంటే ఎక్కువ అంచనా వ్యయం ఉన్న వాటిల్లో ఈఈ స్థాయి అధికారి కనీసం 30 శాతం పనులను తనిఖీ చేయాలి. రూ.50 లక్షలకు మించితే మూడింట ఒక వంతు లేదా మూడింట రెండొంతుల పనిని ఎస్‌ఈ స్థాయి అధికారి తనిఖీ చేశాకే బిల్లులు చెల్లించాలి. అయితే ఈ నిబంధనలు ఉల్లంఘించి తనిఖీలు లేకుండా, చెక్ మెజర్‌మెంట్ చేయకుండానే బిల్లులు చెల్లించారని నిపుణుల కమిటీ తేల్చింది.

### గ్రావెల్‌లో గోల్‌మాల్ రూ.60 లక్షలు!

కృష్ణా జిల్లా జక్కంపూడి వద్ద జీ+3 విధానంలో 10,624 ఇళ్లు నిర్మిస్తున్న ప్రాంతాన్ని నిపుణుల కమిటీ ఈనెల 12న తనిఖీ చేసింది. ఈ పనులను 4.53 శాతం అధిక ధరలకు అంటే రూ.649.44 కోట్లకు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మే 27 నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇంతవరకు ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ఇక్కడ నిర్మిస్తున్న ఇళ్లకు గ్రావెల్‌ను 16 కి.మీ.ల నుంచి తరలిస్తున్నట్లు బిల్లులు చెల్లించారు. నిజానికి ఇళ్లు నిర్మిస్తున్న ప్రదేశం నుంచే గ్రావెల్‌ను తవ్వి సేకరించారు. ఇందులో కాంట్రాక్టర్‌కు రూ.60 లక్షలు దోచిపెట్టారు. రూ.649.44 కోట్లతో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను ఒకే డీఈఈ, రెండు జిల్లాల్లో విస్తరించిన రూ.మూడు వేల కోట్ల విలువైన పనులను ఒక ఎస్‌ఈ, ఒక ఈఈ, 12 మంది డీఈలు పర్యవేక్షిస్తున్నారని.. దీనివల్ల పనుల నాణ్యత లోపించిందని నిపుణుల కమిటీ తేల్చింది.

### పట్టణ పేదల ఇళ్లలో దోపిడీ ఇలా.. (రూ. కోట్లలో)




మొత్తం అదనపు ప్రయోజనం 4,993.70 కోట్లు

### కాంట్రాక్టర్లకు లబ్ధి ఇలా...

- ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో రూ.7 లక్షలతో మోడల్ హౌస్ నిర్మించాల్సి ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 225 ప్రాంతాల్లో ఏ ఒక్క చోట కూడా కాంట్రాక్టర్లు వీటిని కట్టలేదు. దీనివల్ల కాంట్రాక్టర్లకు రూ.15.75 కోట్ల మేర లబ్ధి చేకూరింది.



- రూ.9.50 లక్షలతో 500 చదరపు అడుగుల్లో ఏపీ టిడ్కోకు సైట్ ఆఫీస్ నిర్మించి ఇవ్వాలి. కానీ ఒక్కచోట కూడా కాంట్రాక్టర్లు దీన్ని పాటించకపోవడంతో వారికి రూ.21.38 కోట్ల మేరకు ప్రయోజనం కలిగింది.



- ఒక్కో స్టీల్ ఫ్రేమ్, షట్టర్స్(యూనిట్)ను రూ.6 వేల చొప్పున అధిక ధరకు కొనుగోలు చేసి కాంట్రాక్టర్లకు రూ.272.95 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారు. కిటికీలను కూడా ఒక్కో యూనిట్ రూ.6 వేల చొప్పున అధిక ధరకు కొనడంతో కాంట్రాక్టర్లకు రూ.272.95 కోట్ల మేర లబ్ధి కలిగింది.



- ఇళ్లలో అంతర్గత విద్యుదీకరణ, నీటి సరాఫరా, పారిశుద్ధ్యం పనులకు చదరపు అడుగుకు రూ.175 చొప్పున చెల్లిస్తామని ఎస్టిమేట్లలో పేర్కొన్న ఏపీ టిడ్కో చదరపు అడుగుకు రూ.50 చొప్పున అధికంగా చెల్లించింది. ఇందులో కాంట్రాక్టర్లకు రూ.578.80 కోట్లను దోచిపెట్టారు.



- విట్రిఫైడ్ టైల్స్ ఫ్లోరింగ్ పనుల్లోనూ కాంట్రాక్టర్లకు చదరపు అడుగుకు రూ.20 చొప్పున అధికంగా చెల్లించారు. పెయింటింగ్‌లో చదరపు అడుగుకు రూ.30 చొప్పున అధికంగా ఇచ్చారు. దీనివల్ల కాంట్రాక్టర్లకు రూ.578.80 కోట్ల మేర లబ్ధి చేకూరింది.



- అల్యూమినియం షట్టరింగ్ వల్ల చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ.200 చొప్పున పెరిగి పేదలపై రూ.3186.92 కోట్ల భారం పడిందని నిపుణుల కమిటీ నిర్ధారించింది.



### కనీసం రిజిస్టర్లూ లేవు...

- డిజైన్ 1893–2016 ప్రకారం రిజిడ్ మోనోలిథిక్ కన్‌స్ట్రక్షన్ విధానంలో వంద మిమీల గోడ నిర్మించాల్సి ఉండగా ఒకే లేయర్ రీయిన్‌ఫోర్స్‌మెంట్ వినియోగిస్తుండటాన్ని కమిటీ తప్పుబట్టింది.
- ఐబీఎం ప్రమాణాల ప్రకారం విస్కస్ మాడిఫైడ్ ఏజెంట్ క్యూబిక్ మీటర్‌కు 0.4 కేజీని వినియోగించాలి. సిమెంటు, నీటి నిష్పత్తి 0.43 శాతం ఉండాలి. క్షేత్ర స్థాయి పరీక్షలు, కోర్ టెస్ట్‌ల్లో వాటి పరిమాణాలు చాలా తక్కువగా ఉండటంతో పనులు నాసిరకంగా ఉన్నాయి.
- ఒప్పందం ప్రకారం విద్యుత్ ఉపకరణాలు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం పనుల్లో ఉపయోగించే ఉపకరణాలు, డోర్స్, ఫ్లోరింగ్, టైల్స్ సరఫరా చేయడం లేదు. చౌకగా దొరికే నాసిరకమైన ఉపకరణాలను వినియోగిస్తున్నారు.
- సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ప్రమాణాల మేరకు ఏపీ టిడ్కో అధికారులు రిజిస్టర్లు నిర్వహించడం లేదు.

సాక్షి
మంగళవారం, జూలై, 23

# అద్భుత విజయం

చందమామపై 60 ఏళ్లుగా సాగుతున్న పరిశోధనల పరంపరను కీలక మలుపు తిప్పే అపురూపమైన విజయాన్ని సొంతం చేసుకుని మన శాస్త్రవేత్తలు దేశ కీర్తి పతాకను సమున్నతంగా ఎగరేశారు. సోమవారంనాడు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) నుంచి ప్రయోగించిన చంద్రయాన్–2 ప్రపంచ అంతరిక్ష పరిశోధనల్లోనే సువర్ణాధ్యాయంగా ఆవిష్కరించదగ్గ ఘట్టం. పెను సవాళ్లు ఇమిడి ఉండే సంక్లిష్టమైన ప్రయోగాలు చేపట్టడంలో, వాటిని విజయతీరాలకు చేర్చడంలో ఇస్రో శాస్త్రవేత్తలకు ఎవరూ సాటిరారు. వారి పరిశోధనా ప్రస్థానంలో అపజయాలు, ఆశాభంగాలు అతి తక్కువ. ఇప్పుడు చంద్రయాన్–2 ప్రాజెక్టులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఆ ఒరవడిని కొనసాగించారు. ఈ ప్రాజెక్టుకు ఇద్దరు మహిళలు నాయకత్వం వహించడం, మొత్తం ప్రాజెక్టులోనే 30 శాతంమంది మహిళలు పాలుపంచుకోవడం ఎన్నదగ్గది. చంద్రయాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ముత్తయ్య వనిత, మిషన్ డైరెక్టర్ రితూ కరిధాల్ ఈ ప్రాజెక్టును తమ భుజస్కంధాలపై వేసుకుని శ్రమించిన తీరు అందరికీ ఆదర్శప్రాయమైనది.

చెప్పాలంటే మన శాస్త్రవేత్తలను అభినందించాల్సింది కేవలం సోమవారం సాధించిన ఘన విజయానికి మాత్రమే కాదు. వారం క్రితం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సహా పెద్దలంతా చంద్రయాన్ ప్రయోగాన్ని స్వయంగా వీక్షించడానికి ఎదురు చూస్తున్న వేళ... సరిగ్గా 56 నిమిషాల ముందు దాన్ని వాయిదా వేయాలని తీసుకున్న సాహసోపేత నిర్ణయానికి సైతం వీరిని ప్రశంసించాలి. ఎందుకంటే అవి సంక్లిష్టమైన క్షణాలు. పెద్దలంతా కొలువుదీరిన వేళ అత్యంత కీలకమైన మూడో దశ సమయంలో పనిచేయాల్సిన క్రయోజెనిక్ ఇంజిన్‌కు సాంకేతిక లోపం ఏర్పడిందని, గ్యాస్ బాటిల్ లీక్ అయిందని కనుగొనడం ఒక ఎత్తయితే... ఏమాత్రం ఊగిసలాట లేకుండా ప్రయోగాన్ని వాయిదా వేయాలనుకోవటం మరో ఎత్తు. నిజానికి ఈ పరిణామం జరగ్గానే కొందరు పెదవి విరిచారు. మళ్లీ ఎన్ని వారాలూ, ఎన్ని నెలలూ పడుతుందోనని నిట్టూర్చారు. కానీ అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ శాస్త్రవేత్తలంతా సత్వరం తమ కర్తవ్యాన్ని పూర్తిచేశారు. లోపం ఎందుకు జరిగిందో, ఎక్కడ జరిగిందో గుర్తించారు. వారం పూర్తయ్యేసరికి విజయం తమదేనని నిరూపించుకున్నారు. ఈ ప్రాజెక్ట్ నిన్న మొన్నటిది కాదు. దీని కోసం గత పదేళ్లుగా ఇస్రో శాస్త్రవేత్తలు కఠోర శ్రమ చేస్తున్నారు. చంద్రయాన్–1 ద్వారా చంద్రుడిపై నీటిజాడ కనుక్కొన్న చరిత్ర వారిది. పైగా ఇస్రో ఇంతవరకూ చేసిన ప్రయోగాలన్నిటిలోనూ ఇది అత్యంత జటిలమైనది. ప్రతిదీ ఒకటికి పదిసార్లు చూసుకోవాలి. ఎక్కడ ఏమరుపాటుగా ఉన్నా 'చిర దీక్షా శిక్షా తపస్సమీక్ష' మొత్తం చెదిరిపోతుంది. మరిన్ని ఏళ్లు శ్రమపడవలసి వస్తుంది. వైజ్ఞానికంగా ఎంతో వెనకబడిపోయే ప్రమాదం ఉంటుంది.

ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న శాస్త్రవేత్తల బృందం ఎంత ఒత్తిడికి లోనయి ఉంటుందో, ఏ స్థాయిలో ఆందోళన పడి ఉంటుందో వీటినిబట్టే అర్థం చేసుకోవచ్చు. ఇన్నిటిని తట్టుకుని ఒక అద్భుత విజయాన్ని అందించినందుకు వీరందరూ అభినందనీయులు. మొత్తం 6,400 కిలోల బరువైన జీఎస్‌ఎల్‌వీ మార్ 3–ఎం1లో చంద్రయాన్–2 ఉపగ్రహం బరువు 3,850 కిలోలు. ఇందులో 2.3 టన్నుల బరువున్న ఆర్బిటర్, 1.4 టన్నుల బరువున్న ల్యాండర్(విక్రమ్), 27 కిలోల బరువున్న రోవర్(ప్రజ్ఞాన్) ఉన్నాయి. ఈ ప్రజ్ఞాన్‌లో మన దేశ ఉపకరణాలతోపాటు అమెరికా, యూరప్‌లకు చెందిన నాలుగు ఉపకరణాలు కూడా ఉన్నాయి. జీఎస్‌ఎల్‌వీ రాకెట్ అనుకున్నట్టుగా ఆర్బిటర్‌ను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇక అది 50 రోజులు ప్రయాణించి జాబిల్లిపైకి చేరాలి. ఆర్బిటర్ ఏడాదిపాటు చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ దాని వెలుపలి వాతావరణ స్థితిగతులపై శాస్త్రవేత్తలకు విలువైన సమాచారాన్ని పంపుతుంటుంది. మరోపక్క అది చంద్రుడికి 150 కిలోమీటర్ల దూరంలో ఉందనగా దాన్నుంచి ల్యాండర్ 'విక్రమ్' వేరు పడి చంద్రుడి దిశగా ప్రయాణం మొదలుపెడుతుంది. సెప్టెంబర్ 6నాటికి –157 డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే ఉండే అతి శీతల దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగుతుంది. ఇది ఇంతవరకూ ఏ దేశమూ తలపెట్టని అరుదైన విన్యాసం. 'విక్రమ్' అలా చేరుకున్న కాసేపటికే దాన్నుంచి రోవర్ 'ప్రజ్ఞాన్' బయటికొస్తుంది. దాదాపు అరకిలోమీటర్ ప్రయాణించి చంద్రుడి ఉపరితలాన్ని, దాని లోపలి భాగాన్ని పరిశోధిస్తుంది. అనేక ప్రయోగాలు చేపడుతుంది. ఈ ఫలితాలకు సంబంధించిన డేటా అంతా ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలకు చేరుస్తుంది. ఈ ప్రయోగాలన్నీ ఒక 'చాంద్రదినం'(లూనార్ డే)లో 'ప్రజ్ఞాన్' ముగించాల్సి ఉంటుంది. 'చాంద్రదినం' అంటే మనకు 14 రోజులు!

ప్రాచీనకాలం నుంచీ చంద్రుడు మానవాళి జీవితంలో పెనవేసుకుపోయాడు. వినీలాకాశంలో వెన్నెలలు విరజిమ్ముతూ పరవశింపజేసే చందమామ బాల్యంలో అందరికీ నేస్తమే. కవుల ఊహల్లో, కావ్యకల్పనల్లో కథావస్తువు. ఇప్పటికీ అతిలోక సౌందర్యానికి ఉపమానం చెప్పాలంటే ఎవరికైనా ఊహల్లో మెదిలేది చందమామే. 1966లో అప్పటి సోవియెట్ యూనియన్ తొలిసారిగా మానవ రహిత ఉపగ్రహం 'లూనా'ను ప్రయోగించినప్పటినుంచీ శాస్త్రవేత్తలకు సైతం చంద్రుడు దగ్గర చుట్టమయ్యాడు. 1969లో అమెరికా ఇద్దరు వ్యోమగాములతో అపోలో అంతరిక్ష నౌకను అక్కడికి పంపింది. నిజానికి వెన్నెలరాజు మానవాళి తొలి లక్ష్యం మాత్రమే. గగనాంతర రోదసిలో మునుముందుకు దూసుకుపోవడానికి చందమామ తొలి మెట్టు మాత్రమే. అక్కడికి చేరడం సులభమైతే అంతకన్నా కష్టతరమైన అరుణగ్రహం చేరడం మానవాళి మలి లక్ష్యమవుతుంది. మొత్తంగా సౌర వ్యవస్థపై మన చూపును నిశితం చేసేందుకు దోహదపడే ప్రయోగాల పరంపరలో చంద్రయాన్–2 ఒక మైలురాయి. కనుకనే ఇంతటి అరుదైన ఘన విజయాన్ని సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు హాట్సాఫ్ చెప్పాలి.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి బ.షష్ఠి ప.12.18 వరకు, తదుపరి సప్తమి
నక్షత్రం ఉత్తరాభాద్ర ఉ.10.34 వరకు, తదుపరి రేవతి
వర్జ్యం రా.11.36 నుంచి 1.21 వరకు, దుర్ముహూర్తం ఉ.8.12
నుంచి 9.04 వరకు, తదుపరి రా.10.57 నుంచి 11.44 వరకు
అమృతఘడియలు... లేవు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# రెండో స్వాతంత్ర్య పోరాటమా?

**స్వాతంత్ర్యోద్యమంలో అశేష త్యాగాలతో భారతీయులు సాధించుకున్న స్వేచ్ఛను, విమోచనను తొలుత కాంగ్రెస్ నాయకత్వం, ప్రస్తుతం బీజేపీ–ఆరెస్సెస్– నాయకత్వం వమ్ముచేసిన ఫలితమే 72 ఏళ్ల తర్వాత కూడా సురక్షితమైన, ఆధునిక, సమష్టి భారతం కలగానే ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తులు, ప్రాణాలు, పుస్తెలు సహా త్యాగం చేసిన కోట్లాదిమంది యోధుల జ్ఞాపకాలు వెన్నంటుతుండగా, నేడు స్వతంత్ర భారతంలో గాడితప్పిన పాలనా వ్యవస్థలు ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపైన ఉక్కుపాదం మోపి, బెదిరించి తమకు అనుకూల బాకాలుగా మార్చుకున్నాయి. ఈ నేపథ్యంలో 'ఒక దేశం, ఒక ఎన్నిక, ఒకే నేత' అనే సరికొత్త పాలనా నినాదం లేదా విధానంవల్ల దేశంలో రెండో స్వాతంత్ర్య పోరాటం ద్వారానే బహుశా మోదీ ఆశిస్తున్న నిజమైన 'సురక్ష ఆధునిక సర్వజనదేశం' ఆవిర్భవిస్తుందేమో కళ్లు వత్తులు చేసుకుని చూద్దాం!**



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''దేశంలో నిజమైన సెక్యులర్ (లౌకిక సమభావన) వ్యవస్థను నెలకొల్పగల అవకాశాలను కాంగ్రెస్ పోగొట్టుకుంది. సురక్షితమైన, ఆధునిక, సమష్టి భారతాన్ని నెలకొల్పాలన్న కల సాకారం కావడానికి ప్రజలు తోడ్పడాలి.''

*– ప్రధాని నరేంద్రమోదీ నూతన లోక్‌సభలో చేసిన ప్రకటన*

''రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారత్‌లో ఒక ప్రజా ఉద్యమ సంస్థ. భారత బహుముఖీన చిత్ర పటాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ కేంద్రకార్యాలయాన్ని దర్శించుకుని నాయకులతో చర్చలు జరిపాను. 1925లో స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ చరిత్ర నిరంతరం వివాదాలతో కూడుకున్నదైనప్పటికీ, అది ప్రపంచంలోనే అత్యంత పెద్ద స్వచ్ఛంద సంస్థగానే పేర్కొనాలి. జర్మనీ దేశస్తునిగా నాకు 1930–40లలో ఆరెస్సెస్ చరిత్ర గురించి అవగాహన ఉంది. ఆరెస్సెస్ నాయకుల్లో కొందరు జర్మనీ నాజీ (హిట్లర్) ఉద్యమం నుంచి ఉత్తేజం పొందారని నాకు తెలుసు. కొందరికి ఇష్టమున్నా లేకున్నా ఇది వాస్తవం.''

*– జర్మనీ రాయబారి లిండర్న్. ది హిందూ : 21–07–2019*

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 72 ఏళ్ల తర్వాత ఇప్పుడు ''సురక్షితమైన, ఆధునిక, సమష్టి భారతాన్ని నెలకొల్పాలన్న కల సాకారం కావడానికి ప్రజలు తోడ్పడాలని'' ప్రధాని మోదీ రెండోసారి ఎన్నికైన తర్వాత ప్రకటన చేయడంలో అర్థం ఏమై ఉంటుంది? ఆయన చెప్పే కల ఇంత వరకు సాకారం కాకపోవడానికి ఎవరు కారకులు? దీనికి సమాధానం.. స్వాతంత్ర్యానంతరం తొలి 20 ఏళ్లు మినహాయిస్తే మిగతా దశాబ్దాలన్నింటా, స్వాతంత్ర్యోద్యమంలో అశేష త్యాగాలతో భారతీయులు సాధించుకున్న స్వేచ్ఛను, విమోచనను ఒక వైపు నుంచి కాంగ్రెస్ అనంతర నాయకత్వం, ఆ పిమ్మట కాంగ్రెస్ స్థానంలో అదే స్వార్థ ప్రయోజనాలతో అధికార స్థానాలు ఆక్రమించిన ఆర్‌ఎస్‌ఎస్–బీజేపీ–ఎన్డీయే కూటమి నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేసింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశ స్వతంత్ర ఆర్థిక విధాన నిర్ణయాల గురించిన తొలి ప్రకటనలకు, ప్రజలకు చేసిన వాగ్దానాలకు, స్వతంత్ర విదేశాంగ విధానానికి, అలీన విధానంతోనే దేశాన్ని అభ్యుదయమార్గం పట్టించడానికి చేసిన తొలి ప్రయత్నాలన్నీ నేడు బుగ్గిపాలు కావడానికి ఈ రెండు శక్తులే కారణం. తొల్లింటి సమష్టి భారత లౌకిక రాజ్యాంగ వ్యవస్థల స్వరూప స్వభావాలకే ఎసరు పెట్టి, కుల, మత, వర్గ, వర్ణ సంఘర్షణలకు తావులేని సర్వమత సమభావన లక్ష్యానికి తూట్లు పొడుస్తూ వచ్చిన దాని ఫలితమే– కేవల 'హిందూ రిపబ్లిక్' రాజ్యాంగానికి ప్రాణ ప్రతిష్ట చేసే ప్రయత్నానికి పాలకులు ఉద్యుక్తులవుతున్నట్లు ఉంది. బహుశా అందుకనే క్రాంతదర్శి అయిన భారత సెక్యులర్ రాజ్యాంగ నిర్మాతలలో అగ్రేసరుడైన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 1946లోనే, దేశ పరిస్థితులపై అవగాహనతో, దూరాలోచనతో ఇలా ప్రకటించారు: 'హిందూరాజ్' పేరిట దేశాన్ని ప్రకటించడమంటే భారతదేశానికి అంతకన్నా పెద్ద విషాదకర సంఘటన మరొకటి ఉండదు. ఎట్టి పరిస్థితుల్లోనూ 'హిందూ రాజ్' నిర్ణయాన్ని, ప్రకటనను అడ్డుకుని తీరాల్సిందే. ('ఇండియా పార్టిషన్' గ్రంథం : పే. 354–5)

మోదీ నాయకత్వంలో ఆరెస్సెస్–బీజేపీ కాశ్మీరం నుంచి కన్యాకుమారి దాకా, అసోం, మణిపూర్ నుంచి ఉత్తర ప్రదేశ్, బీహార్, హరియాణా, పంజాబ్, త్రిపుర, కర్ణాటక, కేరళ, ఒరిస్సాల వరకు దళిత, మైనారిటీలు వందలాదిమందిపై జరిగిన అత్యాచారాలు, హత్యలూ, వేధింపులకూ లెక్కలేదు. ప్రజాసమస్యలను గొంతెత్తి చాటే సామాజిక కార్యకర్తలను ప్రజలపట్ల వకాల్తా వహించి ఉద్యమించిన పలువురు చరిత్రకారులను, పాత్రికేయులను, అధ్యాపకులను, ఆర్థిక వేత్తలను వేధించి, అరెస్టు చేయడమో, దొంగచాటుగా హతమార్చడమో, లేదా విచారణ తతంగం చాటున, హంతకులకు శిక్షలు లేకుండా కేసులు మూసివేయడమో జరుగుతూ ఉంది. ఈ రోజుకీ కల్బుర్గి, పన్సారీ, లంకేష్‌లను హత్య గావించిన హంతకుల ఆచూకీ (తెలిసికూడా) ప్రకటించి, శిక్షించడం జరగలేదు. గతంలో దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తులు, ప్రాణాలు, పుస్తెలు సహా త్యాగం చేసిన కోట్లాదిమంది స్త్రీ, పురుష యోధుల జ్ఞాపకాలు వెన్నంటుతుండగా, నేడు స్వతంత్ర భారతంలో గాడితప్పిన పాలనా వ్యవస్థలు ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపైన, పత్రికా ప్రసార మాధ్యమాలపైన ఉక్కుపాదం మోపి, కొన్ని సంస్థలను బెదిరించి తమకు అనుకూల బాకాలుగా మార్చుకున్న వైనం కాదనలేని ఒక నగ్న సత్యం. అందుకే దేశం రాజ్యాంగ వ్యవస్థల్ని మరింతగా ప్రజానుకూల వ్యవస్థలుగా తీర్చి దిద్దుకోవాల్సిన తరుణంలో రాజ్యాంగం హామీపడగా 'మేముగా రచించుకుని మాకు మేముగా అంకితం చేసుకుంటున్నామని' రాజ్యాంగంపరంగా ప్రజలు ప్రకటించుకున్న సంగతిని రాజకీయ నాయకులు మరచిపోయి ప్రవర్తిస్తున్నారు. దేశానికి, ప్రజలకూ అబద్ధాలు చెబుతున్నారు.

ప్రజలలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, హేతువాదాన్ని పెంచి, పోషించడాన్ని పౌర బాధ్యతల అధ్యాయంలో రాజ్యాంగం ఆదేశిస్తున్నా– దాన్ని తోసిరాజని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్థాయి నుంచి విశ్వ విద్యాలయ, కేంద్రీయ విద్యాలయాల స్థాయి వరకూ శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాస్త్రాలు, శాస్త్రవేత్తలు నిగ్గుతేల్చిన మానవ ప్రపంచ పరిణామ చరిత్రకు వక్రభాష్యాలు పాలకులు నూరి పోసేందుకు వెరవటం లేదు, వైదిక విజ్ఞానం మీద నమ్మకాలు, పూజలు పునస్కారాలమీద వ్యక్తిగత విశ్వాసాలు వేరు, విజ్ఞాన శాస్త్ర పరిశోధనల నిరూపణను కాదనడం అజ్ఞానం. డార్విన్ పరిణామవాదాన్ని నిరూపణలతో విశ్వసించిన ప్రపంచ వైజ్ఞానిక శాస్త్రాన్ని కాదని మొండి వాదనలతో మానవ పరిణామవాద నిరూపణలను కాలదన్నే వారిని అన్నీ 'కోతి చేష్టలే'నంటే బాధపడిపోయి, తాము మాత్రం డార్విన్ వానర సంతతికి వారసులం కాము, కేవలం రుషుల నుంచి జాలువారిన బిడ్డలమేనని, డార్విన్ సిద్ధాంతం అబద్ధమనీ బీజేపీ పార్లమెంట్ సభ్యుడు సత్యపాల్‌సింగ్ మానవ హక్కుల సవరణ బిల్లుపై చర్చ సందర్భంలో చెప్పారు. దానికి దీటైన సమాధానమిస్తూ డీఎంకే సభ్యురాలు కనిమొళి 'దురదృష్టవశాత్తు నా పూర్వీకులు ఋషులు కారు, కేవలం మానవమాత్రులు, విజ్ఞానశాస్త్ర నిరూపణ ప్రకారం నా తల్లిదండ్రులు శూద్రులు. వీరెవరూ దేవుడి బిడ్డలు కారు, దేవుడిలో ఏ భాగానికీ చెందిన వారు కారు. కానీ ఈరోజుకీ వీరందరూ మానవహక్కుల కోసమే పోరాడుతూ వచ్చారు, ఇంకా ఈ రోజుకీ పోరాడుతూనే ఉన్నారని' నషాళానికి అంటే జవాబిచ్చారు సింగ్‌కి. ఎందుకంటే, తమది 'సాంస్కృతిక జాతీయవాదం' అని ఆరెస్సెస్–బీజేపీ కలయిక నమ్మించజూస్తోంది. మరి ఆ జాతీయ స్రవంతిలోనే, ఆ సంస్కృతిలోనే అంతర్భాగంగా పెరుగుతూ వచ్చిన విభిన్న మతాలకు, కులాలకు, వృత్తులకు, వివిధ జాతులకు, విభిన్న భాషలకు చెందినవారు వెరసి 'ఉమ్మడి సంస్కృతిలో, జాతీయ వాదంలో భాగస్వాములు కారా? అందుకు ఆరెస్సెస్–బీజేపీయులు అవుననీ చెప్పరు, కాదనీ చెప్పరు. ముంగిగా మౌనం వహిస్తారు. ఆ మౌనమే 'హిందూ రిపబ్లిక్' ఆశయాన్ని వారు సాధించే క్రమంలో ముందుకు సాగడానికి ఆస్కారమవుతుంది.

### రెండో మాట



బహుశా బీజేపీ (ఆరెస్సెస్) ఎంపీ సాక్షీ మహరాజ్ 2019 ఎన్నికల తర్వాత ఇండియాలో ఇక ఎన్నికలుండవని ప్రకటించడానికి పార్టీ లోలోపల అంతర్మథనానికి పునాది అయి ఉండాలి. పార్టీ నాయక స్థానంలో ఉన్నవారిలో ప్రజాస్వామ్య వ్యతిరేక నిరంకుశ ధోరణుల ఫలితంగానే, రెండో అభిప్రాయాన్ని గౌరవించకపోతేమానె, కనీసం స్వీకరించగల ప్రజాస్వామిక నైజం కొరవడినందువల్లనే అర్ధంతరంగా, అనాలోచితంగా, నిరంకుశంగా మోదీ పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించి పేద, మధ్యతరగతి, చిన్న పారిశ్రామిక వర్గాలకు బ్యాంకులలో నగదు లావాదేవీలు జరుపుకొనకుండా నానా ఇబ్బందులకు గురిచేసినప్పుడు– ముందు రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ రాజన్, ఆ పిమ్మట వచ్చిన ఊర్జిత్ పటేల్, ఆ తర్వాత క్రమంగా మరి ఇద్దరు గవర్నర్లు పదవులకు రాజీనామాలిచ్చి మౌనంగా నిరసన తెలపాల్సి వచ్చింది, అలాగే బీజేపీ– ఆరెస్సెస్ సర్కార్ ప్రవేశపెట్టించిన విద్యా సంస్కరణలకు నిరసనగా కనీసం ఇరువురు ప్రముఖ విద్యావేత్తలు తమ వైస్ ఛాన్సలర్ పదవులను అర్ధంతరంగా విడిచిపెట్టి పోవలసివచ్చింది. ఇంతటి పరిణామాలు దేశ ప్రజలు అంతకుముందు అంత ఆకస్మిక నిర్ణయాలుగా ఎరుగరు. చివరికి ప్రపంచ ప్రసిద్ధ భారత ఆర్థికవేత్తలలో ఒకరు, నోబెల్ బహుమాన గ్రహీత, నలందా (బౌద్ధ) విశ్వవిద్యాలయాల వైస్–ఛాన్సలర్‌గా ఉంటున్న ప్రొఫెసర్ అమర్త్యసేన్, బీజేపీ పాలకుల ఒత్తిడి వల్లనే మోదీ తొలి పాలనలోనే వైదొలగవలసి వచ్చింది. పైగా– స్వామి వివేకానందను గౌరవిస్తున్నట్లు కనబడుతూనే ఆయన చికాగో (అమెరికా) ప్రపంచ సర్వమత సమ్మేళన సభలో చేసిన మహా నైతిక బోధను, దాని ప్రాశస్త్యాన్ని బీజేపీ–పరివార్ పాలకులు ఆచరణలో పాటించడం మానేశారు.

ఈ అన్ని పరిణామాల నేపథ్యంలో 'ఒక దేశం, ఒక ఎన్నిక, ఒకే నేత' అనే సరికొత్త పాలనా నినాదం లేదా విధానంవల్ల దేశంలో రెండో స్వాతంత్ర్య పోరాటం ద్వారానే బహుశా మోదీ ఆశిస్తున్న నిజమైన 'సురక్ష ఆధునిక సర్వజన దేశం' ఆవిర్భవిస్తుందేమో కళ్లు వత్తులు చేసుకుని చూద్దాం!

abkprasad2006@yahoo.co.in

### సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### జ్ఞానబోధ



"రోజూ ఉదయం పూజ చేస్తున్నప్పుడు తాను కలీమా కూడా చదువుతానని కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ ఒక సదస్సులో మాట్లాడుతూ వెల్లడించారు. కానీ అది 'జై శ్రీరాం' మాదిరిగా ఒక మతపరమైన నినాదం కాదని, ఇస్లాంకి పునాది వంటి మాట అని ఆయనకు ఎవరైనా చెబితే బాగుండేది. ఆ మతంలోకి మారేవారు మాత్రమే దాన్ని చెప్పవలసి ఉంటుందని కేంద్రమంత్రి గ్రహించాలి"

– తవ్లీన్ సింగ్, సీనియర్ జర్నలిస్టు

### అయితే...?



"అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పాక్ ప్రధాని ఇమ్రాన్‌ల మధ్య వ్యక్తిగతంగా మంచి సంబంధాలున్నాయని కొందరు చెబుతున్నారు. కానీ ఇలాంటివి పరస్పరం అనుమానాలతో పొద్దుపుచ్చుతున్న రెండు దేశాల మధ్య సాన్నిహిత్యాన్ని తీసుకురాలేవు"

– హుస్సేన్ హక్కానీ
అమెరికాలో పాక్ మాజీ రాయబారి

### స్థితప్రజ్ఞ



"తాను ఎంపీ అయింది టాయిలెట్లు పరిశుభ్రం చేయడానికి కాదని బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అనడాన్ని అందరూ తప్పుబడుతున్నారు. గాడ్సేను కీర్తించినందుకు ఆమెను ఎప్పటికీ క్షమించలేనని ప్రధాని ఆమధ్య అన్నారు. అయినా ఏమీ కాలేదు. ఇక ఆమె తాజా వ్యాఖ్యల గురించి పట్టింపు దేనికి?"

– అశోక్ స్వైన్, అధ్యాపకుడు

### మైగాడ్!



"ఇవాళ ఓ ఆస్పత్రికి వెళ్లినప్పుడు అక్కడి దృశ్యం నన్ను చాలా కలవరపెట్టింది. బిల్లింగ్ కౌంటర్ వద్ద ఒకామె తన భర్తతో 'నాకు కూడా ఏటీఎం కార్డు ఉంటే బాగుంటుంది కదా' అన్నప్పుడు ఆయన గారు అది కుదరదని చెప్పాడు. ఆయనేమో కదలలేని స్థితిలో వీల్ ఛైర్‌లో ఉన్నాడు. ఆమె సాయం తీసుకోవడం తప్పనిసరి. అయినా ఇలా తృణీకరించడం విస్తుగొలిపింది. ఇన్నేళ్ల స్వాతంత్ర్యం తరువాత దేశంలో సగటు మహిళ పరిస్థితి ఇంకా అధ్వానంగానే ఉంటోందని ఈ ఉదంతం తెలియజెబుతోంది"

– వసుధా వేణుగోపాల్
సీనియర్ జర్నలిస్టు

### అపురూపం



"చంద్రయాన్–2 ప్రయోగం ఇస్రో ఇంతవరకూ సాధించిన విజయాల్లోకెల్లా అద్భుతమైనది. అంతరిక్ష పరిశోధనల్లో మన దేశం మరింత ఉన్నత స్థాయికి చేరడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది"

– అర్జున్ ఘోష్, సామాజిక బోధకుడు

# మందులన్నింటా మాయాజాలమే.. వంచనే

అభిప్రాయం



డా॥ చెరుకు సుధాకర్

అర్ధ శతాబ్దంగా మందుల ధరలు, ప్రమాణాలు, క్లినికల్ ట్రయల్స్, విపరిణామాలపై దుమారం రేగుతూనే ఉంది. 30 ఏళ్లుగా భారతీయ ఫార్మా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతూనే ఉంది. అప్పట్లో ఇంకా జనరిక్ మందుల ప్రయోగం, వాడకం మొదలు కాలేదు. ఎన్ని అవకతవకలకు పాల్పడినా మన దేశీకంపెనీలు పోటీతత్వం ఇంకా పలు కారణాలచేత నాణ్యతను, పోటీ వెలను సాధించి ప్రజలకు చికిత్స నోచుకోవడానికి కొంత సానుకూల వాతావరణాన్ని తీసుకొచ్చింది వాస్తవం. అవి బాగా లాభాలు సంపాదించిందీ వాస్తవం. ఇక్కడ, విదేశాల్లో జనరిక్, బ్రాండెడ్ వ్యాపారం చేసే సంస్థలు రాజకీయ వ్యవస్థనే ప్రభావితం చేసి పార్లమెంట్‌ను, ఇండియన్ డ్రగ్ కంట్రోలర్ జనరల్‌ను మచ్చిక చేసుకొని, దారికి తెచ్చుకున్నదీ వాస్తవమే.

క్యాథరన్ ఇబాన్ రాసిన 'బాటిల్ ఆఫ్ లైస్ : రాన్‌బాక్సీ ఆండ్ ది డార్క్ సైడ్ ఆఫ్ ఇండియన్ ఫార్మా' అనే పుస్తకం ఆధారంగా సీనియర్ పాత్రికేయులు కరణ్ థాపర్ 'జనరిక్ మందులు పనిచేస్తున్నాయా?' పేరిట రాసిన సాక్షి ఎడిట్ పేజీ వ్యాసంలో అనేక ఆసక్తికర విషయాలు ఉన్నప్పటికీ, నాసిరకం, అంతులేని మోసపూరిత విధానాలు కేవలం జనరిక్ మందులకే కాదు దేశీ, విదేశీ బ్రాండెడ్ మందులకు కూడ అంతే వర్తిస్తాయి. మరి, అక్రమ లాభాలపై కొరడా ఝళిపించే 'చౌకీదారులు' ఏం చేస్తున్నట్లు? గత ఇరవై ఏళ్లలో దేశీ మార్కెట్ కంటే పేటెంట్ ముగిసిన మందులను మరో రసాయనిక క్రమంలో రూపొందించి విదేశీ జనరిక్ మార్కెట్లో అమ్మడం ద్వారా వేలవేల కోట్ల లాభాలను మన దేశీ కంపెనీలు ఆర్జించాయి. నిజమే రాన్‌బ్యాక్సీ, ఇతర కంపెనీలు ఇతర దేశాలకు ఉత్పత్తి చేసే జనరిక్ మందుల ప్రమాణాలను దేశీయ మార్కెట్‌లో పాటించకపోతే పాలకులది తప్పు కానీ జనరిక్ మందులది కాదు కదా!. ర్యాన్ బ్యాక్సీ మాజీ ఉద్యోగి దినేష్ టాకూర్ 2004లో చాలా విషయాలను, ఫార్మా కంపెనీల గోల్‌మాల్‌ను, ల్యాబరేటరీలు, వాటి నాణ్యతా పరీక్షల క్విడ్‌ప్రో గురించి చెప్పింది బ్రాండెడ్, జనరిక్ అన్ని మందుల గురించే.

కరణ్ థాపర్ కాథరిన్ ఇబాన్ పుస్తకాన్ని తిరగేసినప్పుడు కనపడిన చీకటి కోణం... జనరిక్ మందులను అనుమానించడంతో సమాప్తమయ్యేది కాదు. సగటు భారతీయుడు ఖర్చుపెడుతున్న సరాసరి ఖర్చుల్లో సింహ భాగం ఈ ఆకలిగొన్న ఫార్మా లాభాల సింహమే మింగేస్తున్నప్పుడు అడిగే పాలక, ప్రతిపక్ష సభ్యులేరి? సంఘాలేవీ? ఇప్పుడు దేశంలో కొత్త పదం వాడుకలో ఉంది. అవి బ్రాండెడ్ జనరిక్స్ మందులను ప్రజలు కూడా నమ్మకంతో పెద్ద కంపెనీ మందులు అని అనుకుంటారు. కానీ చాల బ్రాండెడ్, జనరిక్స్ రేటు వాటి అసలు బ్రాండెడ్ మందుల కంటే ఎక్కువ. అంత మాత్రానికి 'జనరిక్ వెర్షన్' ఎందుకు? జనరిక్‌లో నాసిరకం ఉంటే బ్రాండెడ్‌ను ఏరికోరి తప్పక కొనే కుట్ర కూడా ఉందేమో?

హార్వర్డ్ మెడికల్ స్కూల్ మెడిసిన్ హెడ్ ప్రొఫెసర్ నితీష్ చౌదరి జనరిక్ మందులు బ్రాండెడ్ మందులకంటే ఏ విధంగానూ తక్కువకాదని, చిన్న తేడాలు అంత ముఖ్యం కాదని, జనరిక్ మందులు చౌకగా అందుబాటులోకి వస్తే రోగి మందులు అర్థంతరంగా కొనలేక ఆపివేసే ప్రమాదం తక్కువని, ఆరోగ్య వ్యవస్థపై జనరిక్ మందులది సానుకూల అంశమే అని ప్రకటించారు. ప్రజానుకూల నాయకుల ఒత్తిడి ప్రతిఫలంగానే యూపీఏ ప్రభుత్వ సమయంలో జన ఔషధీ కేంద్రాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో తెరచి, జనరిక్స్‌ను ప్రోత్సహించారు. కానీ వీటిని దేశి మార్కెట్‌లో బ్రాండెడ్ ధరలతో సమానంగా అమ్మడం, జనరిక్ మందుల నాణ్యతాప్రమాణాల మీద ప్రత్యేకంగా నిఘా పెట్టకపోవడంతో అతి పెద్ద తప్పుడు ఆచరణ కొనసాగింది. జనరిక్ మందులపై కొత్త భయాలను బ్రాండెడ్ మందుల మీద కొత్త భ్రమలను పెంచుకోవద్దని అంతా దొందూ... దొందే దోరణి కొనసాగుతుందని పై విషయాలు తెలియజేస్తాయి. ప్రజాస్వామ్యాన్ని, హక్కుల్ని కూడా మార్కెటింగ్ చేసుకునే దయనీయ స్థితిలో ఉన్న మన దేశంలో జనరిక్ మీద దాడి కంటే ఎట్లా గాడిలో పెట్టాలో కరణ్ థాపర్ సూచిస్తే బాగుండేది.

ఆరోగ్యవ్యవస్థలో అత్యంత సున్నితమైన అనేక అంశాల మీద తీవ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. జనరిక్ మందుల నాణ్యత మీద, నిఘా, ధరల విషయంలో నిర్దాక్షిణ్యంగా తగ్గించడం చేస్తే గాని ఈ దేశంలో, ఈ దశాబ్దంలో ఎన్నో ట్రిలియన్ డాలర్లు దేశ ప్రజలకు అమెరికాలోవలె పొదుపు కావు కదా! దయగల ప్రభువులు ప్రజల ఎడల ప్రేమ ఉన్న సంఘాలను, నిపుణులను పిలిచే 'అచ్చేదిన్' ఎప్పుడొస్తుందో అని ఎదురు చూడాల్సిందే. అప్పటిదాక జరిగే దందాలో మందుల కంపెనీలు, పాలకులు, దళారులు, క్లినికల్ ట్రయల్ ల్యాబ్‌లు, డాక్టర్లు, హాస్పిటల్స్, మందుల షాపులు అనివార్యంగా భాగస్వాములే.

వ్యాసకర్త రాజకీయ కార్యకర్త, వైద్యులు
మొబైల్: 98484 72329

# క్విట్ ఇండియాకు ఊపిరులూదిన రేడియో

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

బ్రిటిష్ వారితో గానీ, వారి ప్రభుత్వంతో గానీ ఎటువంటి వ్యవహారం పెట్టుకోవద్దు. వారికి మీరిచ్చే ధనం గానీ, లేదా మీకు వారిచ్చే ధనంగానీ మన సోదర భారతీయుల రక్తంతో తడిసింది. ప్రతి ఇంటి మీదా, కిటికీ మీద మువ్వన్నెల జెండా ఎగురవేయండి. కోర్టులకెళ్ళడం పాపంగా పరిగణించాలి. విదేశీ వస్తువులు కొనవద్దు. ప్రభుత్వ బ్యాంకుల నుండి మీ ధనం తీసేయండి. న్యాయం లేని ప్రభుత్వానికి సేవలందించే అధికారులను బాయ్‌కాట్ చెయ్యండి. రైతు పండించే ధాన్యం మొదలైనవి అతని దగ్గరే ఉండనివ్వండి.

ఇలాంటి పది విధులను ప్రతి భారతీయుడు తప్పకుండా నిర్వహించాలని 1942 అక్టోబరు 29వ తేదీన రహస్య ఆకాశవాణి కాంగ్రెస్ రేడియో హిందూస్తానీలో ఉద్బోధించింది. అవి క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులు. అంతేకాదు, అవి రెండో ప్రపంచ యుద్ధం రోజులు కూడా. బ్రిటిష్ ప్రభుత్వం నడిపే ఆల్ ఇండియా రేడియో స్టేషన్లు ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, లక్నో, మద్రాసు, తిరుచ్చురాపల్లిలు మాత్రమే ఉన్నాయి. ఇవేకాక తిరువాంకూరు, మైసూరు, హైదరాబాదు, ఔరంగాబాదు సంస్థానాలు నడిపే రేడియో కేంద్రాలున్నాయి. అయితే ఇవేవీ ప్రజల స్పందననుగానీ, స్వాతంత్ర్య ఉద్యమం వార్తలు కానీ ఇవ్వడం లేదు. వార్తాపత్రికలు సెన్సార్ కాకుండా అచ్చు కావడంలేదు. దాంతో భాగ్యనగర్ రేడియో వంటి రహస్య రేడియో కేంద్రాలు కీలకపాత్ర పోషించాయి.

1942 ఆగస్టు 27 నుంచి నవంబరు 12 వరకు 78 రోజులపాటు రామమనోహర్ లోహియా పర్యవేక్షణలో కాంగ్రెస్ రేడియో గొప్పగా సాగింది. మనదేశంలో 1927 జూలై 23న వ్యవస్థీకృతమైన రేడియో ప్రసారాలు మొదలయ్యాయనే కారణంతో ఆరోజును భారత ప్రసార దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా విలువైన ప్రసారాలు చేసి గొప్ప చరిత్ర సృష్టించిన ఈ ఆజాద్ రేడియో గురించి తెలుసుకోవాలి. ప్రభుత్వం కన్నుగప్పడానికి కొన్నిరోజులకొకసారి ప్రసార ఫ్రీక్వెన్సీతోపాటు ట్రాన్స్‌మీటర్ స్థానం ఆరేడుచోట్లకు మార్చారు. విఠల్‌దాస్ కాకర్, ఉషా మెహతా, విఠల్‌దాస్ జవేరి, నానక్ మెత్వానివంటి మెరికల్లాంటి నలుగురు యువతీయువకులతో ఈ ప్రసారాలలో తోడ్పడ్డారు.

### నేడు భారతీయ ప్రసార దినోత్సవం

ఇంటెలిజెన్స్ సీక్రెట్ ఫైల్స్ ఆధారంగా ఈ కాంగ్రెస్ రేడియో లేదా ఆజాద్ రేడియో గురించి మరిన్ని విషయాలు ఇటీవలే బయల్పడ్డాయి. రోజుకు ఒకసారి ఇంగ్లిష్‌లో, మరోసారి హిందూస్తానీలో అంటే రెండుసార్లు, ప్రతిసారి సుమారు అరగంటపాటు ప్రసారాలు చేసిన ఈ రేడియో ఎటువంటి విషయాలు ఇచ్చిందనే అంశంపై అధ్యయనం ప్రారంభించినపుడు ఈ వ్యాసం మొదట్లో పేర్కొన్న విషయాలు తారసపడ్డాయి. ఈ సమాచారంతో 2018లో 'అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బ్రాడ్‌కాస్ట్ డూరింగ్ క్విట్‌ఇండియా మూమెంట్' అనే పుస్తకం వెలువడింది. ఈ 78 రోజుల ప్రసారాలు హిందూస్తాన్ హమారా అనే పాటతో మొదలై వందేమాతరం పాటతో ముగిసేవి. వార్తలు, వార్తా సమీక్షలు, గాంధీ, వల్లభ్‌భాయ్ పటేల్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి నాయకుల ప్రసంగాలు, భారతీయ స్వాతంత్ర్య ఉద్యమం ప్రత్యేకత, డూ అండ్ డై కార్యాచరణ వెనుక ఉండే తాత్విక నేపథ్యం, వర్తమాన విషయాలపై ప్రశ్నోత్తరాలు– ఇలా చాలా ప్రయోజనకరంగా ఆ రేడియో కార్యక్రమాలు ఉండేవి.

భారతీయ స్వాతంత్ర్య ఉద్యమం చాలా ప్రత్యేకమైందని 1942 అక్టోబరు 21న చేసిన ప్రసారంలో కనబడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా గత 200 ఏళ్లలో జరిగిన విప్లవాలలో పోల్చి ఒక భారత్‌లోనే పేదలు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నట్లు విశదం చేశారు. రష్యన్ విప్లవంలో కేవలం ఒక శాతం జనాభా పాల్గొనగా, ఫ్రెంచి విప్లవంలో సైతం కొందరే పాలుపంచుకున్నారు. వీరందరూ ధనికులే కానీ పేదలు కాదు. సాంప్రదాయకంగా విప్లవాల పంథాలో పోకుండా, ఆయుధాలు లేని పేదవారు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఒక ప్రత్యేకత. భారత్‌లో అనాదిగా ఉండే శాంతి భావన, నిరాయుధీకరణ, గాంధీ అహింసా ప్రబోధం కలగలిసి భారత స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రపంచంలోనే సరికొత్తగా రూపొందించాయి. ఇటువంటి కారణాలతో భారత స్వాతంత్ర్యోద్యమం విశేషమైంది, విలక్షణమైంది.

జాతికవసరమైన ఎన్నో ప్రబోధాలు రామ్‌మనోహర్ లోహియా సారథ్యంలో ఆనాటి ఆజాద్ రేడియో దేశానికందించింది. ఈ రేడియో సాగింది 78 రోజులైనా ప్రసారం చేసిన సమాచారం, మార్గదర్శకత్వం మాత్రం విలువైనవి.

వ్యాసకర్త వర్తమానాంశాల పరిశోధకులు, పత్రికా రచయిత, మొబైల్ : 94407 32392

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ మంగళవారం
23-7-2019




ముద్దులు పెడితే సినిమాలు నడుస్తాయా?
సినిమా పేజీలో...

వెబ్ ఎంట్రీ

ఒక తాడు, గుడ్డ పీలిక ఉంటే చాలు
తీసే సినిమాలు కొన్ని ఉంటాయి.
తాడు చేతులు కట్టేయడానికి.
గుడ్డ పీలిక అరవకుండా నోటిలో కుక్కడానికి.
కిడ్నాప్ డ్రామా అంటే ఎవరికైనా ఆసక్తే.
కిడ్నాప్ చేశాక
'హలో... రేపు సాయంత్రంలోగా డబ్బు అందలేదో'
అనే బెదిరింపులకు టెన్షన్ వస్తుంది.
నేరం ప్రమాదం. శిక్షార్హం.
ఆ నేరానికి పాల్పడేవాళ్ల తిప్పలే హిట్ సినిమాలు.




# హలో... మీ అమ్మాయి నా దగ్గరుంది

**భా**రతీయ ఇతిహాసంలో నమోదైన తొలి కిడ్నాప్‌ను రావణాసురుడు చేశాడు. సీతను చెరబట్టి అతడు లంకా వినాశనానికి కారణమయ్యాడు. అయినవారు చనిపోతే ఆ దుఃఖం వేరు. యదార్థాన్ని స్వీకరించే కొద్దీ వేదన తగ్గుతుంది. కాని కిడ్నాప్ సంగతి అలా కాదు. మనం ప్రాణంగా ప్రేమించినవారు ఎక్కడో ఉంటారు. ఎవరి చేతుల్లోనో బందీగా ఉంటారు. ఎప్పుడు విడుదల అవుతారో తెలియని అవస్థలో ఉంటారు. అసలు ప్రాణాలతో ఉన్నారో లేరో అనే ఆందోళన కలిగిస్తూ ఉంటారు. వారి కోసం మనం ఏదో ప్రయత్నం చేస్తే తప్ప, వారి బదులుగా ఏదో చెల్లిస్తే తప్ప బయటపడని దురవస్థలో ఉంటారు. మరణం కంటే భయంకరమైనది కిడ్నాప్. అందుకే నేరగాళ్లు కిడ్నాప్‌ను ఒక ఆయుధంగా వాడి పబ్బం గడుపుకోవాలని చూస్తారు. ఏ నేరమైనా చివరకు శిక్షతోనే ముగుస్తుంది. కిడ్నాప్ చేసినవారు కూడా అంతిమంగా కటకటాల వెనక్కు వెళతారు. కాని ఈలోపు జరిగే డ్రామాలో మాత్రం కుటుంబసభ్యులు, పోలీసులు పాత్రధారులు అవుతారు. ఆ కథ సినిమాలోది అయితే ప్రేక్షకులు కూడా భాగస్తులు అవుతారు. ఇటీవల 'బ్రోచేవారెవరురా' సినిమా కిడ్నాప్ డ్రామాతో విడుదలైంది. మరి గతంలో సినిమాల్లో ఈ ఆటను ఆడింది ఎవరు?

## విక్రమ్ (1986)




అంతవరకూ అక్కినేని కుమారుడుగా మాత్రమే ఉన్న నాగార్జున 'విక్రమ్' సినిమాతో సినిమా హీరో నాగార్జున అయ్యాడు. ఇది కిడ్నాప్‌డ్రామా. హిందీలో దర్శకుడు సుభాష్ ఘాయ్ దీనిని రచించాడు. అరెస్టయ్యి ఉరి శిక్షకు దగ్గరగా ఉన్న తన గాడ్‌ఫాదర్‌ను రక్షించుకోవడానికి పోలీస్ అధికారి కుమార్తెను హీరో కిడ్నాప్ చేయడం కథ. జాకీ ష్రాఫ్, మీనాక్షి శేషాద్రి నటించిన ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అయ్యింది. తెలుగు రీమేక్‌లో కూడా నాగార్జునను నిలబెట్టింది. కిడ్నాప్ అయిన అమ్మాయి కిడ్నాప్ చేసినవాడితోనే ప్రేమలో పడుతుంది. హీరో కూడా ఆమెను ఏ పాడుబడ్డ మహల్లోనో ఉంచకుండా చక్కగా ప్రకృతి మధ్యలో, అందమైన పర్ణశాలలో ఉంచుతాడు. పైగా ఫ్లూట్ ఊదుతూ తనలోని భావుకత్వం ప్రదర్శిస్తుంటాడు. ఫ్లూట్ ఊదే కుర్రాడితో ప్రేమలో పడటం ఆ రోజుల్లో ఫ్యాషన్ కనుక శోభన నాగార్జునతో ప్రేమలో పడుతుంది. అయితే చాలా పరీక్షలకు నిలబడి ఈ ప్రేమ గెలుస్తుంది. నాగార్జునకు హిట్ ఇచ్చిన ఈ కిడ్నాప్ డ్రామా చాలా రోజుల తర్వాత ఆయనే మళ్లీ నటించిన 'గగనం'లో నిరాశపరిచింది. విమానంలో బందీ అయిన ప్రయాణికులను గగనంలో విడుదల చేయించే అధికారిగా నాగార్జున నటించారు.

## వింత దొంగలు (1989)




రాజమండ్రి రేవులో లాంచీ మీద గైడ్‌గా పని చేసే గుమాస్తా రావు గోపాలరావు, అదే ఊళ్లో హోటల్ సర్వర్‌గా పని చేసే రాజశేఖర్ మధ్యతరగతి డబ్బు కటకటలు తట్టుకోలేక ఒక డబ్బున్న అమ్మాయి నదియాను కిడ్నాప్ చేస్తారు. సాధారణంగా కిడ్నాప్ అయిన అమ్మాయి కిడ్నాప్ చేసిన వారిని చూసి భయపడాలి. కాని ఈ సినిమాలో కిడ్నాప్ అయిన అమ్మాయి కిడ్నాప్ చేసిన వారిన భయపెడుతుంటుంది. చిన్నప్పటి నుంచి గారాబం చేసి చెడకొట్టానన్న కోపంతో అమ్మాయి విడుదల కోసం డబ్బు ఇవ్వనంటాడు తండ్రి. ఏం చేయాలో తెలియక తల పట్టుకుంటారు కిడ్నాపర్లు. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా మంచి కాలక్షేపం సినిమాగా నిలిచింది. 'ఏంటి మేటరు' అనేది ఈ సినిమాలో రావుగోపాలరావు ఊతపదం. ఆ తర్వాత అది పాపులర్ అయ్యింది. ఇప్పటికీ జనం ఏంటి మేటరు అంటుంటారు. ఒకే సంవత్సరం 'అంకుశం'లో నవ్వే తెలియని పోలీసాఫీసర్‌గా రాజశేఖర్‌ను నటింపచేసిన కోడి రామకృష్ణ ఆ వెంటనే ఈ సినిమాలో నవ్వులు పూయించే కామెడీ హీరోగా చేయించడం గమనించాలి. రాజశేఖర్ రెంటిలోనూ రాణించారు.

## మగాడు (1990)



ఈ సినిమా హీరో రాజశేఖర్ కాలు విరిగేలా చేసింది. కాని దాని వల్ల తర్వాతి కాలంలో జీవిత భాగస్వామి అయిన జీవితను దగ్గర చేసింది. 'మగాడు' రాజశేఖర్ కెరీర్‌లో పెద్ద హిట్. అందులో కూడా నేరస్తుడైన తన అన్నను కాపాడుకోవడానికి తమ్ముడు ఏకంగా కేంద్ర మంత్రినే కిడ్నాప్ చేస్తాడు. విడుదలకు 100 కోట్లు అడుగుతాడు. ఈ గొంతెమ్మ కోరిక తీర్చడం కంటే చావో రేవో తేల్చుకునే అధికారిని పంపడమే మేలని ప్రభుత్వం అనుకుంటుంది. ఆ అధికారే హీరో రాజశేఖర్. ఒన్ మేన్ కమెండోగా రాజశేఖర్ అడవుల్లో ప్రయాణించి కిడ్నాప్ డెన్‌కు చేరుకుని సాహసంగా బందీలను విడిపిస్తాడు. మలయాళంలో పెద్ద హిట్ అయిన మోహన్‌లాల్ సినిమాను అదే దర్శకుడి దర్శకత్వంలో జీవిత నిర్మించగా పెద్ద హిట్ అయ్యింది. లిజిని ఆ సినిమాలోనే తెలుగు ప్రేక్షకులు చూశారు. తమిళ హీరో త్యాగరాజన్ ఈ సినిమాలో విలన్‌గా నటించాడు.

## రోజా (1992)



కమలహాసన్ నటించిన 'గుణ' 1991లో వచ్చింది. తల్లిదండ్రుల పెంపకం సరిగా లేని కమలహాసన్ స్త్రీలోని అమ్మను బంధించడానికి ఒక ప్రియురాలిని ఊహించుకుంటూ ఆ ఊహ నిజమనే భ్రాంతి చెంది ఏకంగా ఒక అమ్మాయినే కిడ్నాప్ చేస్తాడు. సినిమాలో ఉమా దేవి అనే పాత్ర ముందు అతణ్ణి అసహ్యించుకున్నా చివరకు ప్రేమిస్తుంది. 'ప్రియతమా నీవచట కుశలమా నేనిచట కుశలమే' పాట తెలుగులో ఇప్పటికీ నిలిచిన పాట. ఆ వెంటనే మణిరత్నం 'రోజా' వచ్చింది. సత్యవంతుడి ప్రాణాల్ని యముడి నోటి నుంచి తన్నుకొని తిరిగి తెచ్చుకున్న సావిత్రిలా ఈ సినిమాలో మధుబాల టెర్రరిస్టుల వల్ల కిడ్నాపైన అరవింద్ స్వామి ప్రాణాలను తిరిగి తెచ్చుకుంటుంది. కిడ్నాపైన వారి కోసం పోలీసులు పోరాడాలి. భార్య పోరాడటం వల్ల సెంటిమెంటు పండి బాక్సాఫీసు పసుపుకుంకుమలతో కళకళలాడింది.

## మనీ (1993)




చాలా మంది కెరీర్‌కు బూస్ట్ ఇచ్చిన ఈ సినిమా దర్శకుడు శివనాగేశ్వరరావుకు ఎప్పటికీ చెప్పుకునే సినిమా అయ్యింది. అప్పులపాలయిన భర్త పరేశ్ రావెల్ చెక్‌బుక్‌ను కంట్రోల్ చేసే భార్య జయసుధను కిడ్నాప్ చేయాలనుకుంటాడు. కాని పూటకు ఠికానా లేని ఇద్దరు బేచిలర్ కుర్రాళ్లు జె.డి చక్రవర్తి, చిన్నా ఒక్క కిడ్నాప్‌లో లైఫ్‌లో సెటిల్ పోవాలని పరేశ్ రావెల్ కంటే తామే ముందు జయసుధను కిడ్నాప్ చేస్తారు. ఇందులోకి ఖాన్ దాదా అయిన బ్రహ్మానందం దూరడం విశేషం. మనీ బాక్సాఫీస్ దగ్గర హిట్ అయ్యింది. రేణుకా సహానీ, పరేశ్‌రావెల్ వంటి ఫ్రెష్ ముఖాలు కనిపించాయి. అల్లరి వేషాలు వేసే బ్రహ్మానందం సీరియస్ కామెడీ చేయడం ఈ సినిమాతో మొదలెట్టాడు. ఒరు విరల్ కృష్ణారావు చిన్న పాత్ర అయినా మెరుస్తాడు. పరేశ్ రావెల్‌కు సంగీత దర్శకుడు చక్రవర్తి డబ్బింగ్ చెప్పారు. 'వారేవా ఏమి ఫేసు అచ్చు హీరోలా ఉంది బాసూ' పాట, 'ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు' డైలాగు హిట్. పనికిమాలిన ప్రొడక్షన్ మేనేజర్‌గా తనికెళ్ల భరణి నటన కూడా నవ్వులే.

## సిసింద్రీ (1995)




చిన్నపిల్లలను కిడ్నాప్ చేయకుండా కిడ్నాప్ సినిమాలు ఉండవు. తెలుగు సినిమాలలో ఈ అంశాన్ని కృష్ణ నటించిన 'దొంగల వేట'లో మొదట చూపించారు. ఆ తర్వాత బేబి షాలినితో ఉషాకిరణ్ మూవీస్ తీసిన 'చందమామ రావే' కూడా కిడ్నాప్ డ్రామాయే. అందులో బేబీ షాలినిని కిడ్నాప్ చేసినవారు చివరకు ఆ చిన్నారి వల్లే పూర్తిగా మారిపోతారు. అయితే హాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'బేబీస్ డే అవుట్' ఆధారంగా తెలుగులో తీసిన 'సిసింద్రీ' మంచి హిట్‌గా నిలిచిందని చెప్పాలి. దీనికి కూడా దర్శకుడు శివ నాగేశ్వరరావే. సినిమాలో బుజ్జి పిల్లాడిగా అఖిల్ అక్కినేని నటించడం అప్పట్లో వార్త అయ్యింది. కిడ్నాపర్లుగా గిరిబాబు, సుధాకర్, తనికెళ్ల భరణి నటించారు. ఆమని మీద తీసిన 'చిన్న తండ్రీ నిను చూడగా' పాట పెద్ద హిట్. నాగార్జున, టబూ కలిసి ఒక పాటలో చిందులు తొక్కారు. చిన్న పిల్లల కిడ్నాప్ అంశంగా కమలహాసన్ తీసిన 'ముంబై ఎక్స్‌ప్రెస్' క్లాసిక్ కామెడీ అయినా ప్రేక్షకులు అందుకోలేదని చెప్పాలి.

## ఐతే (2003)




మాఫియా డాన్ పవన్ మల్హోత్రా దేశం వదిలి పారిపోవాలనుకుంటాడు. కాని అతని మీద నిఘా ఉంటుంది. అందుకని హైదరాబాద్ నుంచి బొంబాయి వెళ్లే ఫ్లయిట్‌ని కిడ్నాప్ చేసి ఖాట్మండు తీసుకెళ్లి అక్కడి నుంచి దుబాయ్‌కి పారిపోవాలని ప్లాన్. తాను మాత్రం ప్రయాణికుల్లో ఒకడిగా ఉంటాడు. కిడ్నాప్ చేయడానికి నలుగురు కుర్రాళ్లని సెట్ చేస్తాడు. ఫ్లయిట్‌లో కేంద్ర మంత్రి ఉంటాడు కనుక అతణ్ణి ఫ్లయిట్‌లోనే ఉంచి ఖాట్మాండులో ప్రయాణికులను వదిలిపెడితే ఆ గందరగోళంలో తాను తప్పించుకోవాలని అనుకుంటాడు. కాని డామిట్ అనకుండానే కథ అడ్డం తిరుగుతుంది. మరో నలుగురు కుర్రాళ్లు ఏకంగా పవన మల్హోత్రానే కిడ్నాప్ చేస్తారు. చట్టానికి సహకరించే ఉద్దేశ్యంతోనే ఆ పని చేస్తారు. చివరకు ప్రైజ్ మనీ దక్కించుకుంటారు. 'ఐతే' దర్శకుడు ఏలేటి చంద్రశేఖర్‌ను మంచి దర్శకుడిగా నిలబెట్టింది. ఇందులో నటించిన శశాంక్ హీరోగా కొన్ని సినిమాలు చేశాడు. సింధు తులానీ హీరోయిన్ అయ్యింది. కల్యాణి మాలిక్ సంగీతంలో కీరవాణి పాడిన 'చిటపట చినుకులు అరచేతులలో ముత్యాలైతే ఐతే' పాట హిట్. కిడ్నాప్ డ్రామాకు బిగువైన స్క్రిప్ట్ అవసరమని నిరూపించిన సినిమా ఇది.

## బ్రోచేవారెవరురా (2019)

ఈ నేపథ్యంలో మొన్నటి వెంకటేష్ 'ఘర్షణ', ఇటీవలి 'స్వామి రారా' వంటి సినిమాలు కూడా కిడ్నాప్ డ్రామాతో నడిచాయి. తాజాగా 'బ్రోచేవారెవరురా' సినిమా ప్రేక్షకులకు నచ్చింది. ఇందులో హీరోయిన్ నివేదితా థామస్‌ను ఆమె కోరిక మీదే కిడ్నాప్ చేసిన ఆమె ఫ్రెండ్స్ శ్రీవిష్ణు, ప్రియదర్శి తదితరులు ఎంతటి ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్లి బయటపడతారో వినోదభరితంగా చూపించారు. మంచి స్క్రీన్ ప్లే, ట్విస్ట్‌లు ఉండటం వల్ల కలెక్షన్లు విపరీతంగా వచ్చాయి.

మనిషి అవసరానికి మించిన భూమిని బంధిస్తాడు. అవసరానికి మించిన నీళ్లను బంధిస్తాడు. అవసరానికి పశువులను, పక్షులను బంధిస్తాడు. కాని తనని ఎవరైనా బంధిస్తే మాత్రం గగ్గోలు పెడతాడు. ఈ గగ్గోలు ఉన్నంత కాలం కిడ్నాప్ సినిమాలు వస్తూనే ఉంటాయి.

**- కె.**

---

స్త్రీ శక్తి

# రియల్ లైఫ్ లేడీ సింగం

**మాఫియా డాన్‌లను పట్టుకోవడానికి పోలీసు అధికారి నరసింహం విదేశాలకు వెళ్లడం చూశాం. నేరం చేసిన వాడు ఎవడైతే ఏంటి, ఎక్కడ తలదాచుకుంటే ఏమిటి.. చిత్తశుద్ధి ఉంటే వాడి తాట తీయొచ్చని అని నరసింహం నిరూపించాడు. అయితే అదంతా సింగం సిరీస్‌లో హీరో సూర్య రీల్ లైఫ్ పెర్ఫామెన్స్. కానీ రియల్ లైఫ్‌లో కూడా అలాంటి ఓ మహిళా ఆఫీసర్ ఉన్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడి సౌదీకి పారిపోయిన ఓ వ్యక్తిని పట్టుకునేందుకు ఆమె తన టీమ్‌తో కలిసి ఎడారి దేశానికి బయల్దేరారు. ఇంటర్‌పోల్ సహాయంతో అతడిని అరెస్టు చేసి భారత్‌కు తీసుకువచ్చారు. ఆ లేడీ సింగం పేరు మెరిన్ జోసెఫ్. కేరళలోని కొల్లాం పోలీసు కమిషనర్ ఆమె. అకృత్యానికి బలై ఆత్మహత్యకు పాల్పడ్డ బాధితురాలికి న్యాయం చేకూర్చేందుకు ఆమె చేసిన, చేస్తున్న కృషి నిజంగా స్ఫూర్తిదాయకం.**



● మెరిన్ జోసెఫ్,
పోలిస్ కమిషనర్ (ఫైల్ ఫొటో)

### కేసు నేపథ్యం

కేరళలోని కొల్లాంకు చెందిన సునీల్ కుమార్ బంద్రాన్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో టైల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో 2017లో సెలవుల నిమిత్తం స్వదేశానికి వచ్చినపుడు స్నేహితుడి మేనకోడలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. 13 ఏళ్ల బాలిక అనే కనికరం లేకుండా మూడు నెలల పాటు ఆమెకు ప్రత్యక్ష నరకం చూపించాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆ చిన్నారి మిన్నకుండి పోయింది. అయితే ఆ కామాంధుడు సౌదీ వెళ్లిపోయాక జరిగిన దారుణం గురించి కుటుంబ సభ్యులకు చెప్పింది. ఆ పీడకలను మర్చిపోలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తర్వాత బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అంతర్జాతీయ చట్టాల ప్రకారం అతడిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ కేసులో ఎటువంటి పురోగతి లేదు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన కొల్లాం పోలీస్ చీఫ్ మెరిన్ ఇటీవలే రియాద్‌కు వెళ్లారు. స్థానిక పోలీసుల అదుపులో ఉన్న సునీల్ కుమార్‌ను అరెస్టు చేసి కేరళకు తీసుకువచ్చారు. పోక్సో చట్టం కింద అతడిపై ఉన్న కేసు దర్యాప్తు వేగవంతం చేశారు.

### ఎక్కడా దాక్కున్నా

ఈ కేసు గురించి జోసెఫ్ మెరిన్ మాట్లాడుతూ..''ఇది అత్యంత హేయమైన నేరం. సునీల్ దుశ్చర్య కారణంగా ఓ బాలిక ప్రాణాలు కోల్పోయింది. మహిళలు, చిన్నారుల పట్ల ఇటువంటి అకృత్యాలు జరిగినపుడు మనసు కకావికలం అవుతుంది. ఇలాంటి ఘటనల్లో బాధితులు ఎంతటి మానసిక క్షోభను అనుభవిస్తారో నాకు తెలుసు. సమాజం కూడా వారిని చూసే తీరు వేరుగా ఉంటుంది. అటువంటి వారికి న్యాయం చేయడం నా కర్తవ్యం. అందుకే నిందితుడిని పట్టుకుని బాధితురాలికి న్యాయం చేయాలని నిర్ణయించుకున్నాను'' అని తెలిపారు.

''ఈ కేసులో నిందితుడు సౌదీకి పారిపోయాడు. అతడు ఒక్కడే కాదు గల్ఫ్‌దేశాల్లో నివసిస్తున్న చాలా మంది కేరళ కార్మికులు.. ఇక్కడ నేరాలకు పాల్పడి పారిపోతున్నారు. ఇటువంటి కేసులు ఎంత క్లిష్టతరమైనవో నాకు తెలుసు. అయినప్పటికీ వెనకడుగు వేయలేదు. మా బాస్ ప్రోద్బలంతో కేసులో పురోగతి సాధించాను. రియాద్‌కు వెళ్లి సునీల్ కుమార్‌ను అరెస్టుచేసి కేరళకు తీసుకువచ్చాను. ఇక అతడికి శిక్ష వేయించడమే నా ముందున్న లక్ష్యం'' అని అన్నారు.

### సవాళ్లను స్వీకరించాలి

''సమాజంలో ఆడపిల్లల పట్ల లింగ వివక్ష వేళ్లూనుకుపోయింది. అయితే ఒక మహిళగా నేనెప్పుడూ రాయితీలు కోరుకోలేదు. ఎవరెంతగా నిరుత్సాహ పరిచినా నిరాశ చెందక సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగాను. ఐపీఎస్ కావాలన్న నా కలను నెరవేర్చుకున్నాను. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నాను. నిజానికి మహిళా అధికారుల పట్ల కూడా ఒక రకమైన చిన్నచూపు ఉంటుంది. ఒత్తిళ్లను ఎదుర్కొని పని చేయలేరన్న కారణంగా ఫీల్డ్ పోస్టింగులు తక్కువగా ఇస్తుంటారు. అది వాస్తవం కాదు. మహిళలకు పని పట్ల శ్రద్ధ, అంకిత భావం ఎక్కువగా ఉంటాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అన్ని రంగాల్లో వారు ముందుకు సాగుతున్న తీరును గమనించాలి. పోలీసు శాఖలో మహిళా అధికారుల సంఖ్య మరింతగా పెరగాల్సిన ఆవశ్యకత ఉంది'' అంటూ కేరళలోనే అత్యంత పిన్నవయస్కురాలైన పోలీసు కమిషనర్‌గా గుర్తింపు పొందిన మెరిన్(29) అమ్మాయిల్లో స్ఫూర్తి నింపారు.

**– యాళ్ల సుష్మారెడ్డి,** సాక్షి వెబ్‌డెస్క్

---

చెట్టు నీడ

# ఇలా తెండి, నేను పంచుతాను



**అ**మృతం కోసం దేవదానవుల పెనుగులాట ముమ్మరంగా సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో, ముజ్జగాలను సమ్మోహపరిచే జగన్మోహిని అక్కడకు వచ్చింది. ఆమెను చూసి రాక్షసులు పరవశించిపోయారు. మోహిని రాక్షసులతో, ''అమృతాన్ని ఇలా తెండి, నేను పంచుతాను!'' అంది. జగన్మోహిని తమతో మాట్లాడినందుకే రాక్షసులు ఉప్పొంగి పోయారు. అమృత కలశాన్ని ఆమెకు అందించారు. రాక్షసులు ఒక వరసన, దేవతలొక వరసన కూర్చున్నారు.

ఉభయశ్రేణుల నడుమ జగన్మోహిని నృత్యం చేస్తున్నట్లు వయ్యారంగా అడుగులు వేస్తూ, అమృత కలశాన్ని నడుమున ఆనించి పంచడానికి తయారైంది. ఏమి జరుగుతుందో అని దేవతలు చూస్తున్నారు. ఉన్మత్తులై రాక్షసులు మోహిని సౌందర్య విలాసాలను చూస్తూ తన్మయులౌతున్నారు. దేవతలు కూడా జగన్మోహిని ఎవరో మొదట తెలుసుకోలేక పోయినా, రాక్షసులను మభ్యపెట్టి అమృతాన్ని తమకు మాత్రమే పోస్తున్నప్పుడు, ఆ విశ్వమోహిని విష్ణువే అని గ్రహించి, గుట్టుచప్పుడు కాకుండా అమృతాన్ని తాగుతున్నారు.

జగన్మోహినీ విలాసమంతా విష్ణువు చిద్విలాసమే అని తెలిసిన దేవతలు ఆనందంగా అమరత్వం పొందుతూంటే, దైత్యులు మాయలో పడి అమృతాన్ని కోల్పోయారు. జగన్మోహిని వంచన చేస్తున్నదని రాహువు అనే ఒక తెలివైన రాక్షసుడు కనిపెట్టాడు. అతడు జలరాక్షసి సింహిక కుమారుడు, బహు మాయావి. జరుగుతూన్న మోసాన్ని చెప్పినా వినిపించుకొనే స్థితిలో రాక్షసులు లేకపోవడం జూసి, రాహువు దేవతల రూపు ధరించి దేవతల వరుసలో చేరి, అమృతాన్ని తాగాడు.

సూర్యచంద్రులు అది గమనించి, మందర పర్వతాగ్రంపై విష్ణువుగానే ఉన్న బహురూపియైన విష్ణువుతో చెప్పారు. విష్ణువు తన చక్రాన్ని రాక్షసుడి పైకి పంపాడు. రాహువు చక్రాన్ని తప్పించుకోవాలని గ్రహాలు తిరిగే అంతరిక్షానికి ఎగిరాడు.

విష్ణుచక్రం వెంబడించి రాక్షసుడి తలను ఖండించి, తలనూ మొండేన్నీ వేరు చేసింది. అమృత ప్రభావం వల్ల తలా, మొండెమూ రెండూ సజీవంగా ఉండి తల రాహువుగా, మొండెం కేతువుగా రెండుగ్రహాలుగా మారి, గ్రహకూటమిలో చేరాయి. రాహుకేతు గ్రహాలతో గ్రహాలు తొమ్మిది అయ్యాయి. అమృతాన్నంతా దేవతలకు పంచి జగన్మోహిని అంతర్ధానమైంది. రాక్షసులు తమ తెలివిమాలిన తనానికి చింతించి అసురులయ్యారు. దేవతలు సురులయ్యారు.

**– డి.వి.ఆర్.**

**గమనిక:** అనివార్య కారణాల వల్ల ఈరోజు 'సాగుబడి' పేజీ ఇవ్వలేకపోతున్నాం.
**– ఎడిటర్**

సాక్షి ఫ్యామిలీ సినిమా
విజయవాడ ॥ మంగళవారం
23-7-2019

# సూర్యకు నటన రాదనుకున్నా! - రజనీకాంత్



● కేవీ ఆనంద్, శంకర్, సూర్య, రజనీకాంత్, మోహన్‌లాల్, వైరముత్తు, సుభాస్కరన్

''తన సహనటులెవరికీ చెడ్డ పేరు రాకూడదనుకుంటారు శివకుమార్. వాళ్ల అబ్బాయిలు సూర్య, కార్తీని కూడా అలానే పెంచారు. తొలి సినిమా 'పరుత్తివీరన్ ('మల్లిగాడు')లో కార్తీ అద్భుతంగా చేశాడు. సూర్య ఫస్ట్ సినిమా చూసి తనకు నటించడం రాదేమో? అనుకున్నాను. తనని తాను మలచుకొని ఈ స్థాయిలో నిలబడ్డాడు'' అని రజనీకాంత్ అన్నారు. సూర్య హీరోగా కేవీ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాప్పాన్' (తెలుగులో బందోబస్త్). సయేషా కథానాయిక. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో మోహన్‌లాల్, ఆర్య, సముద్రఖని కీలక పాత్రలు చేశారు. ఈ చిత్రం ఆగస్ట్ 30న రిలీజ్ కానుంది. ఈరోజు సూర్య పుట్టినరోజు. ఈ సందర్భంగా చెన్నైలో జరిగిన ఈ చిత్రం ఆడియో ఫంక్షన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రజనీకాంత్ మాట్లాడుతూ – ''దర్శకుడు కేవీ ఆనంద్ నా 'శివాజీ' సినిమాకు కెమెరామేన్. ఆయనకు కథ మీద మంచి జడ్జిమెంట్ ఉంది. నేను ఆయనతో ఓ సినిమా చేయాలి కానీ ఆగిపోయింది. మోహన్‌లాల్ గొప్ప నటుడే కాదు గొప్ప వ్యక్తి కూడా. హ్యారిస్ మ్యూజిక్ బావుంటుంది. 'నేనే దేవుణ్ణి' సినిమాలో ఆర్య నటన ఆశ్చర్యం కలిగించింది. తమిళ ఇండస్ట్రీకు దొరికిన వరం నిర్మాత సుభాస్కరన్. ప్రస్తుతం 'ఇండియన్ 2, దర్బార్, పొన్నియిన్ సెల్వన్' నిర్మిస్తున్నారు. 'శివపుత్రుడు, గజిని, సింగం, సింగం 2' వంటి గొప్ప సినిమాలు చేశారు సూర్య. విద్యా వ్యవస్థపై సూర్య చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుబట్టారు. 'అగరం' సంస్థ ద్వారా ఎందర్నో విద్యావంతుల్ని చేస్తున్నారు సూర్య'' అన్నారు. ''కేవీ ఆనంద్‌గారు, నేను చేస్తున్న మూడో (వీడొక్కడే, బ్రదర్స్) సినిమా ఇది. అందర్నీ మెప్పించేలా ఈ సినిమా తీశారాయన. సుభాస్కరన్ గారికి థ్యాంక్స్. ఆర్య ముందే సాయేషాతో ప్రేమగా నటించే సీన్స్ చేయడానికి ఇబ్బందిపడ్డాను (నవ్వుతూ). రజనీకాంత్‌గారికి, శంకర్‌గారికి థ్యాంక్స్. ఒకరి దారి రహదారి.. మరొకరేమో తన సినిమాలతో ఇండస్ట్రీను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్తున్నారు. నా బలం ఫ్యాన్సే. కుటుంబం తర్వాతే సమాజం గురించి ఆలోచించండి (అభిమానులను ఉద్దేశిస్తూ..)'' అన్నారు సూర్య. ''ఈ కాప్పాన్‌కు (రక్షించేవాడు) పైనున్న కాప్పాన్ అండగా నిలుస్తాడనుకుంటున్నాను'' అన్నారు మోహన్‌లాల్. ''సూర్య రాను రాను యువకుడిలా మారిపోతున్నాడు. కమర్షియల్ సినిమాకు ఉండాల్సిన అన్ని అంశాలు ఈ సినిమాలో కనిపిస్తున్నాయి'' అన్నారు శంకర్. ''ఈ సినిమాలో మోహన్‌లాల్ ప్రధానమంత్రి పాత్ర చేశారు. సూర్యకు, నాకు మధ్య మంచి అనుబంధం ఉంది. సీన్ అద్భుతంగా రావడానికి ఎంత కష్టమైనా పడతాడు సూర్య'' అన్నారు ఆనంద్. ''సమాజం మీద బాధ్యత ఉన్న కొద్ది మంది నటుల్లో సూర్య ఒకరు. నటుడిగా ఆల్రెడీ నిరూపించుకున్నారు'' అన్నారు రచయిత వైరముత్తు. ''6వ తరగతిలో పెయింటింగ్ పోటీలో నా చేతుల మీదగా అవార్డ్ తీసుకున్నారు ఆనంద్. సూర్యకు, తనకు ఈ సినిమా హ్యాట్రిక్ అవుతుంది'' అన్నారు శివకుమార్.

## రాజా చలో ఢిల్లీ


● రవితేజ

డిస్కో రాజా హైదరాబాద్‌లో చాలా జోరుగా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. అదే జోరుతో త్వరలో చలో ఢిల్లీ అంటూ ఫ్లైట్ ఎక్కబోతున్నాడు. రవితేజ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామ్ తాళ్ళూరి నిర్మిస్తోన్న చిత్రం 'డిస్కో రాజా'. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్ పుత్, 'నన్ను దోచుకుందువటే' ఫేమ్ నభా నటేష్ కథానాయికలు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. కోటీ 20 లక్షల రూపాయలతో వేసిన సెట్‌లో రవితేజ, 'వెన్నెల' కిశోర్, శిశిర్ శరమ్, టోని హోప్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ నెల 26వరకూ ఇక్కడ చిత్రీకరించి ఆగస్ట్ మొదటివారంలో ఢిల్లీలో కొత్త షెడ్యూల్ మొదలుపెట్టనున్నారు. ఈ సందర్భంగా రామ్ తాళ్ళూరి మాట్లాడుతూ – ''నేల టిక్కెట్' తర్వాత రవితేజగారితో మేం నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. ఆయన ఎనర్జీ సూపర్. వీఐ ఆనంద్ గొప్ప విజన్ ఉన్న దర్శకుడు. వినోద ప్రధానంగా సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సాయి శ్రీరామ్, డైలాగ్స్: అబ్బూరి రవి, మ్యూజిక్: ఎస్.ఎస్. తమన్, ఎడిటింగ్: నవీన్ నూలి.

## పెన్ పెన్సిల్

కవికి కలం ముఖ్యం. అందుకే దానికి కూడా ఓ పేరు పెట్టుకుంటాడు. ఆ పేరుతో రచనలు చేస్తుంటాడు. నాని కూడా రచయితగా మారారా. ఆయన కూడా తన పెన్నుకో పేరు పెట్టుకోవాలనుకున్నారు. ఆలోచించి చించీ పెన్నుకి తమ్ముడైన పెన్సిల్ పేరుని తన పెన్నుకి పెట్టుకున్నారు. పెన్‌ఫ్యూషన్‌గా ఉందా? అయితే అసలు విషయానికి వచ్చేస్తాం. నాని నటిస్తున్న కొత్త చిత్రం 'గ్యాంగ్‌లీడర్'. విక్రమ్ కె. కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ సినిమాలో నాని పెన్ నేమ్ పెన్సిల్ అట. ఇందులో నాని రచయితగా నటిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను ఇవాళ రిలీజ్ చేస్తున్నారు. సినిమా ఆగస్ట్ 30న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు అనిరుధ్ సంగీత దర్శకుడు.


● నాని


● కాజల్ అగర్వాల్

## వెబ్ ఎంట్రీ?

చాలెంజ్‌లకు, కొత్త కొత్త విషయాలకు నేనెప్పుడూ సిద్ధం అంటారు కాజల్ అగర్వాల్. ఇప్పుడు అలాంటి కొత్త ప్రయాణాన్నే ప్రారంభించనున్నారని తెలిసింది. తెలుగు, తమిళ భాషల్లో హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్నారు ఈ బ్యూటీ. ఇదిలా ఉంటే ప్రేక్షకుడికి వినోదం పంచడానికి సినిమా స్టార్స్ కొత్తకొత్త ప్లాట్‌ఫామ్స్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో వెబ్ వరల్డ్‌లోకి ప్రవేశిస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఇప్పుడు కాజల్ అగర్వాల్ కూడా ఈ వెబ్ ప్రపంచంలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.. తమిళ దర్శకుడు వెంకట్‌ప్రభు హాట్‌స్టార్ కోసం ఓ వెబ్ సిరీస్‌ను రూపొందిస్తున్నారు. ఈ సిరీస్‌లోనే కాజల్ నటించనున్నారట. పది ఎపిసోడ్స్‌తో తెరకెక్కనున్న ఈ సిరీస్ షూటింగ్‌ను ఆగస్ట్‌లో ఆరంభించి సెప్టెంబర్‌కు ముగిస్తారట. కాజల్ నటించిన 'రణరంగం, కోమలి' సినిమాలు ఆగస్ట్ 15న రిలీజ్ కానున్నాయి.

''మ్యూజికల్ ఫెస్టివల్' అని కొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు.. వేరే హీరోలు చేయనివి చేస్తున్నారు? అని మేం 'డియర్ కామ్రేడ్' మ్యూజిక్ ఫెస్ట్ చేసినప్పుడు కొందరు అడిగారు. వేరే యాక్టర్లు చేయనిది చేద్దామనో, ఇండస్ట్రీలో లేనిది చేద్దామనో కాదు. నా సినిమాకి నాకు నచ్చినట్టు చేద్దామని 'మ్యూజిక్ ఫెస్ట్' నిర్వహించాం'' అన్నారు విజయ్ దేవరకొండ. భరత్ కమ్మ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి (సి.వి.ఎం), యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ చెప్పిన విశేషాలు.

● ఈ సినిమా కోసం జస్టిన్ ప్రభాకరన్ స్వరపరచిన పాటలు నాకు బాగా నచ్చాయి. ఓ సినిమాలో రెండు హిట్ పాటలొస్తే చాలా సంతోషం. ఇందులో 8 పాటలుంటే 5 పాటలు సూపర్‌గా ఉన్నాయి. పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేస్తున్నాం. ప్రమోషన్ కోసం నాలుగు సిటీలు తిరగాలి. ప్రతిసారీ ఏం మాట్లాడతాం.. ఆడుతూ పాడుతూ ఎంజాయ్ చేద్దామనుకుని మ్యూజిక్ ఫెస్ట్ ప్లాన్ చేశాం. కర్నాటక, కేరళ ప్రేక్షకులు నా సినిమాలు చూస్తున్నారు. వారి మధ్య 'మ్యూజిక్ ఫెస్టివల్' చేద్దామనుకున్నాం. ఫస్ట్ బెంగళూరులో చేసేటప్పుడు ఎలా ఉంటుందో ఏంటో అని కొంచెం టెన్షన్ ఉండేది. అక్కడ సూపర్ సక్సెస్ అయింది. చెన్నై, కొచ్చి, హైదరాబాద్‌లోనూ సక్సెస్ అయింది. ఇది నాకొక తీపి గుర్తు. డ్యాన్స్‌లు చూడటం ఇష్టం. కానీ, చేయడమంటే భయం. సాంగ్ షూట్ ఉందంటే.. ఓ భయం. రెండు రోజులు రిహార్సల్ చేస్తే కానీ షూటింగ్ జరగదు. డ్యాన్స్ నాకు సహజంగా రాదు. కానీ, ఎంజాయ్ చేస్తాను.

● 'డియర్ కామ్రేడ్' నాకు చాలా ఇష్టం. ఈ సినిమాకి మంచి డైరెక్టర్, సంగీతం, కెమెరా, డైలాగ్స్, నటన... ఇలా ప్రతిదీ బాగా కుదిరింది. చాలా సంతృప్తి ఇచ్చిన సినిమా. 'అర్జున్ రెడ్డి' టైమ్‌లో ఈ కథ విన్నా. అప్పటి నుంచి ఈ ప్రయాణం సాగుతోంది. భావోద్వేగంతో కూడుకున్న చిత్రం 'డియర్ కామ్రేడ్'. థియేటర్ నుంచి ప్రేక్షకులు వెళ్లేటప్పుడు ఒక ఎమోషన్‌ని, ఆలోచనని ఇంటికి తీసుకెళ్తారు. చూసి, ఎంజాయ్ చేసి థియేటర్లో వదిలేసే సినిమా కాదు. బాబీ, లిల్లీ పాత్రల ప్రయాణం ఇది. బాబీపై లిల్లీ ప్రభావం ఏంటి? లిల్లీపై బాబీ ప్రభావం ఏంటి? అన్నది ముఖ్యం.

● తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదలవుతున్న తొలి తెలుగు సినిమా ఇది. 'బాహుబలి' తెలుగు, తమిళ్, మలయాళంలో విడుదలైంది కానీ కన్నడలో రిలీజ్ కాలేదు. కానీ, 'బాహుబలి'తో మా సినిమాకి పోలికే లేదు. ఎందుకంటే ఆ కథే వేరు. 'డియర్ కామ్రేడ్'ని తెలుగులోనే తీద్దామని స్టార్ట్ చేశాం. 50శాతం షూటింగ్ అయ్యాక ఈ కథ అందరికీ నచ్చుతుందనిపించి నాలుగు భాషల్లో చేశాం.

● తెలుగు సినిమా 'అర్జున్‌రెడ్డి' 250 కోట్లు వసూలు చేసిందంటే మన వద్ద ఏదో మ్యాజిక్ ఫార్ములా ఉందని బాలీవుడ్ వాళ్లు షాక్ అయ్యారు. నాకు బాగా ఎగ్జైటింగ్‌గా అనిపిస్తే బాలీవుడ్ సినిమా చేస్తా. తెలుగు ఇండస్ట్రీలో ఉండి నేషనల్ వైడ్ షేక్ చేస్తేనే మజా ఉంటుంది. 'బాహుబలి, 'అర్జున్‌రెడ్డి, కేజీఎఫ్'తో షేక్ చేశారు. ఇప్పుడు 'సాహో'తో షేక్ చేస్తున్నారు. మణిరత్నం, శంకర్‌గార్లు కూడా షేక్ చేశారు. 'డియర్ కామ్రేడ్' బాలీవుడ్ రీమేక్ హక్కులు అడుగుతున్నారు.


● విజయ్ దేవరకొండ

రియల్ లైఫ్‌లో ఉండే ఎమోషన్స్ రీల్ లైఫ్‌లో ఉండవు. కానీ, ఓ నటుడిగా వృత్తికి న్యాయం చేయడం నా బాధ్యత.

● ప్రతి అబ్బాయి బాబీ కాదేమో కానీ, ప్రతి అమ్మాయి లిల్లీ. నాకు తెలిసిన పదిమందిలో తొమ్మిది మంది అమ్మాయిల జీవితం ఈ సినిమా. ఇలాంటి కథ చెప్పాలనిపించింది. దాన్ని చక్కగా చెబుతాడనే నమ్మకం భరత్‌పై ఉంది.. చెప్పాడు.

# ముద్దులు పెడితే సినిమాలు నడుస్తాయా?

తర్వాత ఎలాగూ నన్నే చేయమంటారు కాబట్టి నా వల్ల కాదని చెప్పా. చెప్పిన కథనే మళ్లీ ఏం చెబుతాం? హిందీలో 'కబీర్ సింగ్' పూర్తయ్యేటప్పటికి 'నోటా, టాక్సీవాలా, గీత గోవిందం, కామ్రేడ్'..నాలుగు కథలు చెప్పా. ఈ జర్నీలో వేరే భాషల్లో సినిమాని ఎలా ప్రమోట్ చేయాలో తెలిసింది.

● నేను నటుణ్ణి. ప్రతి సీన్ రియల్‌గా ఉండేలా చేయాలి. రష్మిక నాకు రెండేళ్లుగా తెలుసు. సినిమాలో బాబీ, లిల్లీలకు చిన్నప్పుడే పరిచయం అవుతుంది. సినిమాలో వాళ్ల ప్రయాణం కనిపించాలి. రష్మిక స్థానంలో వేరే ఎవరు ఉన్నా చేసేవాడిని. ఓ నటుడిగా నాకు ఓ కుర్చీ ఇచ్చినా కెమిస్ట్రీ తీసుకొస్తా. ఫైట్ సీన్స్ తీస్తున్నప్పుడు ఎలాంటి ఫీల్ ఉంటుందో.. ముద్దు సీన్లు తీస్తున్నప్పుడు కూడా అలాంటి అనుభూతే ఉంటుంది.. అంతేకానీ, ఇంటర్నల్‌గా ఎలాంటి ఫీల్ ఉండదు. నాకు తెలిసి ఏడాది తర్వాత సినిమాల్లో ముద్దు సన్నివేశాలు సాధారణం అయిపోతాయనుకుంటున్నా. ముద్దు సన్నివేశాలు పెడితే సినిమాలు నడుస్తాయనడం కరెక్ట్ కాదు.

● పూరి జగన్నాథ్‌గారితో సినిమా అని వస్తున్న వార్తలు నిజం కాదు. కొరటాల శివగారు చిరంజీవి సార్ సినిమా పూర్తి చెయ్యాలి. అది పూర్తయ్యేసరికి నేను ఏ సినిమాలు చేస్తుంటానో, ఆయన ఏ సినిమా చేస్తుంటారో తెలియదు. కానీ, ఆయనంటే నాకు ఇష్టం. ఆయనతో పని చేయాలనుంది.

● గెడ్డం పెంచి, బైక్‌లపై తిరిగేవాళ్లంతా విజయ్ దేవరకొండ కాలేరు. దాని వెనకాల కొన్నివేల ఆలోచనలు పనిచేస్తుంటాయి. అలా అవ్వాలనుకునేవాళ్లకి ఆల్ ది బెస్ట్. ప్రతిభ, ప్యాషన్, ఇంటెలిజెంట్ అనేవి ఉంటేనే ఇక్కడ ఎవరైనా స్టార్ అవ్వొచ్చు. ఇక్కడ ఎవరి స్థానం వారిది. ఇమేజ్ అన్నది శాశ్వతం కాదు. నేను 'అర్జున్‌రెడ్డి' కి ముందు ఎలా ఉన్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను.

● క్రాంతిమాధవ్ దర్శకత్వంలో సినిమా తర్వాత విజయ్ అనే కొత్త దర్శకుడితో సినిమా ఉంటుంది. మైత్రీ మూవీస్‌లోనే ఈ సినిమా ఉంటుంది.

## తమిళ నిర్మాతల వల్ల నష్టపోయా


● తమ్మారెడ్డి భరద్వాజ

''ఆమె' సినిమాకి మంచి పేరు వచ్చింది.. కానీ, కలెక్షన్లు ఆశించిన రీతిలో రాలేదు. కలెక్షన్లు రాకపోవడంతో అన్యాయం జరిగిందని చెప్పడం లేదు'' అని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. అమలాపాల్ లీడ్ రోల్‌లో రత్నకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం'ఆడై'. ఈ చిత్రాన్ని తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో రాంబాబు కల్లూరి, విజయ్ మోరవనేని 'ఆమె' పేరుతో ఈ నెల 20న తెలుగులో విడుదల చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''తమిళ నిర్మాతలకు నెల కిందటే 'ఆమె' కోసం డబ్బులు చెల్లించాం. తమిళనాడులోని డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇచ్చారు. అయితే ఫైనాన్షియర్లకు నిర్మాతలు డబ్బు కట్టలేదు. చివరకు అమలా పాల్ తన రెమ్యునరేషన్ వెనక్కి ఇవ్వడంతో పాటు ఎదురు డబ్బులు ఇచ్చి విడుదల చేయించింది. ముందుగా అనుకున్నట్లు 19న విడుదలైతే బాగుండేదేమో? ఒక రోజు ఆలస్యంగా విడుదల కావడం వల్ల క్రేజ్ తగ్గిపోయి మా చిత్రం చచ్చిపోయింది. అన్ని థియేటర్లలో హౌస్‌ఫుల్ అవుతున్న సినిమా చంపేయబడింది. సరైన విడుదల తేదీ, థియేటర్లు దొరక్క చాలామంది నష్టపోతున్నారు. నాకు దొరికినా తమిళ నిర్మాతల వల్ల నష్టపోయా. దీనిపై తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో కేసు పెట్టా. ఓ మంచి సినిమా తీయడం ఎంత ముఖ్యమో దాన్ని పద్ధతిగా విడుదల చేయడం కూడా అంతే ముఖ్యమనే పాఠాన్ని 'ఆమె'తో నేర్చుకున్నా. ఇక ఈ సినిమా విషయానికొస్తే... నేటితరం ఆవేశంలో, మద్యం మత్తులో విసిరే సవాళ్ల ఎలాంటి ప్రమాదాలకు దారి తీస్తాయనే విషయాన్ని అసభ్యత లేకుండా తీశాడు దర్శకుడు. అమలాపాల్ బాగా నటించింది. 'మల్లేశం, ఆమె' లాంటి సినిమాలను ఆదరిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి'' అన్నారు.

## ఒక ట్విస్ట్ ఉంది


● వెంకటేశ్, రూపేశ్, సలోని

''మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై శివకుమార్ బి. దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం '22'. రూపేశ్‌కుమార్ చౌదరి, సలోని మిశ్రా నాయకానాయికలుగా నటిస్తున్నారు . యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. హీరో, హీరోయిన్లపై వెంకటేశ్ క్లాప్ ఇవ్వగా, నిర్మాతలు బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, నవీన్ ఎర్నేని, కొండా కృష్ణంరాజులు కెమెరా స్విచాన్ చేశారు. భీమనేని శ్రీనివాసరావు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు హరీశ్ శంకర్ శివకుమార్‌కు స్క్రిప్ట్ అందించారు. దర్శకుడు శివకుమార్.బి మాట్లాడుతూ– ''టైటిల్‌లో ఉన్న 22 నంబర్‌కు కథలో ఓ ట్విస్ట్ ఉంది. మర్డర్ మిస్టరీతో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. ఈ 29న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. నా బలం మా అమ్మ డైరెక్టర్ జయగారు. ఆవిడ ఎక్కడ ఉన్నా సంతోషిస్తారు. నాన్న బి.ఎ. రాజుగారు నన్ను ఎప్పుడూ సపోర్ట్ చేస్తూ ఎంకరేజ్ చేస్తున్నారు'' అన్నారు. రూపేశ్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ– ''నేను వెంకటేశ్‌గారికి పెద్ద ఫ్యాన్‌ని. ఆయన సినిమాలు ఒక్కోటి 15 సార్లు చూసి ఉంటాను. అలాంటిది నా మొదటి సినిమాకు ఆయన వచ్చి క్లాప్ కొట్టడం థ్రిల్‌గా ఉంది'' అన్నారు.''ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు హ్యాపీగా ఉంది. ఈ సినిమా ట్విస్ట్ అండ్ టర్న్‌లతో అందరికీ నచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు సలోని.

## ఇస్మార్ట్... కాన్సెప్ట్ నాదే!


● ఆకాష్

''ఒక వ్యక్తి మెదడును హీరోకి మార్చే కాన్సెప్ట్‌తో తెలుగు–తమిళ భాషల్లో లేడీ డైరెక్టర్ రాధ నాతో సినిమా తీశారు. 'నాన్ యార్' పేరుతో తమిళ చిత్రం విడుదల కాగా, 'కొత్తగా ఉన్నాడు' పేరుతో త్వరలో తెలుగులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఈలోపు ఇలాంటి మూలకథతో 'ఇస్మార్ట్ శంకర్' రిలీజ్ కావడం మాకు షాక్ తగిలినట్లయింది'' అని 'ఆనందం' ఫేమ్ ఆకాష్ అన్నారు. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'ఇస్మార్ట్ శంకర్' ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. సోమవారం పాత్రికేయులతో ఆకాష్ మాట్లాడుతూ – ''పూరి జగన్నాథ్‌ను సంప్రదించడానికి ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు. అందుకే తమిళ నిర్మాతల మండలిలో ఫిర్యాదు చేసి, ఇక్కడ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశాం. ఈ సమస్య సామరస్యంగా పరిష్కారం కాకపోతే చట్టాన్ని ఆశ్రయించాలనుకుంటున్నాను'' అన్నారు.

## వ్యూహాలు ఫలించాయా?


● కేటీ నాయక్, వెంకట్

సుమన్ రంగనాథన్, ముమైత్ ఖాన్, బెనర్జీ, వెంకట్, సంజీవ్‌కుమార్ ముఖ్య తారలుగా కేటీ నాయక్ దర్శకత్వంలో తెరకెక్కిన కన్నడ చిత్రం 'దండుపాళ్యం 4'. వెంకట్ నిర్మించిన ఈ సినిమా అదే పేరుతో తెలుగులో ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ– ''జైలులో ఉన్న తమ సహచరులను తప్పించడానికి ఓ దండు ఎలాంటి వ్యూహాలు రచించింది? వారి వ్యూహాలు ఫలించాయా? పోలీసుల ఎత్తుగడకు వీరు చిత్తయ్యారా? లేక విజయం సాధించారా? అనే అంశాలతో రూపొందిన చిత్రమిది. ఏడుమంది ఉన్న గ్యాంగ్‌కు నాయకురాలిగా సుమా రంగనాథన్ నటించారు. ప్రస్తుతం సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆగస్టు 15న విడుదల చేస్తాం'' అన్నారు. ''దండుపాళ్యం 1,2' చిత్రాలకు మా సినిమాకి సంబంధం లేదు. ఇందులో కథ, కథనాలు కొత్తగా ఉంటాయి'' అన్నారు కె.టి.నాయక్.




# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
23-7-2019





# కెరీర్ ట్రేడింగ్

**మనం నిద్రపోతున్నప్పుడు కూడా మనం సంపాదించిన డబ్బు పిల్లలు పెట్టాలంటారు అమెరికాకు చెందిన ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్. అందుకే సంపాదించిన డబ్బును రెట్టింపు చేసుకోవాలనే ఆలోచన ప్రజల్లో అధికమైంది. మరి ఎక్కడ పెట్టుబడి పెడితే ఆదాయం బాగుంటుంది? బ్యాంకుల్లో వడ్డీ రేట్లు ఆశాజనకంగా లేవు. అందుకే ఇప్పుడు చాలామంది మ్యూచువల్ ఫండ్స్, స్టాక్‌మార్కెట్, ట్రేడింగ్‌వైపు దృష్టిసారిస్తున్నారు. దాంతో అలాంటి ఇన్వెస్టర్లకు సేవలు అందించే ట్రేడింగ్ కంపెనీలు, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, స్టాక్ బ్రోకింగ్ కంపెనీల సంఖ్య పెరుగుతోంది. ఇదే ఇప్పుడు యువతకు ఉజ్వల కెరీర్‌కు వేదికగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, బ్రోకింగ్, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్‌మార్కెట్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు, అర్హతలు, ప్రత్యేక సర్టిఫికేషన్స్ గురించి తెలుసుకుందాం..**

**వ్యక్తుల రాబడి మంత్రం.. యువత కెరీర్‌కు మార్గం**

**ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ విభాగాల్లో పెరుగుతున్న కొలువులు**

**స్టాక్‌మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ సంస్థల్లో అవకాశాలు**

**ఇంటర్, డిగ్రీతోపాటు సంబంధిత కోర్సులు పూర్తిచేస్తే చక్కటి భవిష్యత్తు**

## మ్యూచువల్ ఫండ్స్.. హోదాలు అనేకం

- కొంతకాలం క్రితం వరకూ ప్రజలు తమ వద్ద ఉన్న నగదును పెంచుకోవడానికి బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో దాచుకునేవారు. కానీ, బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గడంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్స్‌లో పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు.
- మ్యూచువల్ ఫండ్ అంటే.. ఓ సంస్థ.. వ్యక్తుల (ఇన్వెస్టర్లకు)నుంచి డబ్బును సేకరించి.. రకరకాల మార్గాల్లో ముఖ్యంగా స్టాక్స్, బాండ్స్, ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడం! పలు ఆర్థిక సంస్థలు మ్యూచువల్ ఫండ్స్‌ను నిర్వహిస్తూ.. ఇన్వెస్టర్ల నుంచి నగదును సమీకరించి వారి ఆసక్తి, భవిష్యత్తు రాబడి అంచనాలకు అనుగుణంగా సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. మ్యూచువల్ ఫండ్స్‌పై అంతగా అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ రంగంలో యువతకు అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి.

## రీసెర్చ్ అనలిస్ట్

ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల్లో కీలకమైన హోదా.. రీసెర్చ్ అనలిస్ట్. ఈక్విటీలకు సంబంధించి క్రయ-విక్రయాలపై అధ్యయనం చేయడం ఈక్విటీ రీసెర్చ్ అనలిస్ట్ ప్రధాన విధులు. రీసెర్చ్ అనలిస్ట్‌లు స్టాక్స్‌కు సంబంధించి రీసెర్చ్ చేసి ఫండ్ మేనేజర్లకు సలహాలు ఇస్తారు. అలాగే క్లయింట్లకు.. ఈక్విటీ డెరివేటివ్స్, ఈక్విటీస్ గురించి విశ్లేషిస్తారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్ బ్రోకరేజ్ సంస్థలు ఎంబీఏ/స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ పీజీ ఉత్తీర్ణులను రీసెర్చ్ అనలిస్ట్‌లుగా నియమించుకుంటున్నాయి. వీరికి వార్షిక వేతనం రూ.8 లక్షల వరకు అందుతోంది.

## కస్టోడియన్/రిజిస్ట్రార్

ఇన్వెస్టర్ల నుంచి నగదును సమీకరించి ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టే సంస్థలు..సదరు నగదును, ఫండ్ నిర్వహణను దుర్వినియోగం చేయకుండా చూడడం కస్టోడియన్/రిజిస్ట్రార్స్ విధులు. ఫండ్స్‌ను అందించే బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్స్, బ్రోకరేజ్ సంస్థలు వీరిని నియమించుకుంటున్నాయి. న్యాయ విద్యతోపాటు పని అనుభవం ఉన్నవారికి సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కస్టోడియన్/రిజిస్ట్రార్‌గా కొలువు సొంతం చేసుకున్న వారికి వేతనాలు ఆకర్షణీయమని చెప్పొచ్చు.

## ట్రస్టీ

ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి మరో కీలకమైన ఉద్యోగం.. ట్రస్టీ. థర్డ్ పార్టీకి సేవలందిస్తున్న సంస్థలో.. సదరు థర్డ్ పార్టీ అసెట్స్‌ను సద్వినియోగం చేసేలా చూడడం, వాటికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ట్రస్టీ ముఖ్య విధులు.

## ఫండ్ మేనేజర్

మ్యూచువల్ ఫండ్స్ విభాగంలో అత్యంత కీలకమైన హోదా.. ఫండ్ మేనేజర్. ఇన్వెస్టర్ల సొమ్మును పెట్టుబడిగా పెట్టే విషయంలో ఆయా సంస్థల ప్రస్తుత పనితీరు, ఇటీవల కాలంలో సదరు కంపెనీల ఆర్థిక ఫలితాలు, లాభ నష్టాలు, అవి అందించిన డివిడెండ్స్, రానున్న రాజుల్లో సదరు సంస్థల పనితీరు ఎలా ఉంటుంది? వంటి అనేక అంశాలను పరిశీలించి ఇన్వెస్టర్లకు సరైన సలహాలివ్వడం ఫండ్ మేనేజర్ల ప్రధాన విధులు. నిర్దిష్టంగా ఎందులో పెట్టుబడి పెడితే బాగుంటుందో వివరించి ఒప్పించడం వంటి కీలక బాధ్యతలను వీరు నిర్వహిస్తుంటారు. ఫండ్ మేనేజర్‌గా రాణించాలంటే.. క్యాపిటల్ మార్కెట్ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉండాలి. అదేవిధంగా విశ్లేషణ నైపుణ్యాలు తప్పనిసరి. ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు కామర్స్, ఎకనామిక్స్, ఎంబీఏ, సీఏ, ఫైనాన్షియల్ ప్లానింగ్, స్టాటిస్టిక్స్ విభాగంలో పీజీ స్థాయి అర్హతలు ఉన్న అభ్యర్థులను ఫండ్ మేనేజర్లుగా నియమించుకుంటున్నాయి. వీరికి వార్షిక వేతనం రూ.ఆరు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ఉంటుంది.

## ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్

ఇన్వెస్టర్ల తరఫున పలు సెక్యూరిటీ పోర్ట్‌ఫోలియోస్‌లో ఇన్వెస్ట్ చేయడం ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ల ముఖ్య బాధ్యత. వీరు నిత్యం సెక్యూరిటీస్ క్రయ విక్రయాలు, పోర్ట్‌ఫోలియోల సమీక్ష, లావాదేవీల పరిష్కారం, సంబంధిత స్టాక్స్ పనితీరు, నియంత్రణ, క్లయింట్ల(ఇన్వెస్టర్లు)కు నివేదించడం వంటి విధులు నిర్వహిస్తుంటారు. సంస్థలు కామర్స్/ఫైనాన్స్/ఎకనామిక్స్‌తో బ్యాచిలర్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులను నియమించుకుంటున్నాయి. ప్రారంభంలో రూ.4లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తోంది.

## ఫైనాన్షియల్ అడ్వైజర్

ఇన్వెస్టర్లను గుర్తించడం, వారి పెట్టుబడి లక్ష్యాల్ని తెలుసుకోవడం, అందుబాటులో ఉన్న ప్రొడక్ట్‌ల గురించి చెప్పడం వీరి విధులు. ఫైనాన్షియల్ అడ్వైజర్‌లకు క్లయింట్ల లక్ష్యాలు తెలుసుకోవడమే కాకుండా.. క్యాపిటల్ మార్కెట్లో ఆయా సంస్థల పనితీరు గురించి కూడా అవగాహన ఉండాలి. బ్రోకరేజ్ సంస్థలు బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోపాటు సంబంధిత నైపుణ్యాలున్న వారిని ఫైనాన్షియల్ అడ్వైజర్‌లుగా నియమించుకుంటున్నాయి. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులను క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు రిక్రూట్ చేసుకుంటున్నాయి. వీరికి కొద్ది రోజులు శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగిస్తున్నాయి.

## మార్కెటింగ్

మ్యూచువల్ ఫండ్ విభాగానికి సంబంధించి బ్రోకింగ్ సంస్థలు క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ విభాగాన్ని కీలకంగా భావిస్తున్నాయి. కారణం.. క్లయింట్లను సమీకరించడం, తద్వారా తమ టర్నోవర్ పెంచుకోవడం వంటి లక్ష్యాలు నిర్దేశించుకోవడం కోసమే. క్షేత్రస్థాయిలో రిలేషన్‌షిప్ మేనేజర్స్ లేదా అడ్వైజర్స్ పేరుతో మార్కెటింగ్ విభాగంలో నియామకాలు చేపడుతున్నాయి. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షల వరకు అందుతోంది.

## ఇన్వెస్ట్‌మెంట్‌లో ఫిన్‌టెక్

ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ రంగంలోనూ టెక్నికల్ నైపుణ్యాలతో కార్యకలాపాలు నిర్వహించేలా సంస్థలు అడుగులు వేస్తున్నాయి. బిగ్‌డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీ అమలు చేస్తున్నాయి. రోబో ఇన్వెస్టరీ అడ్వైజింగ్, రోబో ఈక్విటీ అడ్వైజర్ వంటివి రానున్నాయి. కాబట్టి భవిష్యత్‌లో బీటెక్, ఎంటెక్ వంటి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో చక్కటి అవకాశాలు లభిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

## స్టాక్ మార్కెట్ కొలువులు

స్టాక్ మార్కెట్ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి పలు కొలువులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇవి ప్రధానంగా బ్రోకింగ్ సంస్థలు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేషన్ సంస్థల్లో లభిస్తున్నాయి. వీటిలో స్టాక్ బ్రోకర్, స్టాక్ ట్రేడర్, వెల్త్ మేనేజర్ వంటివి ముఖ్యమైనవి.

## స్టాక్ బ్రోకర్

క్షేత్రస్థాయి ఉద్యోగం ఇది. స్టాక్ బ్రోకర్.. షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలనుకునే వ్యక్తుల తరఫున ట్రేడింగ్ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అన్ని బ్రోకింగ్ సంస్థలు వీరిని డీలర్లుగా, ఏజెంట్లుగా పిలుస్తున్నాయి. డిగ్రీ, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో స్టాక్ బ్రోకర్‌గా మారొచ్చు. వీరు నెలకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదించే అవకాశముంది.

## స్టాక్ ట్రేడర్

క్షేత్రస్థాయిలోని స్టాక్ బ్రోకర్స్‌తో సంప్రదిస్తూ వారు పేర్కొన్న ప్రకారం.. ఆన్‌లైన్ క్రయ విక్రయాలు నిర్వహించడం, వాటికి సంబంధించిన నివేదికలు రూపొందించడం స్టాక్ ట్రేడర్స్ విధులు.

## వెల్త్ మేనేజర్

నిర్దిష్టంగా ఒక సంస్థ అందించే పలు ప్రొడక్ట్‌ల గురించి రిటైల్ కస్టమర్లకు తెలియజేయడం వెల్త్ మేనేజర్ ప్రధాన బాధ్యతలు. సంస్థలకు కొత్త క్లయింట్లు (ఇన్వెస్టర్లు) రావడంలో వీరిది కూడా కీలక పాత్రే.

## విస్తరిస్తున్న సెక్టార్

ప్రస్తుతం క్యాపిటల్ మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్ రంగం విస్తరిస్తోంది. 2004లో నాలుగు లక్షల కోట్లుగా ఉన్న మ్యూచువల్ ఫండ్ సెగ్మెంట్ ఈ ఏడాది జూన్ 30కి రూ.24.25 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రతి లక్ష మంది ఇన్వెస్టర్లకు యూకేలో 25.5 బ్రాంచ్‌లు, యూఎస్‌లో 35 బ్రాంచ్‌లు ఉంటే.. మన దేశంలో మాత్రం 10.9 బ్రాంచ్‌లే ఉన్నాయి. కెరీర్ అవకాశాలను పరిశీలిస్తే.. 2030 నాటికి 10 మిలియన్‌ల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. మ్యూచువల్ ఫండ్ సంస్థలే కాకుండా.. వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ట్రస్టీ సంస్థలు, రిజిస్ట్రార్ సంస్థలు, ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకులు, కేపీఓల్లో సైతం అవకాశాలు లభిస్తాయి. ఎన్ఎస్ఐఎం సర్టిఫికేషన్లు ఉంటే ఆయా అవకాశాలను మరింత త్వరగా అందుకోవచ్చు.

**– డి.జయంత్ కుమార్**, జనరల్ మేనేజర్, కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్.



## ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులు

- మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్, స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ విభాగాల్లో ఉద్యోగాలు పొందేందుకు కామర్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, ఫైనాన్స్ నేపథ్యంతో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులు అర్హులు. డిగ్రీ/పీజీలతోపాటు సంబంధిత విభాగంలో ప్రత్యేక కోర్సులను పూర్తిచేసిన వారికి ప్రాధాన్యం లభిస్తోంది.
- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ (ఎన్ఐఎస్ఎం).. స్వల్పకాలిక వ్యవధిలో పలు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తోంది. వీటిని పూర్తిచేయడం ద్వారా ఈ విభాగాల్లో స్పెషలైజ్డ్ ప్రొఫెషనల్స్‌గా జాబ్ మార్కెట్లో అడుగు పెట్టొచ్చు.

## ఎన్ఐఎస్ఎం కోర్సులు.. ఇవే

- ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ లెవల్-1, 2
- కామన్ డెరివేటివ్స్ సీపీఈ
- రీసెర్చ్ అనలిస్ట్ సీపీఈ
- సర్టిఫికెట్ ఇన్ డెరివేటివ్ మార్కెట్ స్ట్రాటజీస్
- మ్యూచువల్ ఫండ్స్ డిస్ట్రిబ్యూటర్స్ సర్టిఫికేషన్
- ఈక్విటీ సేల్స్ సర్టిఫికేషన్
- ఈక్విటీ డెరివేటివ్స్ సర్టిఫికేషన్
- మ్యూచువల్ ఫండ్స్ ఫౌండేషన్ సర్టిఫికేషన్
- **వెబ్‌సైట్:** nism.ac.in/certification/index.php/studentzone

## బీఎస్ఈ సర్టిఫికేషన్స్

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలోని బీఎస్ఈ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్.. డెరివేటివ్, రిస్క్ మేనేజ్‌మెంట్, స్టాక్ మార్కెట్, ఈక్విటీ రీసెర్చ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, వెల్త్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లలో... సర్టిఫికెట్ కోర్సులను, స్మార్ట్ ఇన్వెస్టింగ్ స్ట్రాటజీస్ అండ్ పోర్ట్ ఫోలియో మేనేజ్‌మెంట్, బిజినెస్ డేటా అనలిటిక్స్, ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ వెల్త్ మేనేజ్‌మెంట్‌లలో బేసిక్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోంది.

- **వివరాలకు వెబ్‌సైట్: bsebti.com/programs/certifications_courses.html**

## ప్రవేశాలు

### నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2020-21 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నవోదయ విద్యాలయ సమితి దరఖాస్తులు కోరుతోంది.



- **ప్రవేశం:** ఆరో తరగతి.
- **అర్హత:** 2019-20 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదో తరగతి చదువుతూ ఉండాలి.
- **వయసు:** 01.05.2007 నుంచి 30.04.2011 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా.
- **పరీక్ష తేదీలు:** 2020, జనవరి 11; 2020 ఏప్రిల్ 11.

**దరఖాస్తు:**

- ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 15.09.2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nvsadmissionclasssix.in/nvs6reg/homepage


**సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...**

- ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ & ఎన్‌టీపీసీ ఆన్‌లైన్ గ్రాండ్ టెస్టులు
- కరెంట్ అఫైర్స్ ఆన్‌లైన్ టెస్టులు

విద్య, ఉద్యోగ సమాచారం కోసం

WWW.SAKSHIEDUCATION.COM

SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి


# యూఎన్-ఎఫ్ఏవో నూతన డైరెక్టర్ జనరల్?

**గ్రూప్స్ ప్రత్యేకం**
**సమకాలీన అంశాలు**




**యూఎన్-ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) నూతన డైరెక్టర్ జనరల్‌గా 2019, జూన్‌లో ఎవరు ఎన్నికయ్యారు?**

ఎ) దావిత్ కిర్వాలిడ్జె (జార్జియా)
బి) కేథరిన్ గెస్లేన్ లానెల్లే (ఫ్రాన్స్)
సి) క్యూ డోంగ్యూ (చైనా)
డి) రమేశ్ చంద్ (భారత్)

**సమాధానం:** సి

- చైనా వ్యవసాయ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి క్యూ డోంగ్యూ (Qu Dongyu).. ఐక్య రాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) నూతన డైరెక్టర్ జనరల్‌గా 2019, జూన్ 23న ఎన్నికయ్యారు. బ్రెజిల్‌కు చెందిన జోస్ గ్రాజియానో డ సిల్వా స్థానంలో ఆయన ఎన్నికయ్యారు. ఎఫ్ఏవో 9వ డైరెక్టర్ జనరల్‌గా క్యూ డోంగ్యూ 2019, ఆగస్టు 1న పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీ కాలం నాలుగేళ్లు.
- 1945, అక్టోబర్ 16న ఎఫ్ఏవో ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం ఇటలీ రాజధాని రోమ్‌లో ఉంది.

**2019, జూన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సు ఎక్కడ జరిగింది?**

ఎ) కింగ్‌దావో (చైనా)
బి) దుషాంబే (తజికిస్తాన్)
సి) బిష్కెక్ (కిర్గిస్తాన్)
డి) తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్)

**సమాధానం:** సి

- షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) 19వ సదస్సు 2019, జూన్ 13, 14 తేదీల్లో కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగింది. ప్రధానిగా రెండోసారి ఎన్నికయ్యాక నరేంద్ర మోదీ పాల్గొన్న తొలి శిఖరాగ్ర సదస్సు ఇదే కావడం విశేషం.
- ఎస్‌సీవోలో 8 సభ్య దేశాలున్నాయి. అవి.. చైనా, రష్యా, కజకిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, భారత్, పాకిస్తాన్. ఎస్‌సీవోలో భారత్, పాకిస్తాన్‌లకు 2017లో సభ్యత్వం లభించింది.
- బిష్కెక్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంపై ప్రసంగించారు. ఎస్‌సీవో సభ్యదేశాలు ప్రాంతీయ ఉగ్రవాద వ్యతిరేక వ్యవస్థ (రీజనల్ యాంటీ టెర్రరిస్ట్ స్ట్రక్చర్-ఆర్ఏటీఎస్) కింద పరస్పరం సహకారం అందించుకోవాలని ఆయన సూచించారు.

**ప్రధానిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ తొలిసారిగా ఏ దేశంలో పర్యటించారు?**

ఎ) భూటాన్ బి) శ్రీలంక
సి) మాల్దీవులు డి) థాయిలాండ్

**సమాధానం:** సి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019, జూన్ 8న మాల్దీవుల్లో పర్యటించారు. ప్రధానిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలి విదేశీ పర్యటన ఇదే. మాల్దీవులు అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలి క్రికెట్ అభిమాని కావడంతో ఆయనకు ప్రధాని క్రికెట్ బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చారు. ప్రపంచకప్ టోర్నీలో పాల్గొన్న భారత క్రికెట్ జట్టు సభ్యులందరూ ఈ బ్యాట్‌పై సంతకాలు చేశారు. మాల్దీవుల్లో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు, ఆ దేశ క్రికెటర్లకు శిక్షణ ఇచ్చేందుకు భారత ప్రభుత్వం అంగీకరించింది.
- మాల్దీవుల రాజధాని మాలేలో విదేశీ ప్రముఖులకు ప్రదానం చేసే అత్యున్నత పురస్కారమైన ''ది మోస్ట్ ఆనరబుల్ ఆర్డర్ ఆఫ్ ది డిస్టింగ్విష్డ్ రూల్ ఆఫ్ నిషాన్ ఇజుద్దీన్''ను నరేంద్ర మోదీకి అందించారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ.. మాల్దీవులు పార్లమెంటు 'మజ్లిస్'లో ప్రసంగించారు.

**నీతి ఆయోగ్ పాలనా మండలి అయిదో సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించారు?**

ఎ) 2019, జూన్ 14 బి) 2019, జూన్ 15
సి) 2019, జూన్ 16 డి) 2019, జూన్ 17

**సమాధానం:** బి

- నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ అయిదో సమావేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 2019, జూన్ 15న నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ, పశ్చిమబెంగాల్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకాలేదు. ఈ సమావేశాన్ని 'టీమ్ ఇండియా' సమావేశంగా ప్రధానమంత్రి మోదీ అభివర్ణించారు. భారత్‌ను 2024 నాటికి అయిదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం రాష్ట్రాలు తమ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదలకు జిల్లా స్థాయినుంచే దృష్టి కేంద్రీకరించాలన్నారు.
- వ్యవసాయ రంగంలో సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని ప్రకటించారు. ఈ కమిటీలో కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సభ్యులుగా ఉంటారు.

**నూతన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాజస్థాన్‌లోని ఏ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు?**

ఎ) కోటా-బూంది బి) రాజ్ సమంద్
సి) టోంక్-సవాయిమాధోపూర్
డి) బార్మర్

**సమాధానం:** ఎ

- 17వ లోక్‌సభ స్పీకర్‌గా రాజస్థాన్‌కు చెందిన ఓం బిర్లా జూన్ 19న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భారతీయ జనతా పార్టీకి చెందిన ఓం బిర్లా కోటా-బూంది లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండోసారి గెలిచారు. గతంలో రాజస్థాన్ శాసనసభకు మూడుసార్లు ఎన్నికయ్యారు.

**మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్ (2019)ను కింది వారిలో ఎవరు గెలుచుకున్నారు?**

ఎ) ఓల్గా తొకర్జుక్
బి) జువాన్ గ్రాబ్రియెల్ వాస్క్వెజ్
సి) మారియోన్ పోష్‌మన్
డి) జోఖా అల్‌హార్తి

**సమాధానం:** డి

- 2019, మేలో మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్‌ను ఒమన్ రచయిత్రి జోఖా అల్‌హార్తికి ప్రకటించారు. ఆమె రచించిన సైదత్ అల్ ఖమర్ అనే అరబిక్ పుస్తకాన్ని ఆంగ్లంలోకి సెలెస్టియల్ బాడీస్ (Celestial Bodies) పేరుతో మేరీలిన్ బూథ్ అనువదించారు. 50 వేల పౌండ్ల నగదు బహుమతిని రచయిత్రి జోఖా అల్‌హార్తి, అనువాదకురాలు మేరీలిన్ సమానంగా పంచుకుంటారు. ఈ ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారాన్ని అందుకున్న తొలి అరబిక్ రచయిత్రిగా అల్‌హార్తి గుర్తింపు సాధించారు.

**ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ (2019) ఫైనల్లో రఫెల్ నాదల్ ఎవరిని ఓడించి టైటిల్ గెలుచుకున్నాడు?**

ఎ) నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)
బి) రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)
సి) డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)
డి) స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్)

**సమాధానం:** సి

- 2019, జూన్ 9న పారిస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో స్పెయిన్‌కు చెందిన రఫెల్ నాదల్ ఆస్ట్రియా క్రీడాకారుడు డొమినిక్ థీమ్‌ను ఓడించి, వరుసగా మూడో ఏడాది టైటిల్ సాధించాడు. దీంతో రఫెల్ నాదల్ గెలుచుకున్న ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్ టైటిళ్ల సంఖ్య 12కు చేరింది. ఇది నాదల్‌కు 18వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్. 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లతో రోజర్ ఫెదరర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.
- ఒక గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అత్యధికంగా అంటే 12సార్లు గెలుచుకున్న క్రీడాకారుడు రఫెల్ నాదల్. గతంలో మార్గరెట్ కోర్ట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను 11సార్లు గెలుచుకుంది.

**ఫ్రెంచ్ ఓపెన్ (2019) మహిళల సింగిల్స్ టైటిల్ విజేత ఆష్లీ బార్టీ ఏ దేశానికి చెందిన క్రీడాకారిణి?**

ఎ) ఆస్ట్రేలియా బి) ఫ్రాన్స్
సి) యూఎస్ఏ డి) ఇటలీ

**సమాధానం:** ఎ

- ఆస్ట్రేలియా క్రీడాకారిణి ఆష్లీ బార్టీ జూన్ 8న పారిస్‌లో జరిగిన ఫైనల్లో మార్కెటా వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించి 2019, ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా నిలిచింది. ఇది ఆమెకు కెరీర్లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్. మార్గరెట్ కోర్ట్ (1973) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచిన తొలి ఆస్ట్రేలియా క్రీడాకారిణిగా ఆష్లీ బార్టీ చరిత్ర సృష్టించింది.
- జూన్ 23న ఆష్లీ బార్టీ మహిళల టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో నెం.1 స్థానంలో నిలిచింది. జపాన్ క్రీడాకారిణి నవోమి ఒసాకాను వెనక్కునెట్టి ఆమె అగ్రస్థానంలో నిలిచింది.




**ఎన్.విజయేందర్‌రెడ్డి,**
సీనియర్ ఫ్యాకల్టీ

# నవ్యాంధ్రలో నవశకం

### దేశానికే ఆదర్శం



నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో మహిళలకు 50% రిజర్వేషన్ కల్పించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారు. మహిళల అభ్యున్నతి, సాధికారతపై ఆయనకు గల చిత్తశుద్ధికి ఇది నిదర్శనం.
– పుష్ప శ్రీవాణి, డిప్యూటీ సీఎం

### నిజమైన మహిళా సాధికారతకు నాంది



నిజమైన మహిళా సాధికారత సాధించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప ముందడుగు వేశారు. అన్ని నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 50 శాతం మహిళలకే కేటాయించే బిల్లును ఆమోదింపజేయడం ద్వారా కొత్త చరిత్ర సృష్టించారు. దీనివల్ల రాష్ట్రంలో మహిళలు రాజకీయంగా అన్ని స్థాయిల్లో సమున్నత గౌరవాన్ని పొందుతారు. సీఎం వైఎస్ జగన్‌కు యావత్ మహిళా లోకం తరఫున కృతజ్ఞతలు.
– వి.కళావతి, ఎమ్మెల్యే, పాలకొండ



## అసెంబ్లీ కమిటీల ఏర్పాటుకు ప్రకటన

### ఈనెల 24 వరకు నామినేషన్ల స్వీకరణ

**సాక్షి, అమరావతి:** శాసనసభ ప్రజాపద్దుల సంఘం (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ–పీఏసీ), ప్రజా అంచనాల కమిటీ (పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ–పీఈసీ), ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ–పీయూసీ)ల ఏర్పాటుకు ప్రభుత్వం సోమవారం ఉభయ సభల్లో ప్రకటన చేసింది. ఈ మేరకు శాసనసభలో, శాసనమండలిలో సభానాయకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ వేర్వేరుగా మోషన్లను ప్రవేశపెట్టారు. ఈ మూడు కమిటీల్లో శాసనసభ నుంచి తొమ్మిది మందిని, శాసనమండలి నుంచి ముగ్గురిని ఎంపిక చేస్తారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్లను అసెంబ్లీలో స్పీకర్, మండలిలో చైర్మన్ సోమవారం విడుదల చేశారు. ఈనెల 24వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 25వ తేదీన నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణలకు గడువును 26వ తేదీగా పేర్కొన్నారు. ఎన్నికలు అనివార్యమయితే ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నారు.

## సాక్షి జర్నలిజం ప్రవేశ పరీక్ష తుది ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** ఏడాది పీజీ డిప్లొమా కోర్సు (2019–20) కోసం సాక్షి జర్నలిజం స్కూల్ నిర్వహించిన ప్రవేశ పరీక్ష, బృంద చర్చ, మౌఖిక పరీక్షల అనంతరం తుది ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఫలితాలను sakshieducation.com,sakshischoolofjournalism.com,sakshi.com వెబ్‌సైట్‌లలో చూడవచ్చని ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి తెలిపారు. హాల్ టికెట్ నంబరు ఆధారంగా అక్కడే అడ్మిషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైనవారు ఆగస్టు 1న (గురువారం) సాక్షి స్కూల్ ఆఫ్ జర్నలిజంలో ఉదయం 9.30కి జరిగే కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు.

## ఇవి బాహుబలి నియామకాలు

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**సాక్షి, అమరావతి:** నిరుద్యోగ యువతకు భవిష్యత్ ఇచ్చే సంకల్పంతో భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. సచివాలయంలోని తన చాంబర్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 4.01 లక్షల కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టి రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,114 గ్రామ సచివాలయాలు, 3,786 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కలిపి మొత్తంగా 3,65,561 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. ఇవి బాహుబలి నియామకాలని పేర్కొన్నారు. ఉద్యోగుల ఎంపిక అంతా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు.

## రేణిగుంట వద్ద షావోమీ రెండో ప్లాంటు

### సీఎం వైఎస్ జగన్‌కు సంస్థ ప్రతినిధుల ప్రతిపాదన

**సాక్షి, అమరావతి :** ప్రపంచంలో నాలుగో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి సంస్థ షావోమీ రాష్ట్రంలో తమ రెండో ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చింది. చిత్తూరు జిల్లా రేణిగుంట సమీపంలో ఈ కొత్త ప్లాంటు ఏర్పాటుచేస్తామని ప్రతిపాదించింది. షావోమీ ఇండియా ఎండీ మనుకుమార్ జైన్, ఆ సంస్థ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీకృష్ణన్‌లు సీఎం వైఎస్ జగన్‌తో సోమవారం సమావేశమయ్యారు. దేశంలో తమ సంస్థ కార్యకలాపాల విస్తరణ ప్రాజెక్టుల గురించి వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో చర్చించారు. ఆ సంస్థ ఇప్పటికే చిత్తూరు జిల్లా శ్రీసిటీలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ ప్లాంటు నిర్వహిస్తోంది. ఎలక్ట్రిక్ సైకిళ్లు, ట్రై సైకిళ్లు, స్కూటర్ల తయారీపైనా తమకు ఆసక్తి ఉందని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందిస్తూ.. షావోమీ సంస్థ తయారీ ప్లాంటు నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

# ఆగస్టు వరకు ఆగాల్సిందే!

- ముఖం చాటేసిన నైరుతి రుతుపవనాలు
- 'పసిఫిక్ 'లో ఎల్‌నినో కొనసాగుతుండడమే కారణం
- జాడలేని అల్పపీడనాలు.. వాయుగుండాలు
- మరో నెల రోజుల్లో లానినా అనుకూల పరిస్థితులు
- ఆపై సమృద్ధిగా వర్షాలు



**సాక్షి, అమరావతి బ్యూరో:** ఆశించిన వర్షాల కోసం మరికొన్నాళ్లు ఆగాలా? అవుననే అంటున్నారు వాతావరణ నిపుణులు. నైరుతి రుతుపవనాల ఆగమనం ఆలస్యం కావడమే కాక.. ఆపై అవి ముఖం చాటేయడంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రుతుపవనాలు ప్రవేశించినప్పట్నుంచి మొక్కుబడి వానలే తప్ప విస్తారంగా వర్షాలు కురిసిన పరిస్థితి లేదు. సాధారణంగా జూలై మూడో వారం నాటికి బంగాళాఖాతంలో కనీసం 4–5 అల్పపీడనాలు, 2–3 వాయుగుండాలు ఏర్పడాల్సి ఉంది. అయితే ఇప్పటిదాకా రెండంటే రెండే అల్పపీడనాలు ఏర్పడ్డాయి. అవి కూడా వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడడం వల్ల రాష్ట్రంపై ఏమాత్రం ప్రభావం చూపలేక పోయాయి. నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపక పోవడానికి, వానలు సమృద్ధిగా కురవక పోవడానికి పసిఫిక్ మహా సముద్రంలో ఎల్‌నినో (సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం) కొనసాగుతుండడం కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరో నెల రోజుల నాటికి ఎల్‌నినో న్యూట్రల్ స్థితికి చేరుకుని లానినా (సముద్ర ఉష్ణోగ్రతలు తగ్గడం) పరిస్థితులేర్పడతాయని అమెరికాకు చెందిన క్లైమేట్ ప్రెడిక్షన్ సెంటర్ (సీపీసీ) తాజా అంచనాల్లో స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రంలో ఆగస్టు రెండో వారం నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

**ఎందుకిలా..?**

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో రుతుపవనాల ద్రోణి (మాన్సూన్ ట్రఫ్) హిమాలయాల వైపు వెళ్లిపోయింది. దీంతో అక్కడ (నేపాల్, ఈశాన్య రాష్ట్రాల్లో) భారీ వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులేర్పడి ఖరీఫ్ పంటకు విఘాతం కలిగించాయి. ఈ ద్రోణి వెనక్కి వస్తే మళ్లీ రాష్ట్రంలో వానలకు ఆస్కారం ఉంటుంది. ఇలా వెనక్కి వచ్చి బలపడాలంటే అక్కడ తూర్పు గాలులు ప్రారంభం కావాలి. ఈ పరిస్థితికి మరో రెండు వారాల సమయం పడుతుందని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'తో చెప్పారు. గత ఏడాది కూడా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని, అవి రబీ పంటలకు భరోసానిస్తాయని తెలిపారు.

**ఐదో వంతుకు పైగా లోటు వర్షపాతం..**

జూలై మూడో వారం నాటికి కూడా రాష్ట్రంలో భారీ లోటు వర్షపాతమే (22%) కొనసాగుతోంది. జూన్ ఒకటో తేదీ నుంచి జూలై 22 వరకు కురవాల్సిన వర్షపాతం కంటే ఐదో వంతుకు పైగా లోటు వర్షపాతం నమోదయింది. కోస్తాంధ్రలో 21, రాయలసీమలో 23% కురవాల్సిన దానికంటే తక్కువ వర్షం కురిసింది. 42% లోటుతో పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలోకెల్లా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఉంది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం (+2%) రికార్డయి ఒకింత మెరుగ్గా ఉన్నాయి.

**జిల్లాల వారీ వర్షపాతం ఇలా..**
**(01.06.19 నుంచి 22.07.19 వరకు)**

| జిల్లా | కురిసింది | కురవాల్సింది (మి.మీటర్లలో) | లోటు% |
|---|---|---|---|
| తూర్పుగోదావరి | 229.3 | 273.3 | -16 |
| గుంటూరు | 191.9 | 188.0 | +2 |
| కృష్ణా | 198.8 | 243.6 | -18 |
| నెల్లూరు | 101.9 | 115.1 | -11 |
| ప్రకాశం | 136.3 | 133.2 | +2 |
| శ్రీకాకుళం | 190.3 | 282.4 | -33 |
| విశాఖపట్నం | 154.5 | 248.7 | -38 |
| విజయనగరం | 190.3 | 270.5 | -30 |
| పశ్చిమ గోదావరి | 167.0 | 287.1 | -42 |
| యానాం(పుదుచ్చేరి) | 162.2 | 268.4 | -40 |
| అనంతపురం | 78.2 | 102.9 | -24 |
| చిత్తూరు | 126.6 | 142.6 | -12 |
| కడప | 94.2 | 131.7 | -28 |
| కర్నూలు | 118.1 | 160.6 | -26 |

**సగటు లోటు వర్షపాతం -22%**

## లిఫ్ట్ తెగిపడి ముగ్గురు కార్మికుల మృతి

- రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న భవనంలో ప్రమాదం
- మృతులంతా బిహార్ వాసులు



రాయపూడిలో నిర్మాణంలో ఉన్న ప్రజాప్రతినిధుల భవనం



రాహుల్‌కుమార్



సురేంద్రకుమార్

**సాక్షి, అమరావతి బ్యూరో :** రాజధాని అమరావతిలోని నిర్మాణంలో ఉన్న భవనంలో లిఫ్ట్ తెగిపడిపోయి ముగ్గురు కార్మికులు మృతిచెందారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో ప్రజాప్రతినిధుల కోసం 12 అంతస్తుల భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే 10 అంతస్తుల్లో నిర్మాణం పూర్తవగా.. 11, 12 అంతస్తుల్లో పనులు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం భవనం కింద నుంచి పైకి లిఫ్టులో వెళుతుండగా 5వ అంతస్తుకు చేరుకోగానే లిఫ్టు తెగి కిందకి పడిపోయింది. అందులో ఉన్న ముగ్గురు కార్మికులూ చెల్లాచెదురుగా కింద పడిపోయారు. మిగిలిన కార్మికులు వారిని మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతులు బిహార్‌కు చెందిన రాహుల్ కుమార్ (21), క్రిపాల్ కుమార్(30), సురేంద్ర కుమార్ (50)గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు పోలీసులు చెప్పారు. కాగా, ఈ భవనాలను ఎన్‌సీసీ నిర్మిస్తోంది. నిర్మాణ పనుల్లో భద్రతాచర్యలు తీసుకోకపోవడం వల్ల ఇప్పటికే ముగ్గురు మృతి చెందారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా.. నిర్మాణ సంస్థలు నిర్లక్ష్యాన్ని వీడటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## బ్రేక్ దర్శనాల వ్యాజ్యంపై శుక్రవారం ఉత్తర్వులిస్తాం

### స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
### కొన్ని పత్రికల్లో తప్పుడు కథనాలపై ఆగ్రహం

**సాక్షి, అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానాల్లో (టీటీడీ) బ్రేక్ దర్శనాలను నిలువరించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో శుక్రవారం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణ మూర్తిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. తిరుమలలో బ్రేక్ దర్శనాలను అడ్డుకోవాలని కోరుతూ ప్రకాశం జిల్లాకు చెందిన వెంకట సుబ్బారావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, ఈ కేసుకు సంబంధించి కోర్టులో జరుగుతున్న దానికి, కొన్ని పత్రికల్లో వస్తున్న కథనాలకు ఏ మాత్రం పొంతన లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులో జరగని విషయాలను జరిగినట్లు కొన్ని పత్రికలు మొదటి పేజీల్లో రాస్తున్నాయని, ఇటువంటి వాటిని క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఇక సోషల్ మీడియాలో వస్తున్న కథనాలకు అడ్డూ అదుపే లేదని, తాము ఎటువంటి ఉత్తర్వులు, ఆదేశాలు ఇవ్వకపోయినా కూడా, ఇచ్చినట్లు, ఫలానా ఆదేశాలు ఇస్తున్నట్లు రాస్తున్నారని ఆక్షేపించింది. సోషల్ మీడియా కథనాల వెనుక ఎవరున్నారో తెలుసుకోవాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్‌కు సూచించింది.

## జీవో 38 అమలుపై మీ వైఖరేమిటి? : హైకోర్టు

**సాక్షి, అమరావతి:** రైతు రుణమాఫీకి సంబంధించిన నాలుగైదు విడతల మొత్తాల విడుదలకు ఉద్దేశించిన జీవో 38 అమలు విషయంలో వైఖరి ఏమిటో తెలియచేయాలని హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలను తమ ముందుంచాలంటూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో 38ని అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ జెట్టి గురునాథరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

**జాతీయం/అంతర్జాతీయం**

## చెప్పిందే చేస్తున్నాం

- ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం
- 50 రోజుల పాలనపై నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** సత్వర అభివృద్ధి, సంస్కరణల వేగవంతంపై ప్రజలకిచ్చిన హామీ మేరకు ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ఈసారి కార్యాచరణలో వేగం పెరిగిందని పేర్కొంది. మోదీ ప్రభుత్వ 50 రోజుల పాలనపై సోమవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ 'నివేదిక పత్రం' విడుదల చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సంస్కరణల్లో వేగం, అందరికీ సంక్షేమం, న్యాయం వంటి విషయాల్లో మొదటి విడత పాలనతో పోలిస్తే ఈసారి ప్రధాని మోదీపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. దేశం రూ.344 లక్షల కోట్ల (5 ట్రిలియన్ డాలర్ల) ఆర్థిక వ్యవస్థగా అవతరించడం కేవలం కల మాత్రమే కాదు, దానిని సాకారం చేసుకునేందుకు రోడ్‌మ్యాప్ రూపుదిద్దుకుంది. ప్రభుత్వం మొదటి విడత పాలనలో సాధించిన విజయాల ఆధారంగా ఈసారి మరిన్ని మంచి ఫలితాలు సాధించనుంది' అని తెలిపారు.

## ఇది అతి గొప్ప ముందడుగు

- చంద్రయాన్–2 విజయవంతంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

**సాక్షి, అమరావతి:** చంద్రయాన్–2 ప్రయోగం విజయవంతం అయినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. అంతరిక్ష రంగంలో ఈ విజయం అతి గొప్ప ముందడుగు అని జగన్ ప్రశంసించారు. ఈ విజయంతో మన దేశం చంద్ర గ్రహంపైకి ప్రయోగాలు చేస్తున్న దేశాల సరసన చేరిందని అన్నారు. చంద్రయాన్–2 ప్రయోగం ద్వారా ఇస్రో ఒక చరిత్రను లిఖించిందని జగన్ శ్లాఘించారు. గవర్నర్ నరసింహన్ కూడా ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు.

# ఆర్టీఐ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- సమాచార కమిషనర్ల పదవీ కాలం, వేతనాన్ని కేంద్రం నిర్ణయించేలా బిల్లు
- ఆర్టీఐని నిర్వీర్యం చేస్తున్నారంటూ తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- కమిషనర్లను ఇంట్లో పనివాళ్లలా మార్చాలనుకుంటున్నారు: ఎ.రాజా



**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీల తీవ్ర అభ్యంతరాల నడుమ సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం సవరణ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)తోపాటు సమాచార కమిషనర్లందరి పదవీ కాలాన్ని, వేతనాన్ని నిర్ణయించే అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకునే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం సమాచార కమిషనర్లుగా నియమితులైన వ్యక్తులు ఐదేళ్ల కాలం పాటు లేదా వారికి 65 ఏళ్ల వయసు నిండే వరకు (ఏది ముందైతే అది) ఆ పదవిలో ఉంటున్నారు. అలాగే ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ)కు ఇస్తున్నంత వేతనమే సీఐసీకి, ఎన్నికల కమిషనర్లకు ఇస్తున్నంత వేతనమే సమాచార కమిషనర్లకు కూడా ఇస్తున్నారు. ఈ రెండు నిబంధనలను మార్చి, సీఐసీ సహా సమాచార కమిషనర్లందరి పదవీ కాలాన్ని, వేతనాన్ని నిర్ణయించే అధికారాన్ని కేంద్రం తన చేతుల్లోకి తీసుకునేలా సవరణ బిల్లు ఉంది. దీంతో సమాచార హక్కు చట్టాన్నే నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేసిందని ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. తాము చెప్పిన మాట వినని సమాచార కమిషనర్లను వెంటనే సాగనంపేందుకు, సమాచార కమిషన్‌ను కూడా తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు, దాని స్వతంత్రతను దెబ్బతీసేందుకే కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చిందనీ, లేకపోతే ఇప్పుడు ఈ సవరణలతో పనేంటని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాల అభ్యంతరాల కారణంగా లోక్‌సభలో స్పీకర్ ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించారు. 218 మంది సభ్యులు అనుకూలంగా, 79 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటేశారు. అనంతరం విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేయడంతో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది.

**మోదీ విద్యార్హతలు చెప్పమన్నందుకేనా?**

బిల్లుపై చర్చను కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ వ్యవస్థను నీరుగార్చేందుకు కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఈ బిల్లును తెచ్చిందనీ, కేంద్రం దీనిని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాక్షేత్రంలో ఎలాంటి చర్చా జరగకుండానే కేంద్రం ఈ బిల్లును తెచ్చిందనీ, ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హత వివరాలు చెప్పాల్సిందేనని గతంలో ఓ సమాచార కమిషనర్ పీఎంవోను ఆదేశించినందున, వారి అధికారాలకు కోత పెట్టేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారా అని శశిథరూర్ ప్రశ్నించారు. ప్రతిపక్ష డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఎంఐఎంలతోపాటు బిజూ జనతా దళ్ వంటి పార్టీలు కూడా ఈ బిల్లును వ్యతిరేకించాయి. లోక్‌సభలో తనకున్న 303 మంది ఎంపీల బలాన్ని చూసుకుని ఆర్టీఐ స్ఫూర్తినే కేంద్రం చంపేస్తోందని కార్తీ చిదంబరం అన్నారు. ఆర్టీఐ వ్యవస్థ కోరలు పీకి, సమాచార కమినర్లను తమ ఇళ్లలో పని వాళ్లలా మార్చుకోవాలని కేంద్రం చూస్తోందని డీఎంకే ఎంపీ ఎ.రాజా వ్యాఖ్యానించారు.

**పార్లమెంటు ఇతర సమాచారం..**

- భారత వైద్య మండలి (ఎంసీఐ) స్థానంలో జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ ప్రవేశపెట్టారు.
- అనేక బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున ప్రస్తుత పార్లమెంటు సమావేశాలను మరో వారం రోజులపాటు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మంగళవారం జరిగే బీఏసీ సమావేశంలో దీనిపై అధికారిక నిర్ణయం తీసుకోనున్నారని విశ్వసనీయ వర్గాలు చెప్పాయి. ప్రస్తుత ప్రణాళిక ప్రకారం రానున్న శుక్రవారంతో పార్లమెంటు సమావేశాలు ముగియాల్సి ఉంది.

**బిల్లుపై కేంద్రం మాట..**

స్వతంత్ర భారతంలో అత్యంత విజయవంతమైన చట్టాల్లో సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం ఒకటి. తమకు అవసరమైన సమాచారం కోసం ప్రభుత్వాధికారుల్ని ప్రశ్నించగలిగే అధికారాన్ని ఈ చట్టం సామాన్యులకు ఇస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ఏడాదికి దాదాపు 60 లక్షల దరఖాస్తులు దాఖలవుతున్నాయి. అయితే తాజాగా కేంద్రం తెచ్చిన సవరణలతో ఆర్టీఐ వ్యవస్థ స్వయం ప్రతిపత్తి పోయి, అది నిర్వీర్యం అవుతుందని ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. దీనికి కేంద్రం సమాధానం చెబుతూ విపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా తామేమీ చేయడం లేదనీ, కేవలం ఆ చట్టంలోని కొన్ని లోటుపాట్లను మాత్రమే సరిచేస్తున్నామంటోంది. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ కాగా, ఆర్టీఐ వ్యవస్థ శాసనం ద్వారా ఏర్పాటైంది. అయితే వేతనాలు మాత్రం ఎన్నికల కమిషనర్లు, సమాచార కమిషనర్లకు ఒకేలా ఉండటంతో దానిని తాము హేతుబద్ధీకరిస్తున్నామని అంటోంది. అలాగే ప్రస్తుతం కేంద్ర సీఐసీకి సుప్రీంకోర్టు జడ్జితో సమానమైన హోదా ఇస్తున్నప్పటికీ, సీఐసీ ఇచ్చిన తీర్పులను హైకోర్టులో సవాలు చేసే వీలు ఉండటం సమంజసంగా లేదనీ, ఇలాంటి లోటుపాట్లను సవరించడమే తాజా బిల్లు ఉద్దేశమని ప్రభుత్వం వివరిస్తోంది.

# నేడే బల నిరూపణ!

- కర్ణాటక అసెంబ్లీని మంగళవారానికి వాయిదా వేసిన స్పీకర్ రమేశ్ కుమార్
- సాయంత్రం 4 గంటలకు బలపరీక్ష నిర్వహించాలని నిర్ణయం
- అసెంబ్లీలో కాంగ్రెస్–జేడీఎస్ సభ్యుల ఆందోళన, సభ పలుమార్లు వాయిదా
- 15 మంది రెబెల్ ఎమ్మెల్యేలతో నేడు భేటీ కానున్న స్పీకర్ రమేశ్



సోమవారం విధానసౌధలో మాట్లాడుతున్న మంత్రి డీకే శివకుమార్

**సాక్షి, బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటక అసెంబ్లీ 'విధానసౌధ'లో సోమవారం హైడ్రామా నెలకొంది. విశ్వాసపరీక్షను చేపట్టేందుకు తమకు బుధవారం వరకూ గడువు ఇవ్వాలని ముఖ్యమంత్రి కుమారస్వామి స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన స్పీకర్ రమేశ్ కుమార్ ఛాంబర్‌కు వెళ్లి విజ్ఞప్తి చేశారు. అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ సోమవారం విశ్వాసపరీక్షపై ఓటింగ్ జరగాల్సిందేనని స్పీకర్ రమేశ్ కుమార్ స్పష్టం చేశారు. 'ఇప్పటికే పలుమార్లు గడువు ఇచ్చాం. మళ్లీ ఇవ్వాలంటే కుదరదు. నా పరిస్థితిని కూడా మీరు అర్థం చేసుకోవాలి. నేడు విశ్వాస పరీక్ష నిర్వహించాల్సిందే' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలంటూ కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగడంతో అసెంబ్లీ రెండుసార్లు వాయిదాపడింది. చివరికి స్పీకర్ రమేశ్ కుమార్ అసెంబ్లీని మంగళవారానికి వాయిదా వేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రారంభమవుతుందనీ, బలపరీక్షను సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తామని ప్రకటించారు. సాయంత్రం 6గంటల్లోపు ఈ ప్రక్రియ మొత్తం పూర్తైపోతుందని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్–జేడీఎస్ సభ్యుల ఆందోళన..**

విధానసౌధ సోమవారం గంట ఆలస్యంగా ప్రారంభం కాగానే బీజేపీ సభ్యుడు మధుస్వామి మాట్లాడుతూ.. నేడు ఎలాగైనా విశ్వాసపరీక్షపై ఓటింగ్ నిర్వహించాలని స్పీకర్‌ను కోరారు. 'విశ్వాసపరీక్షపై చర్చను సోమవారం నాటికి ముగించి బలపరీక్షను చేపడతామని సీఎం కుమారస్వామి, సీఎల్పీ నేత సిద్దరామయ్య అసెంబ్లీలో చెప్పారు. వారి మాటలను మేం నమ్మాం. మీ(స్పీకర్) ఆదేశాలను గౌరవించాం. కాబట్టి విశ్వాసపరీక్షపై ఇక ఎంత మాత్రం ఆలస్యం చేయొద్దు' అని మధుస్వామి కోరారు. అనంతరం కాంగ్రెస్ నేత, మంత్రి బైరె గౌడ స్పందిస్తూ.. 'విశ్వాసపరీక్షను బుధవారానికి వాయిదా వేయాల్సిందిగా స్పీకర్‌ను కోరుతున్నా. రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామాలపై ఓ నిర్ణయం తీసుకోకుండా బలపరీక్ష చేపడితే సభ పవిత్రతే దెబ్బతింటుంది. ఎమ్మెల్యేలు చేసిన రాజీనామాలు స్వచ్ఛందమా? ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం కాదా? దేశంలో ప్రతిపక్షాన్ని ఓ ప్రణాళికతో బీజేపీ నిర్మూలిస్తోంది. ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోంది. ప్రజాస్వామ్యపు రక్త బీజేపీ చేతులకు అంటుకుంది' అని ఘాటుగా విమర్శించారు. అయితే చర్చ ముగిసినవెంటనే బలపరీక్ష చేపడతామని స్పీకర్ రమేశ్ ప్రకటించడంతో కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు 'మాకు న్యాయం కావాలి' 'విశ్వాస పరీక్షపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలి' అంటూ సభలో ఆందోళనకు దిగారు.

**సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్..**

సీఎం కుమారస్వామి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ సోమవారం డిమాండ్ చేసింది. సోమవారం ఫేస్‌బుక్‌లో బీజేపీ స్పందిస్తూ..'కుమారస్వామికి నిజంగా కర్ణాటక ప్రజలపై, భారత రాజ్యాంగంపై నమ్మకముంటే వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోవాలి' అని పోస్ట్ చేసింది. కర్ణాటక ప్రజలు కుమారస్వామిని క్షమించబోరని స్పష్టం చేసింది. కాగా, సీఎం పదవిని త్యాగం చేసేందుకు సీఎం కుమారస్వామి ఒప్పుకున్నా, జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని దేవెగౌడ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. సీఎం పదవిని వీడరాదని దేవెగౌడ ఆయనకు సూచించినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. మరోవైపు కుమారస్వామి రాజీనామా చేశారంటూ ఓ లేఖ సోషల్‌మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. అయితే ఇది నకిలీ లేఖ అని జేడీఎస్ వర్గాలు స్పష్టం చేశాయి. రాజీనామా విషయాన్ని ఖండించిన సీఎం కుమారస్వామి, ఈ వ్యవహారంపై విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు.

**స్వతంత్రులకు సుప్రీంలో నిరాశ..**

కర్ణాటక స్వతంత్ర ఎమ్మెల్యేలు ఆర్.శంకర్, హెచ్.నగేశ్‌లకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. సోమవారం సాయంత్రం 5 గంటల్లోపు అసెంబ్లీలో విశ్వాసపరీక్షను నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని వీరిద్దరు దాఖలుచేసిన పిటిషన్‌ను తక్షణం విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. స్వతంత్రుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ..'కర్ణాటకలో బలపరీక్షను ఏదో ఒక కారణం చెప్పి వాయిదా వేస్తున్నారు. కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయినా అధికారంలో కొనసాగుతోంది. అసెంబ్లీలో విశ్వాసపరీక్షను చేపట్టేలా ఆదేశించండి' అని కోరారు. దీంతో సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం స్పందిస్తూ..'అసాధ్యం. మేం ఇంతకుముందెప్పుడు ఇలా చేయలేదు. ఈ పిటిషన్‌ను మంగళవారం పరిశీలిస్తాం' అని స్పష్టం చేసింది.

**అర్ధరాత్రయినా అసెంబ్లీలోనే ఉంటాం: యడ్యూరప్ప**

కర్ణాటక అసెంబ్లీని వాయిదావేస్తామంటే ఒప్పుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత బీఎస్ యడ్యూరప్ప తెలిపారు. 'సీఎం కుమారస్వామి, సీఎల్పీ నేత సిద్దరామయ్య ఇచ్చినమాట మేరకు సోమవారం విశ్వాసపరీక్ష నిర్వహించాలి. ఇందుకోసం అర్ధరాత్రివరకైనా వేచిఉంటాం. అంతేతప్ప సభను వాయిదా వేస్తామంటే ఒప్పుకోం. విశ్వాసపరీక్ష సమయాన్ని ఇప్పటికే రెండు సార్లు మార్చారు. ఒకవేళ మాకు అసెంబ్లీలో న్యాయం జరగకుంటే గవర్నర్ వజూభాయ్‌వాలాతో భేటీ అవుతాం. బలపరీక్షపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు' అని యడ్యూరప్ప స్పష్టం చేశారు.

**బలిపశువును చేయొద్దు: స్పీకర్**

అధికార పక్ష సభ్యుల ఆందోళనతో స్పీకర్ రమేశ్ సహనం కోల్పోయారు. 'ప్రతీఒక్కరూ మనల్ని గమనిస్తున్నారు. ఇలాంటి చర్యలు సభకు ఎంతమాత్రం శోభనివ్వవు. మనం ప్రజా జీవితంలో ఉన్నాం. చర్చల పేరుతో సమయాన్ని వృధా చేస్తున్నామన్న అభిప్రాయం ఏర్పడితే అది నాతో పాటు ఎవ్వరికీ మంచిది కాదు. ఈ వ్యవహారంలో నన్ను బలిపశువును చేయవద్దు. చర్చను వీలైనంత త్వరగా ముగించి బలపరీక్షను చేపడతాం' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత సిద్దరామయ్య మాట్లాడుతూ.. విప్‌ల జారీవిషయంలో సుప్రీంకోర్టు జూలై 17న ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా రూలింగ్ ఇవ్వాలని కోరారు. రెబెల్ ఎమ్మెల్యేలు ఈ తీర్పును బూచీగా చూపి విశ్వాసపరీక్షకు గైర్హాజరవుతారని చెప్పారు. దీంతో స్పీకర్ రమేశ్ కుమార్ స్పందిస్తూ..'విప్ జారీచేయడం అన్నది రాజకీయ పార్టీల హక్కు. వాటిని పాటించడం, పాటించకపోవడం అన్నది ఎమ్మెల్యేల ఇష్టం. ఒకవేళ ఎవరైనా ఎమ్మెల్యే విప్‌ను పాటించలేదని నాకు ఫిర్యాదు అందితే, నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణయం తీసుకుంటాను' అని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు తనను కలుసుకోవాల్సిందిగా రెబెల్ ఎమ్మెల్యేలను ఆదేశించినట్లు చెప్పారు.

# నిప్పులు చిమ్ముతూ...

## దిగ్విజయంగా నింగిలోకి చంద్రయాన్-2



### చందమామ కథ ఇదీ..

### చందమామ అందింది ఇలా..



అంతరిక్షంపై పట్టు బిగించడానికి అమెరికా గట్టి ప్రయత్నాలే చేసింది. అపోలో మిషన్ ద్వారా చంద్ర లోకంపైకి తొలి అడుగు వేసింది. ప్రాజెక్టు జెమినీ ప్రారంభించి అపోలోకు సాంకేతికపరంగా కొత్త హంగులు అద్దడానికి కృషి చేసింది. మొదట్లో అపజయాలు ఎదురైనా కుంగిపోలేదు. అపోలో-1 ప్రయోగం విఫలమై ముగ్గురు వ్యోమగాములు మృతి చెందారు. ఆ తర్వాత మరిన్ని పరిశోధనలు చేసింది. మొత్తంగా 6,300 టెక్నాలజీలపై ఆధిపత్యం సాధించింది. సరిగ్గా యాభై ఏళ్ల క్రితం అపోలో-11ను ప్రయోగించింది. 1969 జూలై 16న నాసా కేప్ కేనర్‌వాల్ అంతరిక్ష కేంద్రం నుంచి శాటర్న్-5 రాకెట్ ద్వారా అపోలో-11 నింగికి ఎగిసింది. ఈ ప్రయోగం జరిగిన 3 రోజుల తర్వాత అపోలో-11 జాబిల్లి కక్ష్యలోకి ప్రవేశించింది. జూలై 20న జాబిల్లిపై నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ తొలి అడుగు వేశారు. ఆ తర్వాత ఆరు గంటల పైగా తేడాతో లూనార్ మాడ్యూల్ పైలట్ బజ్ ఆల్డ్రిన్ జాబిల్లిపైకి దిగారు. ఇద్దరు వ్యోమగాములు జాబిల్లిపై 21.38 గంటలు గడిపారు. 21.7 కేజీల మట్టి, రాతి నమూనాలను సేకరించారు. జూలై 22న లూనార్ మాడ్యూల్‌ను విడుదల చేసిన తర్వాత అపోలో భూమికి తిరుగు ప్రయాణమైంది. 1969 జూలై 24న ఇద్దరు వ్యోమగాములు సురక్షితంగా భూమికి వచ్చారు.



ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తున్న మోదీ

## భారత సంకల్పానికి నిదర్శనం

### ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** చంద్రయాన్-2 ప్రయోగం మన శాస్త్రవేత్తల శక్తిసామర్థ్యాలను, శాస్త్రరంగంలో కొత్త లక్ష్యాలను సాధించాలన్న 130 కోట్ల మంది దేశ ప్రజల సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని ట్విట్టర్ ద్వారా ఈ ప్రయోగంలో పాలు పంచుకున్నవారందరికీ ఆడియో మెసేజ్‌లో శుభాకాంక్షలు తెలిపారు. 'చంద్రయాన్-1 ప్రయోగంలో ఏర్పడిన అవాంతరాలను శాస్త్రవేత్తలు అధిగమించారు. ఈ ప్రయోగం ద్వారా వారి పట్టుదల, సంకల్పం మరోసారి రుజువయ్యాయి. ప్రతి భారతీయుడు ఎంతో గర్వపడుతున్నాడు' అని పేర్కొన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా భారత్‌కు కొత్త ఉత్సాహం వచ్చింది. చంద్రుని గురించిన మరెన్నో విషయాలు తెలిసే అవకాశాలున్నాయి..ఇప్పటి వరకు ఎవరూ చేపట్టని విధంగా చంద్రుని దక్షిణ ధ్రువప్రాంతంపై అధ్యయనం జరగనుంది. ఘనమైన మన దేశ చరిత్రలో ఇది చాలా ప్రత్యేకమైన సమయం' అని పేర్కొన్నారు. భారీ టీవీ స్క్రీన్‌పై చంద్రయాన్-2 ఉపగ్రహం ప్రయోగాన్ని తిలకిస్తున్నట్లు ఉన్న తన ఫొటోలను కూడా ప్రధాని జత చేశారు. ట్విట్టర్ ఆడియో సందేశంలో ప్రధాని.. ఇస్రో చైర్మన్ కె.శివన్‌తోపాటు శాస్త్రవేత్తల బృందానికి ప్రధాని అభినందనలు తెలిపారు. నైపుణ్యం, సామర్థ్యం, ఆత్మవిశ్వాసం కలిగిన మన శాస్త్రవేత్తలు ఎలాంటి సవాల్‌నైనా స్వీకరిస్తారనేందుకు ఇది గొప్ప ఉదాహరణ అని తెలిపారు. 'సవాల్ ఎంత పెద్దదైతే, పట్టుదల కూడా అంతే ఉంటుంది. ప్రయోగం వారం ఆలస్యమైనా సరే, చంద్రయాన్-2 చంద్రుని చేరాలనే లక్ష్యం మాత్రం మారలేదు. ఈ ప్రయోగం ద్వారా చంద్రునిపైకి మొట్టమొదటి భారతీయ ఉపగ్రహం చేరనుంది. అలాగే, చంద్రునిపైకి చేరనున్న నాలుగో దేశం భారత్ కానుంది' అని పేర్కొన్నారు.

**శ్రీహరికోట (సూళ్లూరుపేట)/సాక్షి ప్రతినిధి, అమరావతి**

చంద్రుణ్ని చేరుకునే ప్రయాణంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో మైలురాయిని అందుకుంది. బాహుబలిగా పిలిచే, 640 టన్నుల బరువుండే జీఎస్ఎల్వీ-మార్క్3-ఎం1 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను విజయవంతంగా భూ కక్ష్యలోకి ఇస్రో ప్రవేశపెట్టింది. 3,850 కేజీల బరువున్న చంద్రయాన్-2ను సోమవారం మధ్యాహ్నం 2.43 గంటలకు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో వేదిక నుంచి నింగికి పంపారు. ప్రయోగం సమయంలో మేఘావృతమై ఉన్న ఆకాశంలోకి రాకెట్ నారింజ, పసుపు వర్ణాల్లో నిప్పులు చిమ్ముతూ ఎగిరింది. సరిగ్గా 16.14 నిమిషాల్లో చంద్రయాన్-2 మాడ్యూల్‌ను భూ కక్ష్యలోకి రాకెట్ ప్రవేశపెట్టినట్లు ఇస్రో ప్రకటించింది. ప్రయోగం సమయంలో ఎంతో ఉత్కంఠతో ఊపిరిబిగబట్టుకుని కూర్చున్న శాస్త్రవేత్తలు, తొలిదశ విజయవంతమైందన్న ప్రకటనతో ఒక్కసారిగా హర్షధ్వానాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు. ప్రయోగం సక్సెస్ కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలకు దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 15న తెల్లవారుజామున 2.51 గంటలకే చంద్రయాన్-2 ప్రయోగం జరగాల్సి ఉండగా.. రాకెట్‌లోని మూడో దశ క్రయోజనిక్‌లో పోగో గ్యాస్ బాటిల్స్ నుంచి క్రయోఇంజిన్ ట్యాంక్‌కు వెళ్లే పైపులు బయట ప్రాంతంలో లీకేజిని గుర్తించి ప్రయోగాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇస్రో శాస్త్రవేత్తలు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని 24 గంటల్లోనే లోపాన్ని సరిచేశారు. 48 రోజుల పాటు లక్షల కిలోమీటర్ల ప్రయాణం అనంతరం సెప్టెంబర్ 7న ఈ ఉపగ్రహం జాబిల్లిపై అడుగుమోపనుంది.

### టెన్షన్.. టెన్షన్

చంద్రుడిపైకి మొట్టమొదటిగా ఆర్బిటర్ ద్వారా ల్యాండర్, ల్యాండర్‌లో అమర్చిన రోవర్ ప్రయోగం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలందరిలో ఎడతెగని టెన్షన్.. ఈ భారీ ప్రయోగంపైనే అందరి ధ్యాస. ఆదివారం సాయంత్రం 6.43 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ 20 గంటలు ముగిసే సమయం దగ్గర పడింది. షార్‌లోని మీడియా సెంటర్, మిషన్ కంట్రోల్ సెంటర్‌లోని మైక్‌లలో 6.. 5.. 4.. 3.. 2.. 1.. 0 అనగానే ఒక్కసారిగా అందరి కళ్లు తూర్పు దిక్కున ఆకాశం వైపునకు మళ్లాయి. క్షణాల్లో ఆకాశంలో కమ్ముకున్న మబ్బులను చీల్చుకుంటూ జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 ఉపగ్రహ వాహకనౌక చంద్రయాన్-2ను మోసుకుని నింగివైపుకెళ్లింది. మిషన్ కంట్రోల్‌రూంలోని శాస్త్రవేత్తలు కంప్యూటర్లను ఆపరేట్ చేస్తూ రెప్ప వాల్చకుండా రాకెట్ గమనాన్ని పరిశీలిస్తున్నారు. ఒక్కో దశ విజయవంతంగా దూసుకుపోవడంతో శాస్త్రవేత్తల వదనాల్లో చిరునవ్వులు. ఇలా మూడు దశలను సమర్థవంతంగా పూర్తి చేశారు. చంద్రయాన్-2ను నిర్దేశిత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. దీంతో మిషన్ కంట్రోల్‌రూంలోని శాస్త్రవేత్తల్లో విజయగర్వం తొణికిసలాడింది. చంద్రయాన్-2 భూ కక్ష్యలోకి చేరిందనీ, అంతా సవ్యంగా సాగుతోందని బెంగళూరులోని ఇస్రో మాస్టర్ కంట్రోల్ సెంటర్ ప్రకటించింది.శ్రీహరికోట నుంచి చేసిన అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో 75వ సారి ప్రయోగాన్ని కూడా విజయవంతంగా నిర్వహించింది.

### ప్రయోగం ఇలా జరిగింది..

మొత్తం 3,850 కేజీల బరువైన చంద్రయాన్-2 మిషన్‌లో 2,379 కేజీల బరువైన ఆర్బిటర్, 1,471 కిలోల బరువు కలిగిన ల్యాండర్ (విక్రమ్), 27కేజీల బరువైన రోవర్ (ప్రజ్ఞాన్) ఉన్నాయి. ఇందులో మొత్తంగా 13 పేలోడ్లు ఉండగా, వాటిలో 3 యూరప్‌వి, రెండు అమెరికావి, ఒకటి బల్గేరియాది. నాసాకు చెందిన లేజర్ రెట్రోరిఫ్లెక్టర్ ఎరే (ఎల్ఆర్ఏ) కూడా వాటిలో ఓ పే లోడ్. జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 రాకెట్ మొదటి దశలో ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్-200 బూస్టర్ల సాయంతో నింగికి తన ప్రయాణాన్ని దిగ్విజయంగా ప్రారంభించింది. ఈ దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 132.7 సెకన్లలో మొదటి దశను పూర్తి చేశారు. రెండో దశలో ఎల్-110 అంటే ద్రవ ఇంజిన్ మోటార్లు 110.84 సెకన్లకే స్టార్ట్ అయ్యాయి. 205 సెకన్లకు రాకెట్ శిఖరభాగాన అమర్చిన చంద్రయాన్-2 మిషన్‌కు ఉన్న హీట్‌షీల్డ్స్ విజయవంతంగా విడిపోయాయి. ఇక్కడ 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి 307 సెకన్లకు రెండో దశను కూడా విజయవంతంగా పూర్తి చేశారు. క్రయోజనిక్ (సీ-25) మోటార్లు 311.22 సెకన్లకు మండించి 978 సెకన్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి మూడో దశను పూర్తి చేశారు. ఈ దశ నుంచి రాకెట్‌కు శిఖర భాగాన అమర్చిన త్రీ-ఇన్-ఒన్ చంద్రయాన్-2 మిషన్‌ను క్రయోజనిక్ దశతో 978.8 సెకన్లకు (16.55 నిమిషాల వ్యవధిలో) భూమికి దగ్గరగా (పెరిజీ) 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా (అపోజీ) 40,000 కి.మీ. ఎత్తులో హైలీ ఎసిన్‌ట్రిక్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. రాకెట్ గమన తీరు అత్యంత సజావుగా సాగడంతో అపోజీని మరో 6,000 కి.మీ. దూరం ముందుకు పంపించి జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ తన సత్తాను చాటుకుంది. అంటే 46,000 కి.మీ. దూరంలోకి తీసుకెళ్లారు. దీనివల్ల చంద్రయాన్-2 కాలపరిమితి పెరగడమే కాకుండా ఆర్బిట్ రైజింగ్ ప్రక్రియ తగ్గింది. దీంతోచంద్రయాన్-2లో ఉన్న ఇంధనం కూడా ఆదా అయ్యి దాని జీవిత గమనం పెరిగిందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఇప్పటినుంచి చంద్రుడిపైకి వెళ్లే వరకు మిషన్‌ను బెంగళూరులోని మాస్టర్ కంట్రోల్ సెంటర్‌లోనే పూర్తి చేస్తారు.

### ఆ 15 నిమిషాలు...

చంద్రయాన్-1లో ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్నే చంద్రయాన్-2లోనూ ఉపయోగించారు. అయితే ఇందులో ల్యాండర్‌ను చంద్రుడిపై దించే ప్రక్రియను కొత్తగా రూపొందించారు. ఇప్పటి దాకా ఇలాంటి ల్యాండింగ్ ఎవరూ చేయలేదు. ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయే కీలకమైన సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతాయోనని ఇస్రో శాస్త్రవేత్తల్లో కొంత ఆందోళన నెలకొని ఉంది. ఈ 15 నిమిషాల సమయాన్ని అధిగమించేందుకు ఈ ప్రయోగంలో ఇస్రో మొదటిసారిగా థొరెటల్-అబల్ అనే లిక్విడ్ ఇంజిన్‌లను ఉపయోగించనున్నారు. చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ మృదువైన చోట ల్యాండ్ అయిన తరువాత ల్యాండర్ తలుపులు తెరుచుకోకుంటే ల్యాండర్ తలుపు బయటకొచ్చేలా డిజైన్ చేశారు. ల్యాండర్ నుంచి రోవర్ చంద్రుడి ఉపరితలంపై రావడానికి 4 గంటల సమయం తీసుకుంటుంది. తొలిసారిగా చంద్రుని దక్షిణ ధృవంపై అడుగుపెడుతున్న దేశంగా భారత్ రికార్డులకు ఎక్కనుంది.

### 14 రోజుల్లో 500 మీటర్లు

రోవర్ సెకెండ్‌కు ఒక సెంటీమీటర్ వేగంతో కదులుతుంది. రోవర్ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. చంద్రుడిపై ఒక రోజు అంటే భూమి మీద మనకు 14 రోజులు. ఈ 14 రోజుల్లో 500 మీటర్ల దూరం ప్రయాణించి చంద్రుడి ఉపరితలంపై మూలాలను పరిశోధించి భూ నియంత్రిత కేంద్రానికి సమాచారాన్ని చేరవేస్తుంది. ఇప్పటిదాకా చంద్రుడిపై పరిశోధనలు చేసే దేశాల్లో భారత్ నాలుగోది.ఇప్పటి వరకూ రష్యా, అమెరికా, చైనాలకు చెందిన అంతరిక్ష సంస్థలు మాత్రమే ఇలాంటి ప్రయోగాలు చేశాయి. ఇప్పుడు చంద్రయాన్-2 పేరుతో చంద్రుడి ఉపరితలంపైకి ఆర్బిటర్ ద్వారా ల్యాండర్‌ను, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపించే నాలుగోదేశంగా నిలిచింది. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనాలు ఈ ఘనత సాధించాయి. మూడింటిని ఒకేసారి పంపిస్తున్నారు కనుక దీన్ని త్రీ ఇన్ ఒన్ ప్రయోగంగా ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

### చంద్రుడిపైకి ఇలా...

ముందుగా 16 రోజుల్లో ఆర్బిటర్‌లో నింపిన ఇంధనాన్ని మండించి అపోజీని 46,000 కి.మీ. నుంచి 1,41,000 కి.మీ.కు పెంచేందుకు ఆర్బిటర్‌ను మండించి 4సార్లు కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపడతారు. ఐదోసారి ఆర్బిటర్‌కు ట్రాన్స్‌లూనార్ ఇంజెక్షన్ ద్వారా చంద్రుడివైపు ప్రయాణం చేసేందుకు మళ్లిస్తారు. అనంతరం చంద్రుని చుట్టూ కక్ష్య ఏర్పరిచేందుకు చంద్రునికి చుట్టూ రెట్రోబర్న్ చేసి వంద కి.మీ. వృత్తాకార కక్ష్యను తగ్గించడానికి 4సార్లు ఆపరేషన్ చేపడతారు. 100 కి.మీ. నుంచి 30 కి.మీ. ఎత్తుకు తగ్గించుకుంటూ ఆర్బిటర్‌ను మండిస్తారు. ఆ తరువాత ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి మీదకు ప్రయాణం చేస్తుంది. ఆ తర్వాత ల్యాండర్‌ను 15 నిమిషాలు మండించి చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో మృదువైన ప్రదేశంలో నెమ్మదిగా దించే ప్రక్రియను చేపడతారు.



## శాస్త్రవేత్తలకు పార్లమెంట్ అభినందనలు

చంద్రయాన్-2ను విజయవంతంగా ప్రయోగించడం ద్వారా దేశ చరిత్రలో సువర్ణాధ్యాయం ప్రారంభించిన ఇస్రో శాస్త్రవేత్తలను పార్లమెంట్ అభినందించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ అంతరిక్ష ప్రయోగాల్లో భారత దేశం ఆధిక్యత మరోసారి రుజువైందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. 'మన శాస్త్రవేత్తలు సాధించిన ఘనత దేశానికి గర్వకారణం. భారత శాస్త్రవేత్తలకు, ఇందుకు తోడ్పాటు అందించిన ప్రధాని మోదీకి అభినందనలు' అని స్పీకర్ అన్నారు. దేశీయ పరిజ్ఞానంతో చంద్రయాన్-2 ప్రయోగాన్ని విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులంతా బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తంచేశారు.

### నెహ్రూను గుర్తు చేసుకోవాల్సిన సమయం: కాంగ్రెస్

చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతంపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ ఘనత తమ పాలనతోనే సాధ్యమైందని కాంగ్రెస్ అంటుండగా, భవిష్యత్తు నాయకత్వం కనిపించనప్పుడు గతాన్ని తవ్వుకోవడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని బీజేపీ తిప్పికొట్టింది. చంద్రయాన్-2పై కాంగ్రెస్ పార్టీ ..'ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను గుర్తు చేసుకోవాల్సిన మంచి సమయమిది. అంతరిక్ష పరిశోధనలకు గాను 1962లో ఆయన ఏర్పాటు చేసిన ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ అనే సంస్థను ఆ తర్వాత ఇస్రోగా పేరు మార్చారు. అలాగే, ప్రధాని మన్మోహన్‌సింగ్ 2008లో చంద్రయాన్-2కు ఆమోదం తెలిపారు' అని తెలిపింది. దీనిపై బీజేపీ ప్రతినిధి సంబిత్ పాత్ర మండిపడ్డారు. 'ఇది నిజంగా దిగజారుడుతనం. ప్రతి ఒక్కరూ గర్వించాల్సిన ఈ క్షణాన్ని రాజకీయం చేయడం తగదు' అని పేర్కొన్నారు.

## అందరి చూపూ ఇక సెప్టెంబర్ 7 వైపు!

**హమ్మయ్యా...!**

*ఒక ఘట్టం ముగిసింది.*
*చంద్రయాన్ -2 ప్రయోగం విజవంతమైంది. ఇంకేముంది..*
*అంతా హ్యాపీయేనా?. ఊహూ..*
*అస్సలు కాదు.*
*ఇస్రోకు అసలు పరీక్ష ముందుంది.*
*కచ్చితంగా చెప్పాలంటే సెప్టెంబరు 7వ తేదీన!*
*ఆ రోజు ఏం జరగబోతోంది?*



*చక్కగా వేసిన రహదారిపై వాహనాన్ని నడపడం చాలా సులువే. రహదారి అస్సలు లేకపోతేనే సమస్య. ఇస్రో పరిస్థితి ఇప్పుడు ఇదే. ఇప్పటివరకూ ఎవ్వరూ చేయని విధంగా జాబిల్లి దక్షిణ ధ్రువ ప్రాంతంలో చంద్రయాన్ -2ను దింపాలన్న ఇస్రో ఆలోచన చాలా సమస్యలతో కూడుకున్నది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ కె.శివన్ స్వయంగా అంగీకరించారు కూడా. జూలై 22న నింగికి ఎగసిన చంద్రయాన్ -2 ముందుగా భూమి చుట్టూ కొన్ని చక్కర్లు కొట్టి.. ఆ తరువాత జాబిల్లి కక్ష్యలోకి చేరుతుంది. చందమామను కూడా కొన్నిసార్లు చుట్టేసిన తరువాత ఆచితూచి జాబిల్లిపైకి దిగుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత సంక్లిష్టమైన, సమస్యా పూర్వక ఘట్టం.. జాబిల్లిపై చంద్రయాన్ దిగే చివరి 15 నిమిషాలు మాత్రమే!*

***భూమి చుట్టూ 23 రోజులు, చంద్రుడి చుట్టూ 12 రోజులు***

*భూమికి అతిదగ్గరగా 170 కిలోమీటర్లు (అపోజీ) అతి దూరంగా 40,000 కిలోమీటర్లు (పెరిజీ) ఉండేలా దాదాపు 23 రోజుల పాటు చక్కర్లు కొడుతూ ఉంటుంది. పూర్తిస్థాయి వేగం అందుకున్న తరువాత చంద్రయాన్ -2ను జాబిల్లి కక్ష్యలోకి పంపుతారు. ఇందుకు ఐదు రోజుల సమయం అవసరమవుతుంది. ఒక్కసారి జాబిల్లి కక్ష్యలోకి ప్రవేశించిన తరువాత లాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞ్యాన్‌లతో కూడిన చంద్రయాన్-2 మాడ్యూల్ దాదాపు 12 రోజుల పాటు చక్కర్లు కొడుతూ క్రమేపీ తన వేగాన్ని తగ్గించుకుంటూ జాబిల్లికి దగ్గరగా చేరుతుంది. ప్రయోగం జరిగిన 48వ రోజున.. అంటే సెప్టెంబరు ఏడున ఆర్బిటర్ (జాబిల్లి చుట్టూ తిరిగి వివరాలు సేకరించే భాగం) నుంచి రోవర్‌తో కూడిన ల్యాండర్ వేరుపడుతుంది.*

***జరిగేది జూలై 15 ప్రణాళిక ప్రకారమే***

*ఆర్బిటర్ నుంచి ల్యాండర్ వేరుపడటంతో మొత్తం ప్రయోగంలో అత్యంత కీలకమైన ఘట్టం మొదలవుతుంది. దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఇప్పటికే గుర్తించిన రెండు భారీ గుంతల మధ్య దిగేందుకు ప్రయత్నాలు మొదలు పెడుతుంది. ల్యాండర్ తన వేగాన్ని నియంత్రించుకుంటూ.. నిర్దిష్ట ప్రాంతంలో దిగాల్సి ఉండటం ఇందుకు కారణం. ఈ ప్రక్రియ కాస్తా విజయవంతమైతే.. కొంత సమయం తరువాత ల్యాండర్ లోపలి నుంచి రోవర్ కిందకు దిగుతుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ముందుగా అనుకున్నట్లు చంద్రయాన్ -2 ప్రయోగం జూలై 15న జరిగి ఉంటే.. జాబిల్లిపై ల్యాండింగ్ 54వ రోజు జరగాల్సి ఉండింది. కానీ ప్రయోగం వాయిదా పడింది. అయినాసరే.. సెప్టెంబరు 6-7 మధ్యకాలంలో జాబిల్లిపై ల్యాండ్ అయితే వచ్చే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇస్రో కొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. భూమి చుట్టూ తిరిగే కాలాన్ని 17 నుంచి 23 రోజులకు పెంచింది. అదేసమయంలో జాబిల్లి కక్ష్యలోకి ప్రవేశించడం, అక్కడ చక్కర్లు కొట్టే కాలాన్ని తగ్గించింది. జాబిల్లిపై రోవర్, ల్యాండర్‌లు చేయాల్సిన ప్రయోగాలకు ఇది కీలకం. ఈ రెండు పరికరాలూ సోలార్ ప్యానెల్స్‌తో విద్యుదుత్పత్తి చేసుకుని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు ఆరవ తేదీ మొదలుకొని కొన్ని రోజుల పాటు ల్యాండర్, రోవర్‌లు దిగే ప్రాంతం భూమికి అభిముఖంగా ఉంటూ సూర్యుడి కిరణాలు ప్రసారమవుతూంటాయి.*

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

### ఇక సూర్యుడిపై...

**2020లో ఆదిత్య ఎల్1 ప్రయోగం**



**న్యూఢిల్లీ:** చంద్రయాన్-2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టిన ఇస్రో ఇప్పుడు సూర్యుడిపై దృష్టి సారించింది. సూర్యుడి ఉపరితలంపై కొన్ని వేల కిలోమీటర్ల మేర విస్తరించిన 'కరోనా'ను అధ్యయనం చేసేందుకు 'ఆదిత్య-ఎల్1' అనే వ్యోమనౌకను ప్రయోగించనుంది. 2020 ప్రథమార్థంలో ఈ ప్రయోగాన్ని చేపడతామని ఇస్రో తెలిపింది. 'సూర్యుడి ఉపరితలంపై సాధారణంగా 6,000 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. అదే సూర్యుడి బాహ్య ఉపరితల ప్రాంతమైన 'కరోనా'లో 9.99 లక్షల డిగ్రీల ఉష్ణోగ్రత నమోదువుతోంది. కరోనాలో ఇంతభారీగా ఉష్ణోగ్రతలు ఎందుకు నమోదవుతున్నాయో ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. తాజాగా మేం ప్రయోగించనున్న ఆదిత్య-ఎల్1 నౌక కరోనాతో పాటు ట్రోపోస్పియర్, ఫొటోస్పియర్, సూర్యుడి నుంచి కణాల ప్రవాహాన్ని అధ్యయనం చేస్తుంది' అని ఇస్రో వెల్లడించింది. వాతావరణ మార్పులపై కరోనా గణనీయమైన ప్రభావం చూపుతుందని పేర్కొంది. భూమికి సూర్యుడు 14.96 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు.

### చంద్రయాన్-1తో పరిశోధనలిలా..

**శ్రీహరికోట (సూళ్లూరుపేట):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2007 దాకా వివిధ రకాలైన రాకెట్ల ద్వారా రిమోట్ సెన్సింగ్, సమాచారం, వాతావరణ పరిశోధన, ఖగోళ పరిశోధనలకు సంబంధించిన ప్రయోగాలు మాత్రమే చేస్తూ వచ్చింది. గ్రహాంతర ప్రయోగాలు చేయాలని నిశ్చయించుకుని 2008లో చంద్రయాన్-1 ప్రయోగాన్ని పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా చేపట్టింది. ఆ ప్రయోగంలో చంద్రుని కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపి పరిశోధనలు చేసింది. అయితే చంద్రయాన్-1 ఉపగ్రహాన్ని రెండేళ్లపాటు పనిచేసేలా రూపొందించారు. అయితే, అందులో పంపిన పరికరాలు పది నెలలకే పనిచేయడం మానేశాయి. అంటే చంద్రయాన్-1 పది నెలలు పనిచేసిన తరువాత సాంకేతికపరమైన లోపంతో పనిచేయడం మానేసింది. అప్పటికే చంద్రుడిపై నీటి అణువుల జాడ ఉందని గుర్తించి ఇస్రో చరిత్ర సృష్టించింది. భారతదేశం నుంచి చంద్రుడిపైకి వెళ్లిన మొట్టమొదటి ప్రయోగం ఇదే. అతి తక్కువ ఖర్చుతో ఈ ప్రయోగాన్ని చేపట్టి చంద్రుడిపై పరిశోధనలు జరిపింది. చంద్రయాన్-1 మిషన్ పూర్తిస్థాయిలో పని చేయకపోవడంతో దానికి కొనసాగింపుగా చంద్రయాన్-2 మిషన్‌ను ప్రయోగించారు.

### ఇస్రోకు నాసా అభినందనలు

చంద్రయాన్-2 ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రోకు అమెరికా అంతరిక్ష ప్రయోగ సంస్థ నాసా అభినందనలు తెలిపింది. ఈ ప్రయోగం ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువం గురించి ఇస్రో వెలుగులోకి తెచ్చే కొత్త విషయాల కోసం ఎదురుచూస్తామని తెలిపింది. 'చంద్రునిపై అధ్యయనానికి చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రోకు అభినందనలు. విశ్వాంతరాళంలో ఉన్న మా సాంకేతిక వనరులను మీకు సాయంగా అందించడానికి గర్విస్తున్నాం. చంద్రుని దక్షిణ ధ్రువం గురించి మీరు కనుగొనే కొత్త విషయాల కోసం ఎదురుచూస్తున్నాం. త్వరలోనే మేం కూడా ఆర్టిమిస్ మిషన్ ద్వారా ఆ ప్రాంతంలోకి వ్యోమగాములను పంపనున్నాం' అని ట్విట్టర్‌లో నాసా పేర్కొంది.

## చంద్రుడిపై పరిశోధనలకు 60 ఏళ్లు!

**శ్రీహరికోట(సూళ్లూరుపేట)**

నెలలో సగం రోజులు చీకటిలో ఉండి, మరో సగం రోజులు చల్లని వెన్నెల కురిపించే నెల రాజు గురించి తెలుసుకోవడానికి 60 ఏళ్లుగా పరిశోధనలు సాగుతూనే ఉన్నాయి. చందమామ విస్తీర్ణం తగ్గుతూ వస్తోందని పలు పరిశోధనల్లో వెల్లడైంది. చంద్రుని చుట్టు కొలత 10,921 కిలోమీటర్లు అని నాసా శాస్త్రవేత్తలు గతంలోనే గుర్తించారు. నానాటికీ చంద్రుని పరిమాణం కూడా తగ్గిపోతోందనే విషయం కూడా వారి పరిశోధనల్లోనే వెల్లడైంది. అదే విధంగానే చంద్రుడు భూమికి మధ్య దూరం పెరిగిపోతోందని, ఏడాదికి సుమారు 15 అంగుళాల చొప్పున చంద్రుడు దూరంగా వెళుతున్నాడని కూడా నాసా వెల్లడించింది. ప్రపంచంలో అంతరిక్ష ప్రయోగాలు చేసే దేశాలు చాలా వరకు ఇప్పటికి 125 ప్రయోగాలు చంద్రుడిపైకి చేపట్టినట్టు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. 1958 నుంచి అమెరికా చంద్రుడిపై పరిశోధనలను ప్రారంభించింది. 12 ప్రయోగాలు చేసిన తరువాత 13వ ప్రయోగంలో చంద్రుని కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపించగలిగింది. అలా ఇప్పటిదాకా 58 ప్రయోగాలు చేసి 41 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించారు. 1969లో అపోలో రాకెట్ ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్, మైఖేల్ కొలిన్స్ అనే ముగ్గురు వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించిన ఘనత అమెరికాదే. ఈ ప్రయోగం జరిగి కూడా అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. రష్యా 1958 నుంచి చంద్రునిపైకి 53 ప్రయోగాలు చేసింది. అందులో 35 మాత్రమే విజయం అయ్యాయి. 1990 నుంచి జపాన్ ఆరు ప్రయోగాలు సొంతంగా, ఒక్క ప్రయోగం నాసాతో కలిసి చేసింది. ఇందులో ఐదు ప్రయోగాలు విజయవంతమయ్యాయి. 2010 నుంచి చైనా ఏడు ప్రయోగాలు చేయగా ఒక్క ప్రయోగం మాత్రమే చంద్రుని దాకా వెళ్లగలిగింది. ఇజ్రాయెల్ ఈ ఏడాది ఫిబ్రవరిలో చంద్రునిపైకి ల్యాండర్‌ను పంపించినా అది విజయవంతం కాలేదు. జర్మనీ 2003లో చంద్రుని మీదకు ఆర్బిటర్‌ను విజయవంతంగా పంపించింది. 2008లో భారత్ చంద్రుడి మీదకు చంద్రయాన్-1 పేరుతో ఆర్బిటర్ ప్రయోగించి విజయం సాధించడమే కాకుండా చంద్రుడిపై నీటి జాడలున్నాయని కనుగొంది. అమెరికా, రష్యా, జపాన్, చైనా, జర్మనీ, ఇజ్రాయెల్, భారత్ చంద్రుడిపై పరిశోధనలకు ప్రయోగాలు చేసినప్పటికీ అమెరికా, రష్యా లాంటి అగ్రరాజ్యాలే ఇప్పటికీ ముందంజలో ఉన్నాయి. తాజాగా, భారత్ రెండో సారి ఆర్బిటర్ ద్వారా ల్యాండర్‌ను చంద్రుని ఉపరితలంపై దింపి అందులో అమర్చిన రోవర్‌తో చంద్రుడిపై పరిశోధనలు చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, రోవర్‌ను ల్యాండర్ ద్వారా పంపి దాన్ని చంద్రుడిపైకి దించడం మాత్రం చేస్తున్నది భారత్ మాత్రమేనని చెప్పుకోవచ్చు. చంద్రుడు, అంగారకుడు మీదకు రోవర్లు పంపిన వారు పెద్ద పెద్ద బాల్స్ వంటి వాటిలో రోవర్లను అమర్చి పంపారు. భారత్ మాత్రం ల్యాండర్‌ను చందమామపై దించే మొట్టమొదటి దేశంగా ఖ్యాతి సాధిస్తోంది.



## పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే

### ఇస్రో చైర్మన్ శివన్



**శ్రీహరికోట:** చంద్రయాన్-2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టినందుకు గర్వంగా ఉందని ఇస్రో చైర్మన్ డా.కె.శివన్ తెలిపారు. ఇందులో ప్రయోగించిన అన్ని సాంకేతిక పరికరాలను భారత్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిందని వెల్లడించారు. 'సాంకేతిక కారణాలతో ప్రయోగం నిలిచినా మేం మళ్లీ పుంజుకున్నాం. ప్రయోగానికి కొద్దిసేపటి ముందు సమస్యను గుర్తించగానే మా బృందం రంగంలోకి దిగింది. అప్పట్నుంచి 24 గంటల్లోనే సమస్యను పరిష్కరించి చంద్రయాన్-2 ప్రయోగానికి సర్వం సిద్ధం చేశాం. జీఎస్ఎల్వీ మార్క్-3 చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రయోగించడం ఎంతో సంతోషంగా ఉంది. మేం అనుకున్న దానికంటే 6,000 కి.మీ ఎత్తులో చంద్రయాన్-2ను వాహకనౌక విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భారత్ చారిత్రాత్మక ప్రయాణం మొదలైంది. కేవలం భారత్ ఒక్కటే కాదు. ప్రపంచమంతా చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతం కావాలని ఎదురుచూసింది. మేం దాన్ని సాధించాం. చంద్రయాన్-2 ప్రాజెక్టులో 30 శాతం మంది మహిళా సిబ్బందే ఉన్నారు. వీరిలో శాస్త్రవేత్తలు రీతూ కరిథల్, ఎం వనితలు కీలక పాత్ర పోషించారు. చంద్రయాన్-2 ప్రయోగం ఇంకా పూర్తికాలేదు. చంద్రుడిపై ల్యాండర్ దిగే 15 నిమిషాలు అత్యంత కీలకమైనవి. ఈ దశను ల్యాండర్ దాటితే ప్రయోగం విజయవంతం అయినట్లే. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలందరికీ సెల్యూట్ చేస్తున్నా' అని పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
23-7-2019
WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 306 ▼ | 73 ▼ |
| 38,031 | 11,346 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,200 | ▲ 52 |
| డోజోన్స్ | 27,168 | ▲ 14 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,515 | ▲ 6 |
| డాక్స్ | 12,289 | ▲ 29 |
| షాంఘై | 2,887 | ▼ 37 |
| నికాయ్ | 21,417 | ▼ 50 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.00 | 69.64 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.83 | 87.92 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.16 | 79.04 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.79 | 65.21 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.77 | 49.97 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.82 | 51.68 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.39 | 10.75 |

# జీవితకాల గరిష్టస్థాయికి పసిడి

**ఢిల్లీలో 10గ్రా. ధర రూ.35,970**

**న్యూఢిల్లీ:** బంగారం ధర జోరుమీద కొనసాగుతోంది. గతకొద్ది రోజులుగా క్రమంగా పెరుగుతూ వస్తున్న పసిడి ధర సోమవారం ఏకంగా జీవితకాల గరిష్ఠస్థాయిని తిరగరాసింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల (బిస్కెట్ గోల్డ్) బంగారం ధర రూ.35,970 చేరుకుంది. ప్రాంతీయ నగల వ్యాపారుల నుంచి డిమాండ్ క్రమంగా పెరిగిన కారణంగా ఇక్కడి ధర రూ.100 పెరిగి ఆల్ టైం రికార్డు హైకి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర జైన్ పేర్కొన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లు పతనమౌతున్నందున ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి మార్గమైన బంగారం వైపునకు మళ్లడమే డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణంగా



విశ్లేషించారు. మరోవైపు సావరిన్ గోల్డ్ ధర కూడా రూ.100 పెరిగి రూ.35,870 వద్దకు చేరుకుంది. ఇక అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర సోమవారం ఒక దశలో 1,430.35 డాలర్ల గరిష్ఠస్థాయిని నమోదుచేసింది.

**వెండి వెలుగులే..**

బంగారం దారిలోనే వెండి ధరలు ప్రయాణం చేస్తున్నాయి. స్పాట్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.260 పెరిగి రూ.41,960 చేరుకోగా.. వీక్లీ డెలివరీ సిల్వర్ ధర రూ.391 పెరిగి రూ.41,073 వద్దకు ఎగబాకింది. 100 వెండి నాణేల కొనుగోలు ధర రూ.84,000 కాగా, అమ్మకం ధర రూ.85,000. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు ధర 16.62 డాలర్లకు ఎగసింది.

# కోటక్ బ్యాంక్ లాభం 1, 932 కోట్లు

- జూన్ క్వార్టర్‌లో 23 శాతం పెరుగుదల...
- మొత్తం ఆదాయం రూ.12,130 కోట్లు; 22.5 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.1,932 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత క్యూ1లో వచ్చిన నికర లాభం(రూ.1,574 కోట్లు)తో పోల్చితే 23 శాతం వృద్ధి సాధించామని కోటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది. నికర లాభంలో 30 శాతం వాటా అనుబంధ కంపెనీల వల్లనే వచ్చిందని వివరించింది. మొత్తం ఆదాయం రూ.9,904 కోట్ల నుంచి రూ.12,130 కోట్లకు చేరిందని పేర్కొంది. స్టాండెలోన్ పరంగా చూస్తే, నికర లాభం రూ.1,052 కోట్ల నుంచి 33 శాతం వృద్ధితో రూ. 1,360 కోట్లకు పెరిగిందని తెలిపింది. ఇక ఆదాయం రూ.6,644 కోట్ల నుంచి రూ.7,945 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

**తగ్గిన కేటాయింపులు..**

రుణ నాణ్యత తగిన స్థాయిలోనే ఉందని కోటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది. గత క్యూ1లో 2.17 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 2.19 శాతానికి పెరగ్గా, నికర మొండి బకాయిలు 0.86 శాతం నుంచి 0.73 శాతానికి తగ్గాయని పేర్కొంది. మొండి బకాయిలకు, అత్యవసరాలకు కేటాయింపులు రూ.499 కోట్ల నుంచి రూ.350 కోట్లకు తగ్గాయని తెలిపింది.




ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్ 3 శాతం నష్టంతో రూ.1,454 వద్ద ముగిసింది.

## హైదరాబాద్‌లో వన్‌ప్లస్ అతిపెద్ద స్టోర్

- 16,000 చదరపు అడుగుల విస్తీర్ణం
- కంపెనీ జీఎం వికాస్ అగర్వాల్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్మార్ట్‌ఫోన్స్ తయారీలో ఉన్న చైనా కంపెనీ వన్‌ప్లస్ అతిపెద్దఔట్‌లెట్‌ను హైదరాబాద్‌లో నిర్మిస్తోంది. 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో హిమాయత్‌నగర్‌లో ఇది ఏర్పాటవుతోంది. కంపెనీకి ప్రపంచంలో ఇదే అతిపెద్ద, సొంత స్టోర్. ఈ ఏడాది చివరినాటికి నిర్మాణం పూర్తి కావొచ్చని సంస్థ భావిస్తోంది. వన్‌ప్లస్ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారు. ఆరు అంతస్తుల్లో సిద్ధమవుతున్న ఈ కేంద్రంలో రెస్టారెంట్, ప్లే ఏరియా వంటివి అందుబాటులోకి వస్తాయని కంపెనీ జీఎం వికాస్ అగర్వాల్ వెల్లడించారు. వన్‌ప్లస్ ఉత్పత్తుల విక్రయం కోసం ఎలక్ట్రానిక్స్ రిటైల్ చైన్ బజాజ్ ఎలక్ట్రానిక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్న సందర్భంగా సోమవారం ఆయన సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధితో మాట్లాడారు. 'ఇప్పటికే హైదరాబాద్ గచ్చిబౌలిలో వన్‌ప్లస్ ఆర్‌అండ్‌డీ సెంటర్ ఉంది. ప్రస్తుతం 150 మంది ఇక్కడ పనిచేస్తున్నారు. కొన్నేళ్లలో ఈ సంఖ్య వేలకు చేరుకుంటుంది. ఆర్‌అండ్‌డీ పరంగా సంస్థకు ఇదే అతిపెద్ద కేంద్రంగా నిలుస్తుంది. వన్‌ప్లస్ టీవీ అభివృద్ధి దశలో ఉంది. కొద్ది రోజుల్లో విడుదల చేస్తాం' అని వివరించారు.

# పేమెంట్ బ్యాంకులు... ప్చ్!

- ఒక్కొక్కటిగా మూతబడుతున్న సంస్థలు
- ఆదిత్య బిర్లా పేమెంట్స్ బ్యాంక్ మూసివేత నిర్ణయం
- ముందుగానే తప్పుకున్నమూడు సంస్థలు
- భవిష్యత్ అగమ్యగోచరం అంటున్న విశ్లేషకులు...

ప్రజలందరికీ మరింతగా ఆర్థిక సేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన పేమెంట్స్ బ్యాంకుల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారుతోంది. లాభ సాటైన వ్యాపార విధానం లేకపోవడంతో కార్యకలాపాలు ప్రారంభించిన కొన్నాళ్లకే కొన్ని మూతబడగా, అసలు మొదలుపెట్టకుండానే మరికొన్ని వైదొలుగుతున్నాయి. వొడాఫోన్ ఎం–పెసా ఈ నెల తొలినాళ్లలోనే కార్యకలాపాలు నిలిపివేసినట్లు సమాచారం. తాజాగా ఆదిత్య బిర్లా ఐడియా పేమెంట్స్ బ్యాంక్ (ఏబీఐపీబీ) ఈ ఏడాది అక్టోబర్ నుంచి కార్యకలాపాలు నిలిపివేయాలని నిర్ణయించింది. వ్యాపార పరిస్థితుల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకోవడం వల్ల వ్యాపార విధానం లాభదాయకత దెబ్బతినడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. 2018 ఫిబ్రవరిలో ఆదిత్య బిర్లా ఐడియా పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలు ప్రారంభించింది. ఏబీఐపీబీలో దాదాపు 20 కోట్ల మేర డిపాజిట్లు ఉన్నాయి. సుమారు 200 మంది పైగా సిబ్బంది ఉన్నారు. ఏబీఐపీబీ మూసివేతతో వీరిని గ్రూప్‌లోని ఇతర సంస్థలకు బదిలీ చేయొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. డిపాజిట్ల గురించి ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విత్‌డ్రా చేసుకునేందుకు తగినంత సమయం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌కు ఇందులో 51 శాతం, వొడాఫోన్ ఐడియాకు 49 శాతం వాటాలు ఉన్నాయి. 2017–18లో ఏబీఐపీబీ రూ. 24 కోట్ల నష్టం నమోదు చేసింది.

**11 బ్యాంకులకు లైసెన్సులు..**

2015లో 11 సంస్థలకు ఆర్‌బీఐ పేమెంట్స్ బ్యాంక్ లైసెన్సులు ఇచ్చింది. అయితే, టెక్ మహీంద్రా, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీతో పాటు కన్సార్షియంగా ఏర్పడిన దిలీప్ సంఘ్వీ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, టెలినార్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థలు పేమెంట్స్ బ్యాంక్ ప్రతిపాదనలను పక్కన పెట్టాయి. సూత్రప్రాయంగా పొందిన లైసెన్సులను తిరిగిచ్చేశాయి. ఫినో పేమెంట్స్ బ్యాంక్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకులు పూర్తి స్థాయి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటితో పోలిస్తే ఎన్‌ఎస్‌డీఎల్ పేమెంట్స్ బ్యాంక్, జియో పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలు పరిమిత స్థాయిలో ఉన్నాయి. 2018 మే ఆఖరు నాటికి దేశీయంగా పేమెంట్స్ బ్యాంకుల్లో రూ. 540 కోట్ల మేర డిపాజిట్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో అత్యధికంగా రూ. 307 కోట్లు, పేటీఎం పేమెంట్స్ బ్యాంకులో రూ. 194 కోట్లు, ఫినోలో రూ. 37 కోట్లు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌లో రూ. 1.39 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి.




**కఠినతరమైన నిబంధనలతో కష్టాలు..**

ఇటు డిపాజిట్ల సమీకరణపరంగానూ అటు రుణాల వితరణలోనూ కష్టతరమైన నిబంధనలు పాటించాల్సి వస్తుండటమే పేమెంట్స్ బ్యాంకులు విఫలమవుతుండటానికి కారణాలుగా ఉంటున్నాయి. పేమెంట్ బ్యాంకులు ఒక్కో ఖాతాదారు నుంచి రూ. 1 లక్షకు మించి డిపాజిట్లు సేకరించడానికి లేదు. రుణాలివ్వడానికి లేదు. కానీ సేకరించిన నిధుల్లో 75 శాతాన్ని ప్రభుత్వ బాండ్లలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. రుణాలపరమైన రిస్కులు పెద్దగా లేకపోయినప్పటికీ 15 శాతం మేర మూలధనం నిబంధనను తప్పనిసరిగా పాటించాల్సి వస్తోంది. ఇక ప్రతీ వివరాన్నీ నియంత్రణ సంస్థకు తెలియజేయాలన్న మరో నిబంధన కూడా సమస్యగా ఉంటోంది. పేమెంట్ బ్యాంకులు వైవిధ్యమైన సేవలు అందించేందుకు ఎక్కువగా టెక్నాలజీపైనే ఆధారపడుతున్నాయి. అయితే, వివరాల వెల్లడి నిబంధనల వల్ల మొత్తం వ్యాపార ప్రణాళికను బైటపెట్టినట్లవుతుందని, ఫలితంగా పోటీ సంస్థలకు తమ వ్యాపార రహస్యాలను చేజేతులా అందించినట్లవుతుందని అవి ఆందోళన చెందుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అవి పూర్తి స్థాయి బ్యాంకులకు ఎప్పటికీ నిజమైన పోటీదారుగా నిలిచే పరిస్థితులు లేవని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. అయితే, ఖాతాదారుల వివరాల ధ్రువీకరణ కోసం ఆధార్ ఆధారిత ప్రక్రియను పేమెంట్స్ బ్యాంకులకు కూడా అందుబాటులోకి తెస్తే .. కేవైసీ నిబంధన పాటింపు వ్యయాలు తగ్గుతాయని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. అలాగే వివిధ సాధనాలను విక్రయించేందుకు థర్డ్ పార్టీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు కూడా పేమెంట్స్ బ్యాంకులకు వెసులుబాటు కల్పించాలని తెలిపింది. ఇలాంటి విధానాలతో పేమెంట్స్ బ్యాంకులు విజయవంతం కాగలవని పేర్కొంది.

**అనిశ్చితిలో బ్యాంకుల భవిష్యత్..: ఎస్‌బీఐ నివేదిక**

పేమెంట్స్ బ్యాంకుల భవిష్యత్ అనిశ్చితిలో ఉందని, అవి సమర్థంగా పనిచేయాలంటే నియంత్రణ సంస్థ తోడ్పాటు తప్పనిసరని ఎస్‌బీఐ ఒక నివేదికలో వెల్లడించింది. 'పేమెంట్ బ్యాంక్‌ల భవిష్యత్ అనిశ్చితిలో ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే, నియంత్రణ సంస్థ, ప్రభుత్వ తోడ్పాటుతో వీటి వ్యాపారం క్రమంగా విస్తరించి, వృద్ధి చెందే అవకాశం ఉంది' అని పేర్కొంది. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో పేమెంట్స్ బ్యాంక్ విధానం విఫలమైనట్లుగానే కనిపిస్తోందని వివరించింది. 11 సంస్థలు లైసెన్సులు పొందినప్పటికీ నాలుగు సంస్థలు మాత్రమే కార్యకలాపాలు ప్రారంభించడం అవి కూడా మనుగడ సాగించలేని పరిస్థితులు నెలకొనడం ఇందుకు నిదర్శనమని పేర్కొంది.

## టీవీఎస్ మోటార్ లాభం 6 శాతం డౌన్

రూ.5,026 కోట్లకు మొత్తం ఆదాయం




**న్యూఢిల్లీ:** టీవీఎస్ మోటార్ కంపెనీ నికర లాభం (కన్సాలిడేటెడ్) ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌-.జూన్ క్వార్టర్(2019–20, క్యూ1)లో 6 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ.160 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ. 151కోట్లకు చేరిందని టీవీఎస్ మోటార్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,626 కోట్ల నుంచి రూ.5,026 కోట్లకు పెరిగిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.4,386 కోట్ల నుంచి రూ.4,793 కోట్లకు చేరాయని తెలిపింది. గత క్యూ1లో 8.93 లక్షలుగా ఉన్న మొత్తం టూ, త్రీ వీలర్ల అమ్మకాలు (ఎగుమతులతో కలుపుకొని) ఈ క్యూ1లో 8.84 లక్షలకు తగ్గాయని తెలిపింది. బైక్‌ల అమ్మకాలు 8 శాతం పెరిగి 4.17 లక్షలకు, స్కూటర్ల అమ్మకాలు 2 శాతం వృద్ధితో 2.95 లక్షలకు, త్రీ వీలర్ల అమ్మకాలు 11 శాతం వృద్ధితో 40,000కు పెరిగాయని పేర్కొంది. ఎగుమతులు మాత్రం భారీగా తగ్గాయని, అందుకనే మొత్తం అమ్మకాలు క్షీణించాయని వివరించింది.

నికర లాభం 6 శాతం తగ్గడంతో బీఎస్‌ఈలో టీవీఎస్ మోటార్ షేర్ 4% నష్టంతో రూ.380 వద్ద ముగిసింది.

# క్రిప్టోకరెన్సీ అంటే కఠిన చర్యలు

**అంతర్ మంత్రిత్వశాఖల కమిటీ సిఫార్సు**

**న్యూఢిల్లీ:** బిట్ కాయిన్, ఎథేరియం, రిపిల్, కార్డోనో వంటి క్రిప్టోకరెన్సీ కార్యకలాపాలు ఏవైనా భారత్‌లో కఠిన చర్యలు తీసుకోవాలని అంతర్ మంత్రిత్వశాఖల కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ప్రైవేటు క్రిప్టోకరెన్సీలను దేశంలో నిషేధించాలని సూచించిన కమిటీ, దేశంలో ఈ తరహా కార్యకలాపాలు నిర్వహించే వారిపై జరిమానాలు విధించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. క్రిప్టోకరెన్సీల నియంత్రణ, నిషేధానికి సంబంధించి ఒక చట్టాన్ని తీసుకురావాలని కూడా కమిటీ సిఫారసు చేసింది. ఇందుకు సంబంధించి 'ది బ్యానింగ్ ఆఫ్ క్రిప్టోకరెన్సీ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ అఫీషియల్ డిజిటల్ కరెన్సీ బిల్లు, 2019' పేరుతో ఒక ముసాయిదా బిల్లును కూడా కమిటీ సిఫారసు చేసింది. క్రిప్టోకరెన్సీపై ఎటువంటి విధానాలను అవలంబించాలనే అంశంపై సిఫారసులు చేయడానికి కేంద్రం 2017 నవంబర్ 2న కమిటీని ఏర్పాటు చేసింది. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, సెబీ చైర్మన్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ సభ్యులు. ''ప్రైవేటు క్రిప్టోకరెన్సీతో ఇబ్బందులు పొంచి ఉన్నాయి. ధరల్లో తీవ్ర ఒడిదుడుకులు ఉంటాయి. సామాన్యులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం అధికం'' అని సోమవారం విడుదలైన నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,116 క్రిప్టోకరెన్సీలు ఉన్నాయి. వీటి మార్కెట్ విలువ 119.46 బిలియన్ డాలర్లు. తాజాగా కమిటీ నివేదిక, ముసాయిదా బిల్లులను సంబంధిత అన్ని శాఖలు పరస్పర సంప్రతింపుల ద్వారా సమీక్షిస్తాయి. తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేస్తాయి. కేంద్రం తుది నిర్ణయం తీసుకుంటుంది.



## బజాజ్ సీటీ 110 @ రూ.37,997

**న్యూఢిల్లీ:** దిగ్గజ వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తన ఎంట్రీ లెవెల్ మోటార్ సైకిల్ 'సీటీ 110'లో నూతన వెర్షన్‌ను విడుదలచేసింది. చౌక ధరలో అధునాతన ఫీచర్లను జోడించిన ఈ బైక్‌ను సోమవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కిక్ స్టార్ట్ వెర్షన్ ధర రూ.37,997 (ఎక్స్–షోరూమ్, ఢిల్లీ) కాగా, ఇందులో ఎలక్ట్రిక్ స్టార్ట్ ఆప్షన్ కలిగిన బైక్ ధర రూ.44,480 వద్ద నిర్ణయించినట్లు ప్రకటించింది. ఈ నూతన వెర్షన్‌లో మరింత బలమైన, విశాల క్రాష్ గార్డ్స్ ఉన్నాయని.. క్రితం మోడల్‌తో పోల్చితే గ్రౌండ్ క్లియరెన్స్ పెరిగినట్లు వివరించింది. మెరుగైన సస్పెన్షన్ కలిగిన ఈ బైక్‌కు 115సీసీ ఇంజిన్ అమర్చింది.



# లాభాల బాటలోనే ఓబీసీ..

**మెరుగుపడిన రుణ నాణ్యత**

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.113 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.393 కోట్ల నికర నష్టాలు వచ్చాయని ఓబీసీ తెలిపింది. సీక్వెన్షియల్‌గా చూస్తే, గత క్యూ4లో రూ.202 కోట్ల నికర లాభం సాధించామని పేర్కొంది. రుణ నాణ్యత మెరుగుపడటం, మొండి బకాయిలు తగ్గడంతో కేటాయింపులు తక్కువగా ఉండటం, ట్రెజరీ ఆదాయం పెరగడం.. తదితర కారణాల వల్ల గత క్యూ1లో నికర లాభం సాధించామని ఓబీసీ ఎమ్‌డీ, సీఈఓ ముకేశ్ జైన్ తెలిపారు. వరుసగా నాలుగో క్వార్టర్‌లోనూ లాభాలు సాధించామని పేర్కొన్నారు. గత క్యూ1లో రూ.4,730 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ1లో రూ.5,635 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు.

సాధారణంగా జూన్ క్వార్టర్‌లో వ్యాపారం మందకొడిగా ఉంటుందని, అయినప్పటికీ, రూ. లక్ష కోట్ల మేర వ్యాపారం సాధించామని ముకేశ్ జైన్ తెలిపారు. ట్రెజరీ ఆదాయం రూ.76 కోట్ల నుంచి రూ.179 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. వడ్డీ ఆదాయం రూ.4,269 కోట్ల నుంచి 15 శాతం వృద్ధితో రూ,.4,919 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. ఇతర ఆదాయం రూ.461 కోట్ల నుంచి 55 శాతం వృద్ధితో రూ.715 కోట్లకు పెరిగిందని తెలిపారు. నికర వడ్డీ మార్జిన్ 2.82 శాతం నుంచి 2.41 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.




**రూ.3,000 కోట్ల సమీకరణ**

స్థూల మొండి బకాయిలు 17.89 శాతం నుంచి 12.56 శాతానికి, నికర మొండి బకాయిలు 10.63 శాతం నుంచి 5.91 శాతానికి తగ్గాయని జైన్ వివరించారు. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.1,222 కోట్ల నుంచి రూ.865 కోట్లకు తగ్గాయని పేర్కొన్నారు. మార్కెట్ పరిస్థితులు మెరుగుపడితే, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ మార్గంలో రూ.3,000 కోట్లు సమీకరించనున్నామని తెలిపారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఓబీసీ షేర్ 2 శాతం నష్టంతో రూ.80.35 వద్ద ముగిసింది.

# టీఎస్ఎస్ గ్రూప్‌లో ఆర్‌వోసీ సోదాలు!

- బోర్డుల్లేవు.. ఉద్యోగుల్లేరు; బ్యాలెన్స్‌షీట్లూ వేయలేదు
- కార్యకలాపాలు లేకున్నా రూ.500 కోట్లకు పైగా రుణాలు
- మరిన్ని తనిఖీలు జరిపాక చర్యలు: ఆర్‌ఓసీ వర్గాలు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న టీఎస్ఎస్ గ్రూప్‌లో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) హైదరాబాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. గ్రూప్ కంపెనీల్లో భారీగా నగదు లావాదేవీలు, అవకతవకలు జరిగాయన్న సమాచారంతో ఈ సోదాలు జరిపినట్లు ఆర్‌వోసీ వర్గాలు తెలిపాయి. మాదాపూర్‌లోని కావూరీహిల్స్‌లో ఉన్న టీఎస్ఎస్ గ్రూప్‌లో 15 అనుబంధ కంపెనీలున్నాయి. రమేశ్ హరిదాస్, ఉర్వశీ రమేశ్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న ఈ కంపెనీల్లో 10 హైదరాబాద్ ఆర్‌వోసీ పరిధిలో, 2 విజయవాడ, 3 చెన్నై ఆర్‌వోసీ పరిధిలో ఉన్నాయి.

**ట్రాన్స్‌జెల్ ఇరాన్‌కు షిఫ్ట్..**

టీఎస్ఎస్ గ్రూప్‌లోని చాలా కంపెనీలు 2016 నుంచి (ఎంసీఏకు బ్యాలెన్స్ షీట్స్ సమర్పించడం లేదు. ఈ కంపెనీల్లో న్యూ హెవెన్ కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ గతేడాది బీఎస్‌ఈ నుంచి డీ–లిస్ట్ అయింది. ట్రాన్స్‌జెల్ ఇండస్ట్రీస్ కార్యకలాపాలు ఇరాన్‌కు బదిలీ అయ్యాయి. దీనికి రమేశ్, ఉర్వశీతో పాటూ ఇరాన్ పార్టనర్ హెర్మాన్ జోసెఫ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ విషయమై టీఎస్ఎస్ గ్రూప్ డైరెక్టర్ రమేశ్ హరిదాస్‌ను ప్రశ్నించగా.. ''పటాన్‌చెరులో ప్లాంట్ పెడతామని అనుకున్నాం. కానీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ప్లాంట్‌ను, మిషనరీని ఇరాన్‌కు బదిలీ చేయాల్సి వచ్చింది'' అని చెప్పారు.



**రూ.500 కోట్లకు పైగా రుణాలు...**

ఎంసీఏ రికార్డుల ప్రకారం టీఎస్ఎస్ గ్రూప్‌నకు రూ.500 కోట్లకు పైగా రుణాలున్నాయి. కాకపోతే సోదాల కోసం వెళ్లిన ఆర్‌ఓసీ అధికారులకు కంపెనీ పేర్ల బోర్డులు గానీ, ఉద్యోగులు గానీ కనిపించలేదని సమాచారం. నందినీ ఇండస్ట్రీస్‌లో ఉన్న 8–10 మందినే ఇతర కంపెనీల్లో కూడా ఉద్యోగులుగా చూపిస్తున్నారనేది ఆర్‌వోసీ అధికారుల మాట. ఈ గ్రూప్‌నకు చెన్నైలో ఉన్న కంపెనీలను కూడా తనిఖీ చేసిన తర్వాత చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

**ఆర్‌వోసీ లెక్కలే తప్పు..**

ఆర్‌వోసీ తనిఖీలపై వివరణ కోరేందుకు 'సాక్షి బిజినెస్ బ్యూరో' ప్రతినిధి ప్రయత్నించగా... ''మా గ్రూప్ కంపెనీలకున్న రుణాలు రూ.160 కోట్లే. చాలా వరకు తీర్చేశాం. హైదరాబాద్‌లో నాలుగు ప్రైమ్ ప్రాపర్టీలున్నాయి. వాటిని విక్రయించి.. మిగతా రుణాలను తీర్చడానికి ప్రయత్నిస్తున్నాం. ఏడాదిలో ఇది జరిగిపోతుందని'' అని కంపెనీ ప్రతినిధి ఒకరు చెప్పారు. డైరెక్టరు రమేశ్ హరిదాస్ మాత్రం ''మాకు ఒక్క రూపాయి లోన్ లేదు. ఆర్‌వోసీ రికార్డులే తప్పు. చాలా రుణాలు తీర్చేశాం. బ్యాంక్‌లు ఆర్‌వోసీకి అప్‌డేట్ చేయలేదు'' అని పేర్కొనటం గమనార్హం.

# ప్రింట్‌ను దాటనున్న 'డిజిటల్'

- 2021 నాటికి 5.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా
- పెరుగుతున్న ఇంటర్నెట్ వినియోగంతో ఊతం
- ఫిక్కీ–ఈవై నివేదికలో వెల్లడి

**ముంబై:** ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దేశీయంగా డిజిటల్ మీడియా ఇతరత్రా ప్రింట్, సినిమా మాధ్యమాలను అధిగమించనుంది. 2019లో సినిమా పరిశ్రమను, 2021 నాటికి ప్రింట్ మీడియాను దాటేయనుంది. 2021 నాటికి 5.1 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ–కన్సల్టెన్సీ సంస్థ ఈవై రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2019లో డిజిటల్ మీడియా 3.2 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని ఇందులో అంచనా వేశారు. ఇక 2018లో 2.5 బిలియన్ డాలర్లుగా ఉన్న సినిమా సెగ్మెంట్ ఈ ఏడాది 2.8 బిలియన్ డాలర్లకు చేరుతుందని, గతేడాది 4.4 బిలియన్ డాలర్లుగా ఉన్న ప్రింట్ మీడియా 2021 నాటికి 4.8 బిలియన్ డాలర్లకు చేరగలదని ఫిక్కీ–ఈవై నివేదిక అంచనా వేసింది. డిజిటల్ మీడియా గతేడాది 42 శాతం వృద్ధి చెంది 2.4 బిలియన్ డాలర్లకు చేరింది. భారతీయులు ఫోన్‌పై సగటున 30 శాతం సమయాన్ని వినోదానికి వెచ్చిస్తున్నారని నివేదికలో వెల్లడైంది.



**57 కోట్ల మంది నెట్ వినియోగదారులు..**

చైనా తర్వాత ప్రస్తుతం భారత్‌లోనే అత్యధికంగా ఇంటర్నెట్ యూజర్లు దాదాపు 57 కోట్ల మంది ఉన్నారు. ఏటా ఈ సంఖ్య 13 శాతం పెరుగుతోంది. ఆన్‌లైన్ వీడియోలు వీక్షించే వారి సంఖ్య 32.5 కోట్లు, ఆడియో స్ట్రీమింగ్ యూజర్స్ సంఖ్య 15 కోట్ల స్థాయిలో ఉంది. 2021 నాటికి ఓవర్ ది టాప్ వీడియో సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 3–3.5 కోట్ల దాకా, ఆడియో సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 60–70 లక్షల దాకా పెరుగుతుందని ఫిక్కీ–ఈవై అంచనా వేసింది. టెలికం ఆపరేటర్లు కొత్తగా మల్టీ–సిస్టమ్ ఆపరేటర్ల అవతారమెత్తుతారని పేర్కొంది. 'ప్రస్తుతం మొత్తం వినియోగంలో 60 శాతం వాటా టెలికం సంస్థల ద్వారా ఉంటోంది. ఇది 2021 నాటికి 75 శాతానికి .. 37.5 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్స్ స్థాయికి చేరుతుంది' అని ఫిక్కీ–ఈవై తెలిపింది. మరోవైపు, టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ టారిఫ్ ఆర్డరుతో ఓటీటీ, టీవీ ప్రసారాల సంస్థల మధ్య వ్యత్యాసం గణనీయంగా తగ్గి.. ఓటీటీ సంస్థలకు లబ్ధి చేకూరవచ్చని వివరించింది.

**నివేదికలో మరిన్ని వివరాలు**

- గతేడాది దేశీయంగా మొత్తం మీడియా, వినోద రంగం పరిమాణం 23.9 బిలియన్ డాలర్లకు చేరింది. 2017తో పోలిస్తే 13.4% వృద్ధి. 2021 నాటికి 33.6 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా.
- 2018–21 మధ్య కాలంలో ఈ వృద్ధికి ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ మీడియా ఊతంగా ఉండనున్నాయి. విభాగాలవారీ ఆదాయాలపరంగా టీవీ అగ్రస్థానంలో కొనసాగుతుంది.
- 2017లో 18.3 కోట్లుగా ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 2018లో 27.8 కోట్లకు ఎగబాకింది.
- టీవీ రంగం 2018లో 12 శాతం వృద్ధితో 10.6 బిలియన్ డాలర్ల స్థాయికి చేరింది. 2021 నాటికి ఇది 13.7 బిలియన్ డాలర్లకు చేరనుంది.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
23-7-2019

## థాయ్‌లాండ్ ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో మనీషా ముందంజ



ఈ సీజన్‌లో తమ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ భారత బాక్సర్లు మనీషా, దీపక్, ఆశిష్ థాయ్‌లాండ్ ఓపెన్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో తమ సూపర్ పంచ్‌లతో అదరగొట్టారు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లలో తమ ప్రత్యర్థులను కంగుతినిపించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. మహిళల 57 కేజీల విభాగంలో ఇండియన్ ఓపెన్ స్వర్ణ పతక విజేత మనీషా మౌన్ 5–0తో సజీవని శ్రీమలి (థాయ్‌లాండ్)పై గెలిచింది. పురుషుల 49 కేజీల విభాగంలో బరిలో దిగిన ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత దీపక్ సింగ్ 5–0తో సైద్ మోర్తాజ (మొరాకో)ను మట్టికరిపించాడు. 75 కేజీల విభాగంలో ఆశిష్ కుమార్ 4–1తో ఆఫిసిట్ కనంఖోఖ్మరే (థాయ్‌లాండ్)పై నెగ్గాడు.

# టోక్యో ఎంత దూరం?



### టైమింగ్ మరింత మెరుగైతేనే ఒలింపిక్స్‌కు హిమ దాస్ అర్హత

తన బెస్ట్‌ను అధిగమిస్తే క్వాలిఫై ● వరల్డ్ చాంపియన్‌షిప్‌కు ఖరారు కాని బెర్త్

పంతొమ్మిదేళ్ల యువ తరంగం... భారత మహిళా అథ్లెట్ హిమ దాస్ వరుసగా ట్రాక్‌పై అద్భుతాలు సాధిస్తోంది. 18 రోజుల వ్యవధిలో ఐదు స్వర్ణాలు గెలుచుకొని... అంతంత మాత్రంగా ఉన్న అథ్లెటిక్స్‌లో దేశం మొత్తం గర్వపడేలా చేసింది. ఫలితంగా క్రీడాభిమానులతో పాటు రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖులు హిమ ఘనతను కీర్తిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికపరంగా వెనుకబడిన వర్గానికి చెందిన నేపథ్యంతో పాటు ఇటీవల అసోం వరద బాధితుల కోసం పెద్ద మనసుతో ఆమె చేసిన సాయం కూడా ఆ అమ్మాయి స్థాయిని పెంచింది. దీంతో 2020 టోక్యో ఒలింపిక్స్ క్రీడలకు సంబంధించి హిమ దాస్‌పై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మన దేశానికి తొలి పతకం అందించగలదని, ఇటీవలి పంచ స్వర్ణాలు ఆమె సత్తా చాటాయని అంతా భావిస్తున్నారు. కాకపోతే ఇటీవలి ప్రదర్శన ఆమె కెరీర్‌లో అత్యుత్తమమేమీ కాదు. టోక్యోకు అర్హత సాధించటానికి సరిపోదు కూడా..!! ఒకవేళ ఆమె తన మునుపటి అత్యుత్తమ ప్రదర్శనను చేరుకుంటే, లేక అధిగమిస్తే మాత్రం... పతకాన్ని ఆశించవచ్చు. ఆ విశ్లేషణ ఇదిగో...!

**ఇటీవల గెలిచిన స్వర్ణాలు...**

**200 మీటర్లు**

- పోజ్నాన్ గ్రాండ్‌ప్రి (పోలండ్) : 23.65 సెకన్లు
- కుట్నో మీట్ (పోలండ్) : 23.97 సెకన్లు
- క్లాడ్నో మీట్ (చెక్ రిపబ్లిక్) : 23.43 సెకన్లు
- తాబోర్ మీట్ (చెక్ రిపబ్లిక్) : 23.25 సెకన్లు

**400 మీటర్లు**

- నోవ్ మెస్టో (చెక్ రిపబ్లిక్) : 52.09 సెకన్లు

**ఏ స్థాయి ఈవెంట్‌లంటే...**

అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఐఏఏఎఫ్) గుర్తింపు పొందిన ఈవెంట్లలో 'ఎ' నుంచి 'ఎఫ్' వరకు ఆరు రకాలు స్థాయిలున్నాయి. వీటిలో హిమ పతకాలు గెలిచిన ఐదులో రెండు 'ఎఫ్' కేటగిరీవి కాగా... మరో మూడు 'ఇ' కేటగిరీవి.

**ఎవరెవరు పాల్గొన్నారు...**

భారత అథ్లెట్ల బృందానికి పోలండ్‌లోని స్పాలాలో రెండు నెలల ప్రత్యేక శిక్షణ శిబిరం జరుగుతోంది. ప్రాక్టీస్‌తో పాటు రేస్‌లో అనుభవం కోసం స్పాలాకు చుట్టుపక్కల జరిగే ఈవెంట్లలో మనవాళ్లు పాల్గొంటున్నారు. హిమ గెలిచిన 400 మీటర్ల పరుగులో టాప్–5 అందరూ భారత అథ్లెట్లే ఉన్నారు. మిగతా దేశాలవారు కొందరు పాల్గొన్నా వారెవరికీ హిమకంటే మెరుగైన ర్యాంక్ లేదు.

**హిమ ప్రదర్శన ఎలా ఉంది?**

అథ్లెటిక్స్‌లో పతకాల్ని పక్కనబెడితే... టైమింగే ముఖ్యం. దీని ప్రకారం చూస్తే హిమ ప్రదర్శన ఇంకా మెరుగుపడాల్సి ఉందనే చెప్పాలి. ఎందుకంటే 200 మీటర్ల పరుగులో నమోదు చేసిన నాలుగు టైమింగ్‌లు కూడా ఆమె కెరీర్ అత్యుత్తమ టైమింగ్‌తో (23.10 సెకన్లు) పోలిస్తే చాలా వెనకబడినట్లే. 400 మీటర్ల పరుగులోనైతే కెరీర్ బెస్ట్ 50.79 సెకన్లతో పోలిస్తే 1.30 సెకన్ల తేడా అంటే చాలా చాలా ఎక్కువ!

**తాజా ప్రదర్శన ఉపయోగపడదా...**

అథ్లెటిక్స్‌కు సంబంధించి ఒలింపిక్స్ లేదా ప్రపంచ చాంపియన్‌షిప్! ఈ రెండే అత్యుత్తమ ఈవెంట్లు. ఇక్కడ చూపిన ప్రతిభనే క్రీడా ప్రపంచం గుర్తిస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 28 నుంచి దోహాలో ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుంది. దీనికి ఐఏఏఎఫ్ నిర్దేశించిన అర్హత ప్రమాణాలు 23.02 సెకన్లు (200 మీటర్లు), 51.80 సెకన్లుగా (400 మీటర్లు) ఉన్నాయి. క్వాలిఫికేషన్‌కు సెప్టెంబర్ 6 చివరి తేదీ. 200 మీటర్ల పరుగులో వచ్చే నెలలో మరో రెండు మీట్‌లు ఉండటంతో హిమకు ఇంకా అవకాశం ఉంది. 400 మీటర్ల పరుగులో మాత్రం ఆమెకు మరో ఈవెంట్ లేదు. దాంతో ఆమె క్వాలిఫై కానట్లే! తాజాగా పతకాలు గెలిచిన మీట్‌లలోనే ప్రత్యర్థులతో సంబంధం లేకుండా హిమ తన అత్యుత్తమ ఆటతీరు కనబరిచి ఉంటే క్వాలిఫై అయ్యేదేమో!!. కాకపోతే అది సాధ్యం కాలేదు.

**ఒలింపిక్స్‌పై ఆశలు...**

టోక్యో ఒలింపిక్స్‌కు చాలా సమయం ఉంది. ట్రాక్‌పై టైమింగ్ ప్రకారమే కాకుండా మెరుగైన ర్యాంకింగ్ ఆధారంగా కూడా ఒలింపిక్స్‌కు అర్హత సాధించవచ్చు. అయితే ర్యాంకింగ్‌కు సంబంధించి ఉండే గణాంకాలు, లెక్కల కారణంగా చివరి వరకు చాలా గందరగోళం ఉంటుంది. కాబట్టి అథ్లెట్లు ఎక్కువగా టైమింగ్‌పైనే దృష్టి పెడతారు. 22.80 సెకన్లు (200 మీటర్లు), 51.35 సెకన్లు (400 మీటర్లు) టోక్యో ఒలింపిక్స్‌కు అర్హతగా నిర్ణయించారు. ఇందులో 200 మీటర్లలో హిమ చాలా మెరుగవ్వాలి. 400 మీ. విషయంలో మాత్రం గతంలో ఇంతకంటే బెస్ట్ టైమింగ్ నమోదు చేసింది కాబట్టి అది స్ఫూర్తినివ్వవచ్చు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో వెన్ను నొప్పితో ఆసియా చాంపియన్‌షిప్ నుంచి మధ్యలోనే తప్పకున్న హిమ దాస్ ఇటీవలే కోలుకుంది. అదే క్రమంలో తాజా యూరోప్ ఈవెంట్లలో పాల్గొన్నది. మెరుగైన టైమింగ్ కోసం తన పని తాను చేసుకుపోతోంది. ఇదే దారిలో వెళితే ముున్ముందు తన టైమింగ్‌ను మెరుగుపర్చుకుని, మరిన్ని పతకాలు సాధించగల సత్తా ఆమెలో ఉంది. సహజ ప్రతిభ కలిగిన హిమ అద్భుత ఆటతో క్వాలిఫై కావటం, పతకాల ఆశల్ని సజీవంగా ఉంచగలగటం... అసాధ్యమైతే కాదు.

# శ్రీజ తీన్‌మార్

- కామన్వెల్త్ టీటీ పోటీల్లో మూడు పతకాలు నెగ్గిన తెలంగాణ అమ్మాయి
- వ్యక్తిగత విభాగంలోనూ భారత్ క్లీన్‌స్వీప్
- 1975 తర్వాత ఈ ఘనత సాధించిన రెండో జట్టుగా రికార్డు

**కటక్:** సొంతగడ్డపై జరిగిన కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగంలోనూ భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. ఇంతకుముందు టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణాలు నెగ్గగా... సోమవారం ముగిసిన వ్యక్తిగత విభాగంలో అందుబాటులో ఉన్న ఐదు పసిడి పతకాలను భారత క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మూడు పతకాలు సాధించింది. మహిళల డబుల్స్‌లో మౌసుమి పాల్‌తో జతకట్టి బరిలోకి దిగిన శ్రీజ రజతం సాధించగా... మహిళల సింగిల్స్‌లో సెమీస్‌లో ఓడి ఆమె కాంస్యం సంపాదించింది. ఆదివారం మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో శ్రీజ–ఆచంట శరత్ కమల్ జోడీ సెమీస్‌లో ఓడి కాంస్యం దక్కించుకుంది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో శ్రీజ 8–11, 9–11, 11–9, 8–11, 12–14తో మధురిక పాట్కర్ (భారత్) చేతిలో ఓడింది. డబుల్స్ ఫైనల్లో శ్రీజ–మౌసుమి పాల్ ద్వయం 9–11, 8–11, 11–9, 10–12తో పూజా సహస్రబుద్దె–కృత్విక సిన్హా రాయ్ (భారత్) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

పురుషుల, మహిళల సింగిల్స్ విభాగంలో వరుసగా హర్మీత్ దేశాయ్, అహిక ముఖర్జీ కామన్వెల్త్ చాంపియన్స్‌గా అవతరించారు. ఫైనల్స్‌లో హర్మీత్ 9–11, 6–11, 11–5, 11–8, 17–15, 7–11, 11–9తో సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్)పై, అహిక 11–6, 11–4, 11–9, 11–7తో మధురిక (భారత్)పై విజయం సాధించారు. పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆంథోనీ అమల్‌రాజ్–మానవ్ ఠక్కర్ (భారత్) జంట 8–11, 11–6, 13–11, 12–10తో సత్యన్–శరత్ కమల్ (భారత్) ద్వయంపై గెలిచి టైటిల్ గెలిచింది. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సత్యన్–అర్చన కామత్ జంట స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. ఓవరాల్‌గా ఈ పోటీల్లో భారత్ అందుబాటులో ఉన్న 7 స్వర్ణాలను సొంతం చేసుకుంది. స్వర్ణాలే కాకుండా భారత క్రీడాకారులు ఐదు రజతాలు, మూడు కాంస్యాలనూ సాధించి 15 పతకాలతో అదరగొట్టారు. 1975లో ఇంగ్లండ్ తర్వాత కామన్వెల్త్ టీటీ చాంపియన్‌షిప్‌లో అన్ని విభాగాల్లో పసిడి పతకాలు నెగ్గిన జట్టుగా భారత్ రికార్డు నెలకొల్పింది.



# జైపూర్ పింక్ పాంథర్స్ పంజా

- యు ముంబాపై ఘనవిజయం
- ప్రొ కబడ్డీ సీజన్–7



**సాక్షి, హైదరాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ మాజీ చాంపియన్స్ జైపూర్ పింక్ పాంథర్స్ ఏడో సీజన్‌ను ఘనవిజయంతో ప్రారంభించింది. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌ను ఓడించి దూకుడు మీదున్న యు ముంబా ఆటలు జైపూర్ పింక్ పాంథర్స్ ముందు సాగలేదు. సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 42–23 తేడాతో యు ముంబాను ఓడించింది. జైపూర్ జట్టు 25 రైడ్ పాయింట్లు, 11 టాకిల్ పాయింట్లతో హోరెత్తించగా... యు ముంబా 18 రైడ్ పాయింట్లు, 5 టాకిల్ పాయింట్లతో పాంథర్స్‌ను అందుకోలేకపోయింది. పాంథర్స్ తరపున దీపక్ హుడా 11 పాయింట్లతో మెరిశాడు. అతనికి నితిన్ (7 పాయింట్లు), దీపక్ (6 పాయింట్లు), అమిత్ హుడా (5 పాయింట్లు) చక్కని సహకారం అందించారు. యు ముంబా తరపున అభిషేక్ (7 పాయింట్లు), డాంగ్ జీన్ లీ (6 పాయింట్లు) పర్వాలేదనిపించారు.

**దడదడలాడించిన దీపక్...**

ఆట ఆరంభం నుంచి దూకుడును ప్రదర్శించిన పాంథర్స్ ఏ దశలోనూ యు ముంబాకు కోలుకునే అవకాశాన్నివ్వలేదు. ముఖ్యంగా దీపక్ హుడా తన రైడ్లతో ప్రత్యర్థిని దడదడలాడించాడు. తన తొలి రెండు రైడ్లలో మూడు పాయింట్లు సాధించి జైపూర్‌కు మంచి ఆరంభాన్నిచ్చాడు. ఖాతా తెరవడానికే 4 నిమిషాల సమయం తీసుకున్న యు ముంబా ఏ దశలోనూ జైపూర్ డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. మొదటి అర్ధ భాగం ముగిసే సరికి జైపూర్ 22–9 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. రెండో భాగంలోనూ పింక్ పాంథర్స్ ఇదే దూకుడును చివరి వరకు కొనసాగించింది. ప్రత్యర్థిని మూడుసార్లు ఆలౌట్ చేసిన పాంథర్స్ ఒక్క సారి కూడా ఆలౌట్ కాలేదు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ జట్టు 34–24తో పుణేరి పల్టన్‌పై గెలుపొందింది. హరియాణా జట్టు స్టార్ రైడర్ నవీన్ 14 పాయింట్లతో ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించాడు. మంగళవారం మ్యాచ్‌లకు విశ్రాంతి దినం. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాతో బెంగాల్ వారియర్స్; దబంగ్ ఢిల్లీతో తెలుగు టైటాన్స్ తలపడతాయి.



# మనోళ్ల సత్తాకు పరీక్ష

నేటి నుంచి జపాన్ ఓపెన్ టోర్నీ ● బరిలో సింధు, శ్రీకాంత్, సాయిప్రణీత్

**టోక్యో:** ఈ ఏడాది లోటుగా ఉన్న అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాలనే లక్ష్యంతో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు మరో టోర్నీకి సిద్ధమయ్యారు. నేడు మొదలయ్యే జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నమెంట్‌లో పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, ప్రణయ్, సమీర్ వర్మ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తొలి రోజు పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో పదో ర్యాంకర్ కెంటో నిషిమోటా (జపాన్)తో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ఆడనున్నాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో గో సె ఫె–నూర్ ఇజుద్దీన్ (మలేసియా)లతో సుమీత్ రెడ్డి–మనూ అత్రి; మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో మార్విన్ సీడెల్–లిండా ఎఫ్లెర్ (జర్మనీ)లతో సాత్విక్ సాయిరాజ్–అశ్విని పొన్నప్ప తలపడతారు. బుధవారం జరిగే సింగిల్స్ మ్యాచ్‌ల్లో హాన్ యుయె (చైనా)తో పీవీ సింధు; ప్రణయ్‌తో శ్రీకాంత్; ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో సమీర్ వర్మ పోటీపడతారు. గతవారం ఇండోనేసియా ఓపెన్ టోర్నీలో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచిన సింధుకు ఈ టోర్నీలో క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. తొలి రౌండ్‌ను అధిగమిస్తే ఆమె ప్రిక్వార్టర్ ఫైనల్లో కిర్‌స్టీ గిల్మోర్ (స్కాట్లాండ్) లేదా అయా ఒహోరి (జపాన్)తో ఆడుతుంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే సింధుకు క్వార్టర్ ఫైనల్లో ఇండోనేసియా ఓపెన్ విజేత అకానె యామగుచి (జపాన్), సెమీఫైనల్లో రెండో సీడ్ చెన్ యుఫె (చైనా) ప్రత్యర్థులుగా ఎదురు కావొచ్చు.

# మరో ఏడాది గడువు!

## లియాండర్ పేస్ కేసు

**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్, అతనితో సహజీవనం చేసిన మాజీ స్నేహితురాలు రియా పిళ్లై మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న 'కుటుంబ సంరక్షణ కేసు'లో దిగువ కోర్టుకు సుప్రీం కోర్టు మరో ఏడాది గడువు ఇచ్చింది. పేస్, రియా మధ్య ఉన్న వివాద పరిష్కారానికి సంవత్సరం వ్యవధి ఇచ్చి ఆపై తీర్పునివ్వాలని ఫ్యామిలీ కోర్టును అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. 2014లో పేస్‌పై రియా గృహ హింస కేసు పెట్టడంతో తొలిసారి వివాదం కోర్టుకు చేరింది. తమ కూతురు సంరక్షణ, భరణం అంశాల్లో వీరిద్దరి మధ్య వివాదం ముదిరింది. వీరిద్దరు కూర్చొని సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించినా అది సాధ్యం కాలేదు. భరణం కింద ఇల్లు గానీ డబ్బు గానీ ఇవ్వాలని రియా కోరగా... తాను అసలు ఆమెను పెళ్లే చేసుకోలేదు కాబట్టి కుదరదని పేస్ కోర్టులో మరో కేసు దాఖలు చేశాడు.



# విజయంతో ముగించారు

- చివరి వన్డేలో విండీస్ 'ఎ'పై భారత్ 'ఎ' 8 వికెట్లతో గెలుపు
- రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ మిస్ ● సిరీస్ 4–1తో టీమిండియా సొంతం



**అంటిగ్వా:** వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన ఐదు వన్డేల అనధికారిక సిరీస్‌ను భారత్ 'ఎ' జట్టు విజయంతో ముగించింది. చివరి వన్డేలో భారత్ 'ఎ' జట్టు 8 వికెట్ల తేడాతో విండీస్ 'ఎ'పై ఘన విజయం సాధించింది. దీంతో పాటు సిరీస్‌ను 4–1తో కైవసం చేసుకుంది. ఛేదనలో రుతురాజ్ గైక్వాడ్ (89 బంతుల్లో 99; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) తృటిలో శతకాన్ని చేజార్చుకోగా... మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (40 బంతుల్లో 69; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు శ్రేయస్ అయ్యర్ (64 బంతుల్లో 61; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) బాధ్యతాయుత ఇన్నింగ్స్ జట్టుకు అలవోక విజయాన్ని అందించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 'ఎ' జట్టు 47.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. సునీల్ ఆంబ్రిస్ (52 బంతుల్లో 61; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ రూథర్‌ఫోర్డ్ (70 బంతుల్లో 65; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. వెస్టిండీస్ పర్యటనకు వెళ్లే సీనియర్ భారత జట్టులో చోటు సంపాదించిన దీపక్ చహర్, రాహుల్ చహర్, నవ్‌దీప్ సైనీ చెరో రెండు వికెట్లతో రాణించారు. అనంతరం 237 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన భారత జట్టు 33 ఓవర్లలో 2 వికెట్లను కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు రుతురాజ్, శుబ్‌మాన్ గిల్‌లు మొదటి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. సెంచరీకి పరుగు దూరంలో గైక్వాడ్ పెర్రీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరగగా... మిగిలిన పనిని శ్రేయస్ అయ్యర్ పూర్తి చేశాడు.

# బంగ్లాతో తొలి వన్డే తర్వాత...

### వన్డేలకు మలింగ గుడ్‌బై

**కొలంబో:** శ్రీలంక స్టార్ బౌలర్ లసిత్ మలింగ వన్డే క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నాడు. ఈ నెల 26న బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్ తర్వాత వన్డేలకు మలింగ గుడ్‌బై చెబుతున్నట్లు లంక కెప్టెన్ దిముత్ కరుణరత్నే ప్రకటించాడు. ఈ విషయం మలింగ తనకు చెప్పాడని కరుణరత్నే వెల్లడించాడు. 36 ఏళ్ల మలింగ 15 ఏళ్ల కెరీర్‌లో 225 వన్డేల్లో 29.02 సగటుతో 335 వికెట్లు పడగొట్టాడు. మురళీధరన్ (523), చమిందా వాస్ (399) తర్వాత వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన లంక బౌలర్‌గా అతను నిలిచాడు.



2018 AP TET-I స్టేట్ ఫస్ట్ కుసుమ 146/150
2018 APSGT స్టేట్ ఫస్ట్ కుసుమ 91.07/100
ప్రగతి DSC
గ్రామ సచివాలయ ఉద్యోగాలు
TET–I + SGT
కొత్తబ్యాచ్‌లు ప్రారంభం : 29-7-2019
98852 72474, 73821 78356

గ్రామ / వార్డు సచివాలయం
1,33,867 ఉద్యోగాలు
Separate Batches For TM/EM
IACE 97000 77833 97000 77211

SATYA ONLINE IAS ACADEMY
www.satyaiasacademy.com
APPSC - Gr-I, II & P.S.(Mains), S.I
S.I Post పొందిన మన విద్యార్థులకు Congrats.
గ్రామ - వార్డు సచివాలయాలకి తరగతులు జరుగుతున్నాయి.
Follow us: @/SatyaonlineIAS Academy
For Registration 95057 53375 99854 59450 95336 46703 80964 11709

SI & కానిస్టేబుల్స్
AP S.I ఫలితాలలో భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ సంచలనం. State 1st Rankతో పాటు అన్ని Zoneలలో టాప్10 ర్యాంకులు సాధించిన మా విద్యార్థులకు హార్థిక శుభాకాంక్షలు. మాల్యాద్రిసార్ గైడెన్స్‌తో Aug 5th నుండి న్యూ బ్యాచ్ ప్రారంభం.
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్
చైతన్యపురి, DSNR, Hyd
040-66338639, 24064477

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.